

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹5.00

సంపుటి: 10
సంచిక: 350

సోమవారం 12-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సర్వోన్నత స్థాయికి.. జిన్‌పింగ్

అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులపై పరిమితిని ఎత్తివేసిన చైనా పార్లమెంటు - 8లో



అఖిల్‌కు స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు నాలుగో పసిడి పతకం - స్పోర్ట్స్‌లో

అప్పు కోసం 'తప్పు'.. అసలుకే ముప్పు?

ఎక్కువ అప్పులు తెచ్చుకోవడానికి బడ్జెట్‌లో లెక్కల మాయ

- రూ.5,235 కోట్ల మేర రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి తప్పుడు సంకేతాలు
- రెవెన్యూ లోటు భర్తీని కేంద్రం ఎగ్గొట్టే అవకాశం
- రాష్ట్రానికి భారీ నష్టం తప్పదంటున్న అధికారులు
- రూ.వేల కోట్ల నిధులను ఆపేస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్న

సాక్షి, అమరావతి

లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రానికి చట్ట ప్రకారం ఆర్థిక సాయం చేస్తామని చెబితే అదేం వద్దంటోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. మా దగ్గర అవసరాని కంటే ఎక్కువ డబ్బులున్నాయి, మీ సాయం మాకేం అక్కర్లేదని ముఖం మీదే చెబుతోంది. ఎందుకు ఇలా చేస్తోందని ఆరా తీస్తే... బయటి నుంచి ఎక్కువ అప్పులు తెచ్చుకోవడానికట! ఈ పరిణామం పట్ల అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత 2014–15 ఆర్థిక సంవత్సరంలో ఏర్పడిన రెవెన్యూ లోటును కేంద్రం నుంచి పొందడానికి ప్రభుత్వం ఇప్పటికే తిప్పలు పడుతున్న సంగతి తెలిసిందే. నాలుగేళ్లయినా రెవెన్యూ లోటు కింద రావాల్సిన నిధులను పూర్తిస్థాయిలో రాబట్టలేకపోయింది. ఇలాంటి

మిగతా 5వ పేజీలో ▶



బడ్జెట్ అంతా తప్పుడు లెక్కలే..

- రాష్ట్ర లెక్కలు, కాగ్ లెక్కలకు ఎంతో తేడా
- రెవెన్యూ మిగులు ఎలా సాధ్యం?
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- ఒక్కో వ్యక్తిపై రూ. 25వేల అప్పు చేశారు..
- పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



7లో

మిగులు ఎక్కడిది?

5లో

సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్

టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

- చివరి నిమిషం వరకు హైడ్రామా..
- వర్ల రామయ్యకు అవకాశం ఇస్తున్నట్లు లీకులు
- హఠాత్తుగా కనకమేడల పేరును తెరపైకి తెచ్చిన టీడీపీ అధినేత
- కంగుతిన్న పార్టీ సీనియర్లు.. మీడియాకు ముఖం చాటేసిన వైనం

- వివరాలు 2లో

ఊరించి.. చివరికి హ్యాండిచ్చి



రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీడీపీ ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి

- అవమానకర రీతిలో తప్పించడంపై వర్ల రామయ్య మనస్తాపం
- పార్టీ నేతలను విస్మరించడంపై సీనియర్ల ఆగ్రహం

2లో

సౌర విప్లవం సాధించాలి

అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష



- అందరికీ చవకైన సౌర విద్యుత్ అందేలా చూడాలని పిలుపు
- 2022 నాటికి 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్తే లక్ష్యం
- సోలార్ ప్రాజెక్టులకు రాయితీలపై రుణాలు సమకూర్చాలి: మోదీ
- మోదీ ఆలోచన నిజం చేశామన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

8లో



'యంత్రం'లో అవినీతి తంత్రం!

వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల పనుల్లో భారీ అవినీతి

- తవ్వకం యంత్రాల కొనుగోలుకు గతంలోనే నిధులిచ్చిన ప్రభుత్వం
- మళ్లీ టీబీఎంల కొనుగోలు, బుష్‌లు, కన్వేయర్ బెల్ట్ మార్పునకు రూ.224.09 కోట్లు కేటాయింపు
- కోటరీ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించేందుకు రంగం సిద్ధం
- కమీషన్లు కొట్టేయడానికి 'ముఖ్య'నేత స్కెచ్

సాక్షి, అమరావతి

మీ ఇంటి నిర్మాణ పనులను ఓ మేస్త్రీకి అప్పగించారనుకుందాం. యంత్ర సామగ్రి కొనుగోలుకు అవసరమైన డబ్బులను మీరే ఇచ్చారు. పనుల్లో జాప్యం చేస్తుండడంతో ఆ మేస్త్రీని తొలగించి, మరో మేస్త్రీకి బాధ్యతలు అప్పగించారు. గతంలో కొనుగోలు చేసి, కొంతకాలం ఉపయోగించిన యంత్ర సామగ్రినే మళ్లీ కొనాలి అంటే ఎవరైనా డబ్బులిస్తారా? రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మాత్రం అదే పనిచేస్తోంది. ఏకంగా రూ.224.09 కోట్లను వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఆ సొమ్మంతా చివరికి ఎవరి జేబుల్లోకి వెళ్తుందో సులభంగా అర్థం చేసుకోవచ్చు.

కోటరీ కాంట్రాక్టర్లకే ఇవ్వాలట!

వెలిగొండ ప్రాజెక్టు పనులను 2016 జూన్ నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, పనులు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో గడువును 2019 మార్చి వరకూ

మిగతా 7వ పేజీలో ▶

కదంతొక్కిన 'మహా' రైతన్న

- అన్నదాతలు ఆదివారం ముంబై నగరాన్ని ముంచెత్తారు. డిమాండ్ల సాధన కోసం దాదాపు 50 వేల మంది మహారాష్ట్ర రైతులు ముంబైలో అడుగుపెట్టారు. వారంతా సోమవారం అసెంబ్లీని ముట్టడించనున్నారు.

- వివరాలు 8లో

ప్రకాశం జిల్లా ఈపూరుపాలెంలో ఆదివారం రాట్నంతో నూలు వడుకుతున్న నేతన్న వెంకటసుబ్బయ్య సమస్యలు వింటున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



చీరాల వీధుల్లో జనజాతర

అడుగడుగునా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

- మరోవైపు తమ బాధలు చెప్పుకున్న జనం
- నాలుగేళ్లుగా ఈ సర్కారుతో అగచాట్లు పడుతున్నామని ఆవేదన
- పేదల పట్ల కనికరం చూపడం లేదని ఆగ్రహం
- అందరి సమస్యలు ఓపికగా విన్న జననేత
- మనందరి ప్రభుత్వం రాగానే ఆదుకుంటామని భరోసా

6లో

ప్రకాశించిన ప్రజా సంకల్పం

- ప్రకాశం జిల్లాలో ముగిసిన ప్రతిపక్ష నేత పాదయాత్ర

ఇదంజగత్



నలుగురు ట్రెక్కర్ల సజీవ దహనం

- తమిళనాడులోని తేని జిల్లా బోడినాయకనూర్ అడవుల్లో మంటలు
- 15 మందిని రక్షించిన అధికారులు

8లో



గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది



విశ్రాంత జీవనానికి.. ఈ ఫండ్లు బెటర్..!

రిటైరయ్యాక అవసరమైనది నిధి
ప్రస్తుతానికి గణనీయంగా పన్ను ఆదా

- రిస్క్ ఆధారంగా అందుబాటులో ఎన్నో ఫండ్స్.. మూడు నుంచి ఐదేళ్ల లాకిన్ పీరియడ్
- అవసరమైతే ఆ తర్వాత వైదొలిగే అవకాశం
- కాస్తంత భారంతో ముందే వైదొలగవచ్చు కూడా

- బిజినెస్‌లో

తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్‌ను ఎంపిక చేసిన సీఎం

సాక్షి, అమరావతి: టీడీపీ రాజ్యసభ అభ్యర్థులుగా సీఎం రమేశ్, న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్‌ను ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వీరిద్దరూ సోమవారం నామినేషన్లు దాఖలు చేస్తారని తెలిపారు. కాగా, ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న సీఎం రమేశ్ పదవీ కాలం ఈ నెలలో ముగియనుంది. సీఎం రమేశ్‌కు రెండోసారి అవకాశం ఇచ్చేందుకు మొదట్లో సుముఖత వ్యక్తం చేయకపోయినా.. చివరకు ఆయన పేరునే చంద్రబాబు ఖరారు చేశారు. మరోవైపు రెండో అభ్యర్థిగా న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ పేరును హఠాత్తుగా తెరపైకి తీసుకొచ్చారు. రవీంద్ర గతంలో టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా.. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బార్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. టీడీపీకి సంబంధించిన పలు కేసులను రవీంద్ర హైకోర్టులో వాదించారు. ఈయన పేరు చివరి నిమిషంలో చంద్రబాబు తెరపైకి తేవడం.. ఆ వెనువెంటనే ఖరారు చేయడంతో టీడీపీ సీనియర్లంతా కంగుతిన్నారు.

ఎంపికలో హైడ్రామా..

అభ్యర్థుల ఎంపికపై రెండు రోజుల నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు హైడ్రామా నడిపించారు. శనివారం ఆశావహులందరినీ కలిశారు. చివరకు సీఎం రమేశ్, వర్ల రామయ్య, బీద మస్తాన్‌రావుల్లో ఇద్దరికి అవకాశం కల్పించనున్నట్లు లీకులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశం ఇస్తానని చెప్పి.. బీదా మస్తాన్‌రావును ఆదివారం రేసు నుంచి తప్పించారు. దీంతో సీఎం రమేశ్, వర్ల రామయ్యకు లైన్‌క్లియర్ అయ్యిందని అంతా భావించారు. అందుబాటులో ఉండాలని వీరిద్దరికి పార్టీ కార్యాలయం నుంచి సమాచారం కూడా అందింది. కొద్దిసేపట్లో కళా వెంకట్రావు అభ్యర్థులిద్దరితో కలిసి మీడియా సమావేశం నిర్వహిస్తారని మీడియాకు లీకులు కూడా ఇచ్చారు. దీంతో వర్ల రామయ్య తనకు అవకాశమిచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతూ పలు చానళ్లతో మాట్లాడారు. కానీ ఆ తర్వాత కొద్దిసేపటికే సీన్ రివర్స్ అయ్యింది. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, పార్టీ అధ్యక్షుడు కళా వెంకట్రావు సీఎం నివాసం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు. అభ్యర్థులపై ఇంకా చర్చ జరుగుతోందని.. సాయంత్రం అధికారిక ప్రకటన వెలువడనుందని కళా వెంకట్రావు మీడియాకు చెప్పి నిష్క్రమించారు. ఆ వెంటనే టీడీపీ కార్యాలయం నుంచి కళా వెంకట్రావు పేరుతో.. సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్‌ను రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు ప్రకటన రావడం గమనార్హం. పార్టీ అధినేత చంద్రబాబు స్వయంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. అభ్యర్థులను పరిచయం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం ఇందుకు విరుద్ధంగా కళా వెంకట్రావును మీడియా సమావేశం నిర్వహించాలని సూచించారు. చివరకు ఆయన కూడా మీడియాకు ముఖం చాటేసి అభ్యర్థుల ఎంపికపై ఓ ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. అభ్యర్థుల ఎంపికపై ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే తమ ముఖ్య నేతలు ఈ విధంగా మీడియాకు ముఖం చాటేశారని స్వయంగా టీడీపీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

కృష్ణా జిల్లా వాసి కనకమేడల



సాక్షి, హైదరాబాద్: టీడీపీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన కనకమేడల రవీంద్రకుమార్ 1956 ఆగస్టు 8న కృష్ణా జిల్లా కోడూరు మండలం జయపురం గ్రామంలో జన్మించారు. 1983లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగపరమైన అంశాలకు సంబంధించిన కేసులను వాదించడంలో మంచి పేరు సంపాదించారు. 2006లో మొదటిసారి బార్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. 2012లో మరోసారి ఆయన బార్ కౌన్సిల్ సభ్యునిగా గెలుపొందారు. రవీంద్ర సుదీర్ఘ కాలంగా తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణకు ఆయన అత్యంత సన్నిహితుడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తరపున అనేక కీలక కేసుల్లో వాదనలు వినిపించారు.

తెలంగాణలో ముగ్గురూ ఖరారు

రాజ్యసభ రేసులో సంతోశ్, బడుగుల, బండ ప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ తరపున రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులు ఖరారయ్యారు. జోగినపల్లి సంతోశ్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్ ఆ పార్టీ తరపున రాజ్యసభకు పోటీ చేయనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో అధినేత కేసీఆర్ ఈ ముగ్గురి పేర్లను అధికారికంగా ప్రకటించారు. మొదటి నుంచీ అనుకున్న విధంగా కేసీఆర్‌కు సన్నిహితుడైన సంతోశ్‌కు అవకాశం దక్కగా, మిగిలిన ఇద్దరు అభ్యర్థుల విషయంలో మాత్రం అనూహ్య నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లగొండ జిల్లాకు చెందిన బడుగుల లింగయ్య యాదవ్‌కు అవకాశమిచ్చిన కేసీఆర్ అదే రీతిలో వరంగల్ జిల్లాకు చెందిన బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను కూడా పెద్దల సభ రేసులో నిలబెట్టి పార్టీ నేతలను సైతం ఆశ్చర్యపరిచారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన బడుగుల లింగయ్య 2015లో టీఆర్ఎస్‌లో చేరారు.

- బలం లేకపోయినా బరిలో స్వతంత్ర అభ్యర్థి పేరుతో మూడో అభ్యర్థి?
- రాజ్యసభ ఎన్నికలకు రంగంలోకి దిగిన 'ఏపీ రేవంత్‌లు'
- ప్రలోభాలకు తెరతీసిన టీడీపీ 'ముఖ్యనేత'
- టీడీపీ పెద్దల రాయ'బేరాలు'
- ఎవరు ఏం మాట్లాడారో సాక్ష్యాలుగా ఆడియోటేపులు, వీడియోలు
- సాక్ష్యాలున్నాయంటున్న వైఎస్సార్‌సీపీ
- సాక్ష్యాలలో ముఖ్యనేత పేరు ఉందా.. టీడీపీ నేతల్లో తీవ్ర ఉత్కంఠ..

ఏపీలోనూ 'ఓటుకు కోట్లు'!

సాక్షి, అమరావతి

ఈనెల 23 న జరగనున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు రాష్ట్రంలో వేడి రగిలించాయి. బలం లేకపోయినా స్వతంత్ర అభ్యర్థి పేరుతో మూడో అభ్యర్థిని బరిలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించిందని వార్తలు వినిపిస్తున్నాయి. 'ముఖ్యనేత' ఆదేశాల మేరకు అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు రంగంలోకి దిగి విపక్ష ఎమ్మెల్యేలకు ప్రలోభాలు ఎరవేస్తున్నారని తెలుస్తోంది. డబ్బులు, కాంట్రాక్టులు, పదవులు ఎరవేస్తూ.. నీతిబాహ్యమైన రీతిలో ఎమ్మెల్యే ఓట్లను కొనుగోలు చేసేందుకు దిగజారారని సమాచారం. మరోవైపు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో టేపుల్లో అడ్డంగా దొరికిపోయిన తెలుగుదేశం నాయకులు ఇపుడు కూడా అదే తరహాలో సాక్ష్యాలతో సహా దొరికిపోయారని వార్తలు వినిపిస్తుండడం సంచలనంగా మారింది. రేవంత్ తరహాలో ఏపీలో దొరికిన టీడీపీ పెద్దలు ఎవరు?.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలతో వారు ఏం మాట్లాడారు? ముఖ్యనేత పేరు కూడా ప్రస్తావించారా..? 'ముఖ్యనేత' చెబితేనే మీతో ఈ మాట మాట్లాడుతున్నామంటూ బేరమాడారా..? త్వరలోనే ఆ ఆడియో వీడియో టేపులు బయటకు రానున్నాయా... అన్నవి రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశాలుగా మారాయి.

ముఖ్యనేత తెర వెనుక వ్యవహారం!

రాష్ట్రంలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో మూడో సీటు కోసం 'ముఖ్యనేత' తెరవెనుక నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. ఎమ్మెల్యేలను ఎంతకైనా కొనుగోలు చేయాలని 'ముఖ్యనేత' సంప్రదింపులు జరిపించారని వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన రాయ'బేరాల' సాక్ష్యాలు ప్రతిపక్షపార్టీకి చెందిన సీనియర్ నాయకులకు చేరాయన్న విషయం టీడీపీలో కలకలం సృష్టిస్తోంది. ఇలా ప్రలోభాలకు దిగిన నాయకులు మాట్లాడిన మాటలను ఆడియో వీడియో టేపులలో ఎమ్మెల్యేలు రికార్డు చేసినట్లు సమాచారం. ఈ సాక్ష్యాలను సరైన సమయంలో బయట పెడతామని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇటీవల ప్రకటించడం తెలుగుదేశం వర్గాల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే తెలంగాణలో ఓటుకు కోట్లు కేసులో తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దోషిగా నిండా మునిగిపోయారని, తత్ఫలితంగా అక్కడ పార్టీనే బలిపెట్టాల్సి వచ్చిందని టీడీపీ నాయకులు గుర్తుచేస్తున్నారు.

బలాబలాలను బట్టి టీడీపీకి 2, వైఎస్సార్‌సీపీకి 1

ప్రస్తుతం శాసనసభలో అధికార తెలుగుదేశం పార్టీతో పాటు మిత్రపక్షమైన బీజేపీ సభ్యులతో కలిపి తెలుగుదేశానికి కేవలం రెండు సీట్లకు సరిపడా బలం మాత్రమే ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి ఉన్న 44 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని అనుసరించి ఒకస్థానం వస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిచ్చి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడంతో పాటు వారిలో నలుగురిని తన కేబినెట్లోనూ చోటు కల్పించడం తెలిసిందే. సోమవారంతో నామినేషన్లకు తుది గడువు కాగా వైఎస్సార్ కాంగ్రెస్ తరపున వేమిరెడ్డిప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెండింటికే నామినేషన్లు వేస్తే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. మూడో అభ్యర్థిని బరిలోకి దింపితే కనుక ఎన్నిక అనివార్యమవుతుంది. అప్పుడు అసెంబ్లీలోని సభ్యుల మొత్తం సంఖ్యను అనుసరించి మొదటి ప్రాధాన్యత ఓటు కింద 44 మంది ఓట్లు దక్కించుకున్న వారు విజయం సాధించినట్లే.

ఫిరాయింపు ఎమ్మెల్యేలలో అంతర్మథనం..

చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఆయనతో పాటు మంత్రులు చేసిన అనేక అవినీతి వ్యవహారాలు, తమ సొంతమనుషులకోసం చేసిన అక్రమాలతో పాటు ప్రజావ్యతిరేక నిర్ణయాలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనుంచి టీడీపీలో చేర్చుకున్న అనేకమంది ఎమ్మెల్యేలు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు. ప్రలోభాల వల్ల టీడీపీలోకి వెళ్లిన తమను ఆ సమయంలో వాడుకొని తరువాత నుంచి కరివేపాకుల్లా పక్కన పెట్టారని అసంతృప్తితో ఉన్నారు. వీరిలో కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై ప్రలోభాల వల

విపక్ష ఎమ్మెల్యేలపై ప్రయోగించిన ప్రలోభాలు రకరకాలుగా ఉన్నాయి. ఒక ఎమ్మెల్యేని కలుసుకున్న నాయకుడు ఏకంగా మంత్రి పదవి ఆఫర్ చేయగా.. మరో ఎమ్మెల్యే వద్దకు తెల్లవారుఝామున ఎవరి కంటా పడకుండా వచ్చి రకరకాలుగా ప్రలోభపెట్టడానికి ప్రయత్నించారట. మనం ఇద్దరిదీ ఒకటే కులం.. నువ్వు అధికారపార్టీకి మద్దతిస్తే మనకు చాలా మేలు జరుగుతుంది అని మరో ఎమ్మెల్యేని ఒప్పించే ప్రయత్నం చేశారు.. మన ఇద్దరిదీ బాల్య స్నేహం.. నీకు రూ.30 కోట్ల వరకు ఇప్పిస్తాను అని మరో నాయకుడు ఒక ఎమ్మెల్యేకు ఆఫర్ చేశారని తెలిసింది.

ప్రజా సంక్షేమమే ఊపిరి

- 8వ ఏడాదిలోకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- ఉప ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం
- జనం పక్షాన అవిశ్రాంత పోరాటాలు
- సుదీర్ఘ పాదయాత్రకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ శ్రీకారం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



సాక్షి, అమరావతి

స్వార్థ రాజకీయ శక్తుల కుట్రలు, కుతంత్రాలను ఛేదించుకుంటూ.. ప్రజా సంక్షేమమే ఊపిరిగా అవిశ్రాంత పోరాటాలు కొనసాగిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సప్త వర్షాలు పూర్తి చేసుకుని ఈ నెల 12న ఎనిమిదో ఏడాదిలోకి అడుగిడుతోంది. తెలుగు ప్రజల ఆకాంక్షల మేరకు ఒక చారిత్రక అవసరంగా 2010 మార్చి 12న ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ అనతి కాలంలోనే బలీయమైన శక్తిగా ఎదిగింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తరువాత సంక్షోభాలు రాష్ట్రాన్ని కుదిపివేస్తున్న తరుణంలో పుట్టిన పార్టీని మొగ్గలోనే తుంచేయాలని వ్యతిరేక శక్తులు చేసిన కుట్రలేవీ ఫలించలేదు. పార్టీని స్థాపించేటప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ ఒక్కరే తోడుగా నిలిచారు.

ఉప ఎన్నికల్లో చారిత్రక ఘట్టం

కేవలం ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే బలంతో ప్రస్థానం సాగించిన వైఎస్సార్‌సీపీ ఇంతింతై... వటుడింతై అన్నట్లుగా పైకి ఎదిగింది. 2014 ఎన్నికలకు ముందు జరిగిన ఉప ఎన్నికల్లో 17 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలను గెల్చుకుంది. పార్టీ ఆరంభంలోనే జరిగిన కడప లోక్‌సభ ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5,45,672 ఓట్లు, పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి ఆయన తల్లి విజయమ్మ 81,373 ఓట్ల భారీ ఆధిక్యంతో ఎన్నికై యావత్ దేశంలోనే మరపురాని ఒక చరిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత కొంతకాలానికి జరిగిన ఉప ఎన్నికల్లో 15 ఎమ్మెల్యే స్థానాలను, మరో ఎంపీ స్థానాన్ని (నెల్లూరు)ను వైఎస్సార్‌సీపీ తన ఖాతాలో వేసుకుంది. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో అధికారానికి దూరమైనా, 67 సీట్లతో శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది.

పార్టీని దెబ్బతీసేందుకు కుట్రలు

ప్రజల తీర్పును శిరసావహిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న వైఎస్సార్‌సీపీని దెబ్బతీసేందుకు పాలకులు కంకణం కట్టుకున్నారు. ప్రలోభాలతో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కొనుగోలుకు తెరలేపారు. తన వెంట నడుస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీల బలంతోనే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల తరఫున అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా కోసం తొలి నుంచీ పోరాడుతున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ కావడం గమనార్హం.

జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరు

ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న యోధుడు జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయాలన్న కొందరి ప్రయత్నాలు ఫలించలేదని జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. జగన్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైఎస్సార్‌సీపీని లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పన్నిన కుట్రలు సాగలేదని చెప్పారు. పార్టీకి పెను సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో జగన్ మరింత రాటుతేలారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, వైఎస్సార్‌సీపీకి ఇక రానున్నవి మంచి రోజులేనని స్పష్టం చేశారు.

నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సోమవారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టబోతున్నాయి. పార్టీ కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలు, అన్ని పార్లమెంట్ జిల్లా కేంద్రాల్లో, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరించి, సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఇప్పటికే పిలుపునిచ్చింది.

ఆశావహులను ఊరించి.. చివరకు హ్యాండిచ్చి..

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీడీపీలో తీవ్ర అసంతృప్తి

సాక్షి, అమరావతి: రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక తీరుపై తెలుగుదేశం పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆశావహులను చివరి వరకు ఊరించి, చివరకు హ్యాండివ్వడంపై సీనియర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేవలం వ్యక్తిగత, రాజకీయ అవసరాలే ప్రాతిపదికన సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ ఎంపికపై సీనియర్లు రగిలిపోతున్నారు. అధినేత చెప్పే మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన ఉండడంలేదని వ్యాఖ్యానిస్తున్నారు. అభ్యర్థుల ఖరారును చివరి వరకు సాగదీసి, చివరకు తమకు నచ్చిన వారికి ఇవ్వడం పార్టీ అధినాయకత్వానికి పరిపాటిగా మారిందని అంటున్నారు. గతంలో సుజనా చౌదరి, టీజీ వెంకటేష్‌లకు రాజ్యసభ సీట్లు ఇచ్చినప్పుడు, ఇప్పుడు కూడా ఇదే పద్ధతిని పాటించారని చెబుతున్నారు. పార్టీకి ఆది నుంచి సేవలందిస్తున్న వారిని కాదని గతంలో టీజీ వెంకటేష్‌కు ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఎంతో మంది రాజ్యసభ సీటు ఆశించారని, వారందరినీ కాదని రవీంద్ర కుమార్‌ను ఎంపిక చేశారని, ఇది పార్టీ నేతలను విస్మరించడమేనని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈసారి రాజ్య సభ స్థానంపై రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, పార్టీ సీనియర్ నేతలు బీద మస్తాన్‌రావు, వర్ల రామయ్య, మసాల పద్మజ, నల్లగట్ల స్వామిదాసు, హేమలత, జూపూడి ప్రభాకర్ వంటి వారు ఆశలు పెట్టుకున్నారు. పార్టీకి తాము చేసిన సేవలను అధినాయకత్వానికి వివరించి, రాజ్య సభకు అవకాశం ఇవ్వాలని కోరారు. వారికి న్యాయం చేస్తామని అధినాయకత్వం చెప్పింది. దీంతో వారు తమకు సీటు వస్తుందని కోటి ఆశలతో ఎదురు చూశారు. చివరి వరకు వారిని ఊరించిన అధినాయకత్వం, చివరకు తమకు నచ్చిన వారిని రాజ్యసభకు ఎంపిక చేసింది. మరీ ముఖ్యంగా వర్ల రామయ్యకు రాజ్యసభ సీటు దాదాపు ఖరారయింది. ఈమేరకు పార్టీ నాయకత్వం లీకులు కూడా ఇచ్చింది. ఆదివారం ఉదయం వరకు రామయ్యకు సీటు ఖరారయిందన్న వార్తలు వెలువడ్డాయి. ఆదివారం ఉదయం రామయ్య కుటుంబంతో సహా సీఎం నివాసానికి బయల్దేరారు. అయితే, చివరి నిమిషంలో రామయ్య పేరు జాబితా నుంచి మాయమైంది. ఆయన స్థానంలో కనకమేడల రవీంద్రకుమార్ పేరు జాబితాలోకి ఎక్కింది. దీంతో రామయ్య తీవ్ర మనస్తాపం చెందారు. విజయవాడ శివారు నుంచే ఆయన తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. మరోవైపు.. తనకు అవకాశం ఇవ్వకపోవడంపై కంభంపాటి రామ్మోహన్‌రావు కూడా అసంతృప్తితో ఉన్నారు. రమేష్, రవీంద్ర ఎంపిక ఎంతవరకు న్యాయమని ఆశావహులంతా ప్రశ్నిస్తున్నారు. ఎంపిక తీరుపట్ల యనమలతోపాటు ఇతర సీనియర్లు కూడా అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.



శ్రీదేవికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

చెన్నైలో శ్రీదేవి సంతాప సభ


తమిళ సినిమా (చెన్నై): చెన్నైలో ఆదివారం నటి శ్రీదేవి సంతాపసభ నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్‌లో శ్రీదేవి కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ సంతాప సభలో బోనీకపూర్, ఆయన కూతుళ్లు జాన్వీ, ఖుషీ, శ్రీదేవి చెల్లెలు శ్రీలత తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పలువురు సినీ ప్రముఖులు విచ్చేసి శ్రీదేవి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సంగీత దర్శకుడు ఏఆర్.రెహ్మాన్, నటుడు శివకుమార్, సూర్య, జ్యోతిక, సీనియర్ నటి వైజయింతీమాల, బాలి, లత, మీనా, స్నేహా, కుట్టిపద్మిని, నృత్యదర్శకులు సుందరం, ప్రభుదేవా, నిర్మాత ఏఎం.రత్నం, కలైపులి ఎస్.థాను, టీజీ.త్యాగరాజన్, ఐసరి గణేశ్, దర్శకుడు కేఎస్.రవికుమార్, తంగర్‌బచ్చన్, లతారజనీకాంత్, సుహాసిని, రోహిణి, రాధిక శరత్‌కుమార్, శ్రీరామ్, వందన, వినీత్ పాల్గొన్నారు. ముంబైనుంచి బీఎస్‌పీ నేత అమర్‌సింగ్, హైదరాబాద్ నుంచి నిర్మాత సురేశ్‌బాబు కూడా హాజరై నివాళులు అర్పించారు. ఈ సంతాపసభకు ఆహ్వానం లేకున్నా హాజరైన మీడియాను లోనికి అనుమతించలేదు. ఎలక్ట్రానిక్ మీడియా బృందం హోటల్ ముందు భాగంలో ఉండి సంతాపసభకు వచ్చేవారిని చిత్రీకరించుకోవాల్సిన పరిస్థితి.

హైదరాబాద్ 'ఉక్క'రిబిక్కిరి

సాక్షి, హైదరాబాద్: ఎండాకాలం ఇంకా పూర్తిగా మొదలుకానేలేదు.. అప్పుడే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రాష్ట్ర రాజధానిలో మార్చి ప్రారంభం నుంచే పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. మానవ శరీర ఉష్ణోగ్రత 37 డిగ్రీలు(98.6 ఫారెన్‌హీట్స్). అదే స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలనూ నగరవాసులు తట్టుకోలేకపోతున్నారు. దీనికి తోడు కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో రేడియేషన్ సూచీ పది పాయింట్ల మేర నమోదవుతోంది. సెగ, భగలకుతోడు ఉక్కపోత ఊపిరాడనివ్వడం లేదు. వేసవితాపాన్ని తట్టుకునేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్ల వినియోగం కొద్దిరోజులుగా విపరీతంగా పెరిగింది. దీంతో సిటీలో విద్యుత్ వినియోగం అనూహ్య స్థాయికి చేరింది. సాధారణంగా సాయంత్రం పీక్ అవర్(ఆరు నుంచి పది గంటలు)లో మాత్రమే కనిపించే విద్యుత్ వినియోగం కొద్ది రోజులుగా అర్ధరాత్రి తర్వాత కూడా రికార్డ్ స్థాయిలో నమోదవుతోంది.

109వ రోజు

11-03-2018, ఆదివారం
ఈపూరు పాలెం, ప్రకాశం జిల్లా



పాలనలో వైఫల్యాలకు ప్రకాశమే నిదర్శనం

ప్రకాశం జిల్లాలో పాదయాత్రకు నేటితో చివరి రోజు. ఈ జిల్లాలో మరిచిపోలేని అనుభవాలు ఎన్నెన్నో. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా దార్శనికతతో పాలించిన నాన్నగారి స్వర్ణయుగ పరిపాలన ఫలాలను అందుకున్న ప్రజల కృతజ్ఞతాపూర్వక ప్రేమాభిమానాలను చవి చూశాను. మరోవైపు ప్రజాకంటక పాలకుని నిరాదరణ, వంచనకు గురై కష్టాల కడలిని ఈదుతున్న ప్రజల కడగండ్లనూ కళ్లారా గమనించాను. ప్రజల కన్నీరు తుడవటానికి మహానేత చేసిన భగీరథ యత్నాలనూ చూశాను. మిగిలిపోయిన కొద్దిపాటి పనులను కూడా పూర్తి చేయని నేటి స్వార్థ రాజకీయ నేత నిర్లక్ష్యాపూరిత, వివక్షాభరిత పాలన ఫలితాలనూ వీక్షించాను.

ఈ జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. కందుకూరు నియోజకవర్గంలో చంద్రబాబు నిర్లక్ష్యానికి గురైన రాళ్లపాడు ప్రాజెక్టును చూడగానే మనసు చివుక్కుమంది. గిట్టుబాటు ధరల్లేక నష్టాల్లో కూరుకుపోయి 'బ్యారెన్ లైసెన్సులు కూడా వెనక్కి ఇచ్చేస్తాం.. మాకీ వ్యవసాయమే వద్దు' అంటూ వలసలకు సిద్ధమైన పొగాకు రైతుల కష్టాలు విని కలత చెందాను. 'కందుకూరు మున్సిపాల్టీ ప్రజల దాహార్తిని సాగర్ జలాలతో తీర్చిన ఘనత నాన్నగారిదే' అంటూ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తుంటే గర్వంగా అనిపించింది. కొండెపి నియోజకవర్గంలో పాడి రైతుల కష్టాలను విన్నాను. వ్యవసాయం భారమై ప్రత్యామ్నాయంగా పాడిని ఎంచుకుంటే... ఒంగోలు సహకార డెయిరీని మూసేయించడానికి నేటి పాలకులు పన్నిన కుట్రతో తమకు జీవనోపాధే లేకుండా పోయిందన్న రైతన్నల ఆవేదన మనసును కష్టపెట్టింది. కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ నీరు తాగుతున్న ప్రజల కష్టాలు గుండెను బరువెక్కించాయి. ఆ కష్టాలకు పరాకాష్టగా కిడ్నీలు చెడిపోయినవారి దీనగాథలు మనసును కలత చెందించాయి. అదే నియోజకవర్గంలో సుబాబుల్, జామాయిల్, కంది, శనగ రైతుల వెతలను కళ్లారాగాంచాను.

మార్కాపురం నియోజకవర్గంలో గ్రామగ్రామాన గుక్కెడు నీళ్ల కోసం మైళ్లకొద్దీ నడిచి వెళ్తున్న అక్కచెల్లెమ్మలను చూస్తుంటే బాధనిపించింది. 'ట్యాంకర్ల కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నాం అన్నా..' అని వారు చెబుతుంటే... కనీస అవసరాలను కూడా తీర్చలేని అసమర్థ రాజకీయాలపై అసహ్యం వేసింది. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఈ వెతలు తీరేవి కదా అనిపించింది. సంతనూతలపాడు దాహార్తిని తీరుస్తున్న రామతీర్థం ప్రాజెక్టు నాన్నగారి చలువే అని చెబుతుంటే మనసు సంతోషంతో నిండిపోయింది. అదే సమయంలో గుండ్లకమ్మ ప్రాజెక్టులో మిగిలిపోయిన అరకొర పనులను కూడా నేటి పాలకులు పూర్తి చేయకపోవడం ఎంత దౌర్భాగ్యం అనిపించింది. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వ ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమల దీనస్థితి మనసుకు బాధ కలిగించింది. దర్శి నియోజకవర్గంలో పరిశ్రమలను తీసుకొస్తానని చెప్పిన చంద్రబాబు హామీ బూటకమని ప్రజలు ఈసడిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలోని భవనాసి, యర్రం చినపోలిరెడ్డి పథకాలు బాబుగారి నిర్లక్ష్యానికి సాక్షీభూతాలుగా నిలిచాయి. అక్కడ మిర్చి, శనగ రైతుల అగచాట్లు చెప్పడానికి మాటలు సరిపోవు. పర్చూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల భూదాహం బకాసురుడిని తలపించింది. పేద, దళితుల భూములు కూడా ఆక్రమణలకు గురవుతుంటే ఈ భూ రాబందుల అరాచకాల నుంచి విముక్తి ఎప్పుడా అనిపించింది. చీరాలలో చితికిపోయిన నేతన్నల హృదయ ఘోష విని మనసు వ్యథాభరితమైంది. ఆ పడుగు పేకల బరువు బతుకుల వ్యథల్ని తొలగించాలని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాను. ఎన్ని కష్టాలున్నా నాన్నగారి మీద ఉన్నటువంటి నమ్మకాన్ని నాపై కూడా చూపిస్తున్న ప్రకాశం జిల్లా ప్రజల ప్రేమ, ఆప్యాయతలు నా బాధ్యతల్ని మరింత పెంచాయి.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ప్రకాశం జిల్లాలో నాన్నగారు చేపట్టిన ఎన్నో పథకాలు, ప్రాజెక్టులు కళ్లెదుట కనిపిస్తున్నాయి. మీ 13 ఏళ్ల పాలనకు గుర్తుగా ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టు కానీ, పథకం కానీ చెప్పగలరా?

వైఎస్. జగన్.

కంచి పీఠాన్ని సందర్శించిన శ్రీ శారదా పీఠాధిపతి



కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, చిత్రంలో ఉత్తర పీఠాధిపతి బాలస్వామి తదితరులు

పెందుర్తి: తమిళనాడులోని కంచి కామకోటి పీఠాన్ని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆదివారం సందర్శించారు. ఇటీవల పరమపదించిన కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామీజీ మహా సమాధిని దర్శించి, అంజలి ఘటించి ప్రత్యేక పూజలు చేశారు. కంచి పీఠాధిపతిగా నియమితులైన విజయేంద్ర సరస్వతి స్వామీజీని కలుసుకుని శారదా అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక ప్రాంతంలో శంకరాచార్యులు చెప్పిన అద్వైత సారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముఖ్యంగా కర్ణాటకలో హిందూ వ్యతిరేక శక్తులు ధర్మానికి హాని కలిగించేలా ప్రవర్తిస్తున్నాయని.. దానిపై సమగ్ర పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితి గురించి తనతో మరోసారి చర్చించాలని శారదా పీఠాధిపతికి సూచించానని తెలిపారు. స్వరూపానందేంద్ర స్వామీజీ తమ పీఠాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ కంచి కామకోటి పీఠం అంటే తమకు ఎంతో గౌరవమన్నారు. శంకరాచార్యుల భాష్యానికి అనుగుణంగా పీఠాన్ని నడిపిన జయేంద్ర సరస్వతిని దేశం యావత్తూ నడిచే దైవంగా కొలిచేదని చెప్పారు. ఆ మహాస్వామీజీ ఆధ్యాత్మిక విషయాలకే పరిమితం కాకుండా వైద్యశాలలు, వేద పాఠశాలలు, విద్యాలయాలు నెలకొల్పి ప్రజల కోసమే నిరంతరం తపించారని కొనియాడారు. కంచి పీఠానికి తమ సహకారం పూర్తిగా ఉంటుందని ప్రకటించారు. శారదా పీఠం ఉత్తర పీఠాధిపతి బాలస్వామి, ధర్మాధికారి కామేశ్వరశర్మ, ఆస్థాన పండితుడు కృష్ణశర్మ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు శ్లాఘనీయం

ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్‌లాంబా



వార్షిక సమావేశంలో మాట్లాడుతున్న నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్‌లాంబా, చిత్రంలో కరమ్‌బీర్‌సింగ్ తదితరులు

విశాఖసిటీ: భారత నౌకాదళంలో పనిచేసిన పాతతరం ఉద్యోగుల సేవలు శ్లాఘనీయమని ఇండియన్ నేవీ దళాధిపతి అడ్మిరల్ సునీల్‌లాంబా కొనియాడారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తూర్పు నౌకాదళానికి చెందిన స్థానిక స్వర్ణజ్యోతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన 26వ వార్షిక సర్వసభ్య సమావేశం, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాంబా మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు వేసిన పునాదుల వల్లే భారత నౌకాదళం బలీయమైన శక్తిగా ఎదిగిందని అభిప్రాయపడ్డారు. అందుకే విశ్రాంత ఉద్యోగులకు అవసరమయ్యే అన్ని రకాల సేవల్ని అందించేందుకు రక్షణ శాఖ ఎప్పుడూ వెనుకడుగు వెయ్యలేదన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన హెల్త్ స్కీంలు, పింఛన్లపై చర్చించారు.

హామీ ఇవ్వకపోతే సమ్మెకు దిగుతాం!

- ఏపీ జూడాల సంఘం స్పష్టీకరణ
- నేడు డీఎంఈతో చర్చలు

సాక్షి, అమరావతి: తమ సమస్యల పరిష్కారానికి రాతపూర్వక హామీ ఇవ్వకపోతే సమ్మెకు దిగుతామని జూడాలు మళ్లీ పునరుద్ఘాటించారు. సోమవారం వైద్య విద్యా సంచాలకులతో చర్చలు జరుపుతామని, ఆయన నుంచి తమకు రాతపూర్వక హామీ రాకపోతే మంగళవారం నుంచి సమ్మెకు దిగుతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూడాల సంఘం పేర్కొంది. స్టైపండ్ పెంపు, పీజీ పూర్తి చేయగానే ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసే డిమాండ్ల పరిష్కారం కోరుతున్నామని, వీటిపై హామీ ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని సంఘం పేర్కొంది. ఇప్పటికే కొన్ని బోధనాసుపత్రుల్లో సమ్మె చేస్తున్నట్టు జూడాల సంఘం పేర్కొంది.

సాక్షి
సాహిత్యం
విజయవాడ | సోమవారం | మార్చి | 12 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

గ్రేట్ రైటర్

చిన్వా అచేబే



జనం సృష్టించిన కథలు జనాన్ని సృష్టిస్తాయి; లేదా, కథలు సృష్టించే జనం కథల్ని సృష్టిస్తారంటాడు చిన్వా అచేబే. నైజీరియాలో జన్మించాడు అచేబే (1930–2013). కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా ప్రపంచానికి ఆఫ్రికా గొంతుగా నిలిచాడు. 19వ శతాబ్దంలో నైజీరియా గడ్డ మీదికి బ్రిటిష్ వాళ్లు వచ్చి, స్థానిక సంస్కృతిని ధ్వంసం చేసి, స్థానికులను వారి జీవితాలకూ భూములకూ పరాయి చేసిన బృహత్తర గాథను 1958లో ఆయన 'థింగ్స్ ఫాల్ ఎపార్ట్'గా అక్షర బద్ధం చేశాడు. ఆధునిక ఆఫ్రికా సాహిత్యంలో అత్యధికులు చదివిన, చదువుతున్న నవలగా ఇది ప్రసిద్ధికెక్కింది. ప్రపంచవ్యాప్తంగా కూడా తెలుగు సహా ఎన్నో భాషల్లోకి అనువాదమైంది. ఇంగ్లిష్‌లోనే తన నవలలు రాసిన అచేబేను 2007లో మాన్ బుకర్ పురస్కారం వరించింది. 'నో లాంగర్ ఎట్ ఈజ్', 'యారో ఆఫ్ గాడ్', 'ఎ మాన్ ఆఫ్ ద పీపుల్', 'ఆంట్‌హిల్స్ ఆఫ్ ద సవన్నా' ఆయన ఇతర నవలలు.

సాహిత్య మరమరాలు

ఎక్కడో చిన్న తేడా వచ్చింది!

ఒద్దిరాజు సోదరులుగా పరిచితులు ఒద్దిరాజు సీతారామచంద్రారావు, ఒద్దిరాజు రాఘవరంగారావు. కవులుగా, నాటకకర్తలుగా, దార్శనికులుగా వీరి జీవితం ఆదర్శ ప్రాయమైనది. ఇద్దరిలోనూ చిన్నవాడైన రాఘవరంగారావు మంచి హాస్యాన్ని పండించేవారు.




అన్నదమ్ములిద్దరూ ఏదో పనిమీద ఓసారి మద్రాసుకు వెళ్లారు. అక్కడో సత్రంలో దిగారు. ఓరోజు వారున్న చోటికి ఒక అత్తర్లు అమ్ముకునే వ్యాపారి వచ్చాడు. వీళ్లు సీసాలు కొన్నారు. వాళ్లకున్న సహజమైన కుతూహలంతో ఆ అత్తర్ల మనిషితో సంభాషిస్తూ, వాటిని ఎలా తయారు చేస్తారు? వాటికి ఏమేం కావాలి? లాంటి వివరాలు రాబట్టారు.

ఇక, వాళ్ల ఊరైన ఇనుగుర్తికి తిరిగి వచ్చేటప్పుడు అత్తరు తయారీకి కావాల్సిన సరంజామా అంతా మరిచిపోకుండా కొన్నారు. వచ్చాక వాళ్ల పద్ధతిలో తయారీ కసరత్తు చేశారు. మొత్తానికి అత్తరు తయారైంది. దానికో పేరు పెట్టాలి కదా! 'మురికొళుందు' అని నామకరణం చేశారు. అదేం పేరు? అని ఇంట్లో వాళ్లు అడిగితే, 'మద్రాస్ వాళ్లు పెట్టిన పేరు మరికొళుందు, అంటే మంచి వాసన. మరి మేము చేసినది మురికొళుందు, అంటే మురుగు వాసన' అని రాఘవరంగారావు చెప్పగానే అందరూ నవ్వేశారట.

ప్రతిధ్వనించే పుస్తకం

జిమ్ కార్బెట్ వేట జీవితం ఒక అద్భుతం. ఆయన స్వీయ అనుభవాల నుంచి రాసిన పుస్తకం, 'దమ్యాన్ ఈటింగ్ లెపర్డ్ ఆఫ్ రుద్రప్రయాగ్'(మనుషుల్ని తినే రుద్రప్రయాగ చిరుతపులి). వందలాది మనుషుల్ని తినమరిగిన 'ఒకే ఒక' చిరుతపులిని, వందల మామూలు చిరుతపులుల్లో విడిగా గుర్తించి, దానికోసం రాత్రుల్లో కొండల మీదా, అడవుల్లోనూ వందల మైళ్లు కాలినడకన తిరిగి, 65 రాత్రులు చలిలో, మంచులో, వర్షంలో కటిక చీకట్లో మాటువేసి చివరికి దాన్ని చంపిన వాస్తవ గాథ ఇది. ఈ ఒక్క పుస్తకమే పది ప్రేరేపణల పెట్టు.



కటిక చీకట్లో చిరుతపులి గడ్డిపరకల్ని రాసుకుంటూ వెళ్తే, ఆ శబ్దాల్ని పట్టుచీర రెపరెపలతో పోలుస్తాడు కార్బెట్. ఈ అడవిలో, ఈ వెన్నెలరాత్రిలో, చంద్రకాంతి క్షణమైనా దూరని కొన్ని మరుగుల్లోనే చిరుత నడిచిందంటాడు. అనుభవమైతేగానీ ఊహించలేని హడల్ని ఆ చిరుత కలిగించిందంటాడు. ఆయన చిరుతపులిని వేటాడ్డమొక్కటే కాదు, అదీ ఆయన్ని వేటాడుతుంది. ఒక మనిషికీ, చిరుతకీ మధ్య ఎత్తుకు పై ఎత్తు ఆట సాగుతుంది.

అడవిలోని మేఘాలనూ, సూర్యాస్తమయాన్నీ కార్బెట్ వర్ణించిన తీరు కవితాత్మకంగా ఉంటుంది. తీగతోకతురాయి పక్షి ఇతర పక్షుల ఆహారాన్ని ఎలా దొంగతనం చేస్తుందో చెప్తాడు. రెండు చిరుతపులులు పోట్లాడుకుంటుంటే, దూరంగా చీకట్లో వింటూ, ఆ పోరాటాన్ని వర్ణించిన తీరు టీవీలో చూస్తున్నట్టే ఉంటుంది.

'పులికీ, చిరుతపులికీ మనుషులు ఆహారం కాదు. మనల్ని తినొచ్చని వాటికి తెలీనే తెలియదు'. ఇదీ జిమ్ కార్బెట్ సిద్ధాంతవాక్యం. అలాంటిది, నూటికో కోటికో ఒకటి మనుషుల్ని తినమరిగితే అది ఎంత భయోత్పాతాన్ని కలిగిస్తుంది!

ఇది చదువుతూంటే, మనం కూడా చిరుతపులిని వేటాడ్డానికి ఆయనతో ప్రయాణమైన అనుభూతి పొందుతాం. బోనుల్లోంచీ, విషప్రయోగాల నుంచీ, జిన్‌ట్రాప్ నుంచీ, బంధించిన గుహలోంచీ ఆ చిరుత తప్పించుకుంటుంటే– ఇంకా ఏం చెయ్యాలా? అని ఆలోచిస్తాం. అందుకే 72 సంవత్సరాలుగా ఈ పుస్తకాన్ని ఎన్నో భాషల్లో పాఠకులు చదువుతున్నారు. తెలుగులోనూ దాన్ని చదివించాలని నేను 'రుద్రప్రయాగ చిరుతపులి' పేరుతో అనువదించాను.

◆ కందుకూరి రవీంద్రనాథ్

మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com

ఉరి తద్దినం

కథాసారం

బాతుల వేటకు బయల్దేరాడు కెప్టెన్ వర్మ.

డబుల్ బేరల్ షాట్‌గన్ భుజానికి తగిలించుకుని హంటింగ్ సూట్లో బంగళా మెట్లు దిగాడు. వెంట పెంపుడు కుక్క సీజర్. తంపర వైపు నడుస్తున్నాడు. చుట్టూ చీకటి. చలి మంచు. పొల్లాల్లో నక్కల మంద ఊళ. క్రాంక్... క్రాంక్... ఆకాశంలో బాతుల మంద.

అదే చీకట్లో, అదే తంపర వైపు పిట్టల వేటకు బయల్దేరాడు డిబిరిగాడు. వయసు అరవై దాటింది. గోచీ తప్ప మరేమీ లేదు. చేతిలో నాటు తుపాకి. భుజానికి పాత మురికి సంచి. అందులో ముసలి పెంపుడు కొంగ. సంచీలోంచి నాటుసారా తీసి డగ్‌డగ్‌మని గుటకేశాడు. బీడీ వెలిగించాడు.

తంపర ఒడ్డున మొగలి డొంకలో కూర్చున్న వర్మకు దూరంగా ఏదో దీపం కదులుతున్నట్టనిపించింది. అప్పుడే బాతుల మంద నీటి మీద వాలడానికి చక్కర్లు కొడుతోంది. చీకట్లో రెండు మెరుపులు ధన్ ధన్. తుపాకి నిప్పులు కక్కింది. ధప్ ధప్ మని మంటిముద్దల్లా చచ్చిన బాతులు. వాటిని నోట కరుచుకుని ఒడ్డుకు తెచ్చింది సీజర్. రిలాక్సింగ్‌గా సిగరెట్ వెలిగించి ముందుకు నడిచాడు వర్మ. దూరంగా డిబిరిగాడు చలి కాగుతున్నాడు. 'దండాలు దొరా'.

'నీది ఏ ఊరు?'

'నక్కలోణ్ణి'

'ఏ ఊరు?'

'ఎక్కడుంటే అదే మా ఊరు'

'ఈ రాత్రప్పుడు ఏం చేస్తున్నావు?'

'ఏటకి వచ్చాను' చెప్పాడు డిబిరి. దీపం ఎలుతుర్లో ఏట. బుర్ర మీద లాంతరుంటుంది. మనిషి నీళ్లల్లో ఉంటాడు. లాంతరు లైటుకి పిట్టలు ఎగిరొచ్చి వాల్తాయి. వాలగానే గబుక్కున లాగేయాలి. పక్క పిట్ట కూడా పోల్చుకోకూడదు. చిన్నప్పుడు వాళ్ల బాబు దగ్గర నేర్చుకున్నాడు.

'పిట్టలు దొరికాయా?'

'రెండు మూడు దీపం ఎలుతుర్లో చెక్కర్లు కొట్టాయి. నువ్వు దూరంగా తుపాకి పేల్చావు. ఆ శబ్దానికి పారిపోయాయి. మరి దిగవు'. అర్థం కాకుండా నవ్వాడు డిబిరి. నీ ఏటతో నా ఏటకి దెబ్బకొట్టేశావనే నిస్పృహ. వర్మ మనసు చివుక్కుమంది.

నాటుసారా తీసి గడగడా తాగేశాడు డిబిరి. ఎర్రటి కళ్లు. లస్క్ టపక్ లస్క్ టపక్. మందు ఎక్కువైందనుకున్నాడు వర్మ. దూరంగా పెంపుడు కొంగ సైతాన్ పట్టినట్టు దగ్గింది. వెళ్లి వలను తెచ్చాడు. డిబిరి సంచీ పక్కనే నాటు తుపాకి. దాన్ని చేతిలోకి తీసుకుంటూ సిగరెట్ ఇచ్చాడు వర్మ.

'సారూ అది మర్డరీ తుపాకి'.

వర్మకు షాక్ కొట్టినట్లయింది. వెనక్కిచ్చేశాడు.

'ఈ కొంగను పెంచుతున్నావా?'

ఏ జాతి పిట్టల్ని పట్టుకోవాలంటే ఆ జాతి పిట్టను మచ్చిక చేసుకోవాలి. వల మీద దీన్ని ఉంచాలి. దీన్ని చూసి అక్కడ కూడా మేతుందని నత్తగొట్టు వాలి చిక్కడిపోతాయి. కానీ దీనియమ్మ దీని అరుపులకే అవి దిగకుండా పారిపోతున్నాయని ఒక్క బాదు బాదాడు డిబిరి. అది కేర్‌మంది.

'ఇది ఎగిరిపోదా?'

దానికి చూపులేదు. కంటిరెప్పల్ని దారంతో కుట్టేశాడు. దాని మందను చూసిందా ఎగిరిపోతుంది. చూపులేని పిట్టతో చూపున్న పిట్టల్ని వలేసి పట్టుకోవడం ఈ వేటలో తమాషా. డిబిరిగాడి హంటింగ్ టాక్టిక్స్‌కు అబ్బురపడ్డాడు వర్మ.

'నత్తగొట్లు రాత్రిళ్లు రావుకదా? రాత్రి వలేశావు?'

'గానీ సారూ తుంగ గుబుర్లలో గూళ్లు కట్టుకున్న కొండకోళ్లు, దాసరి కోళ్లు చీకట్లో కానుకోలేక వలలో చిక్కడిపోతాయి. పరదలు కూడా ఈ అరుపుకి అప్పుడప్పుడు దిగిపోతాయి. గానీ దొరా ఇందాక నువ్వు పరదల మందని బెదరగొట్టేశావు'.

'నేనా?'

'నువ్వు అరప దిగి అగ్గిపుల్ల గీసి సిగరెట్టు ఎలిగించలేదూ?'

అగ్గిపుల్ల వెలుగులో వర్మ తుపాకి గొట్టాలు జిగేల్‌మన్నాయి. ఆ మెరుపుకి దిగబోతున్న పరదల మంద బెదిరి వెనక్కి తిరిగింది.

'ఇది మర్డర్ తుపాకీ అన్నావుకదా ఇందాక... మర్డర్ చేశావా?'

గారబట్టిన పళ్లతో గుసగుస నవ్వాడు డిబిరి. 'నేను కాదు నా బాబు. ఈ తుపాకీతో ఒకే దెబ్బకి ఒకణ్ణి ఖూనీ చేశాడు'. డిబిరి పెదాలు ఆవేశంగా కదులుతున్నాయి. చూపులు గతాన్ని చూస్తున్నాయి.

'సాలాకాలం క్రిందట... అప్పుడు తెల్లదొరలుండేవోళ్లు. నేను చిన్నోడ్ని. ఒకరోజు ఏటకెళ్లిన మా బాబు చీకటి పడ్డా ఇంటికి రాలేదు. ఇంతలో పక్కనున్న మావోడు వచ్చి, 'ఏట్రా డిబిరిగా! నీ బాబుని నిన్నటినుంచి పోలీస్ స్టేషన్లో కుళ్లబొడి చేస్తున్నారు' అన్నాడు.

'ఎందుకూ?'

'దొంగతనం చేశాడట. షావుకారి ఇంట్లో బంగారం పోయిందట'.

కంగారెత్తిపోయి పరుగెత్తాడు. బాబును రెండు చేతులూ చాచి కట్టేసి దూలానికి వేలాడదీశారు. కాళ్లు కట్టేసున్నాయి. గోచీ తప్ప వంటి మీద గుడ్డ లేదు. దబ్ ఫట్... వంటి నిండా లాఠీ దెబ్బలు. చర్మం చిట్లి రక్తం ముద్ద కట్టేసింది. గావుకేకలు. కాళ్లు తన్నుకోలేక గింజుకుంటున్నాడు.

'చెప్పరా బంగారం ఎక్కడ దాచావో'

కొడుకును కొడితేనన్నా చెబుతాడేమోనని పసివాడి బుర్రను గోడకేసి కొట్టారు. బాబోయ్ అమ్మోయ్... దెబ్బకి రాత్రి తిన్నది కక్కుకున్నాడు.

'ఆడ్ని ఒదిలెయ్యండి. నేను నిజం చెబుతాను'. పోలీసులు నవ్వుకున్నారు.

బంగారం దాచిన చోటు తెల్లారి చూపాలని ఆదేశిస్తూ, ఒక పోలీసును వెంట పంపారు. వెళ్లాక, 'బాబూ, నువ్వు దొంగతనం చేశావా?' అడిగాడు డిబిరి. జుట్టు నిమిరి, కొడుకును పడుకొమ్మన్నాడు.

తెల్లారి తుపాకీ అందుకున్నాడు. మెరుపు వేగంతో ఢూమ్. పోలీసు ఎగిరిపడ్డాడు. 'దొరా! నిన్న నేను దొంగతనం చేశానని ఒప్పించారే అది పచ్చి అబద్ధం. నేను దొంగతనం చేయలేదు. ఖూనీ చేశాను'. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముందు లొంగిపోయాడు. జైలుకి తీసుకెళ్లిపోయారు. పిల్లాడినే కోర్టులో సాక్షిగా వేశారు. నిజం చెప్పాలని బెదిరించారు. అబద్ధం మాత్రం ఎందుకు ఆడతాడు?

'బాగా ఏట చెయ్యి బాగా తిను' అని చెప్పాడు తండ్రి డిబిరికి. అప్పుడే దెబ్బలకు తట్టుకోగలవన్నాడు. మనవి దెబ్బలు తినే బతుకులన్నాడు.

తర్వాత అతడిని ఇంకేదో పెద్ద జైలుకు మార్చారు. చాలా రోజులైంది. ఒకరోజు డిబిరి ఉడుము మాంసం వంతులేసి అమ్ముతున్నాడు. ఒక కానిస్టేబుల్ వచ్చి, 'ఓరీ ఇక్కడున్నావట్రా. నీ చెట్టు దగ్గర చూశాను. రేపు పొద్దుట నీ బాబుకు సెంట్రల్ జైలులో ఉరి తీస్తారట. కావాలంటే వెళ్లి చూసుకో' అన్నాడు.



ఉరి... ఒళ్లు గజగజలాడిపోయింది. పెద జైలు చాలా దూరం. ఎలా వెళ్లాలో తెలీదు. ఉడుం మాంసం అమ్మిన పైసలు చాలవు. దాంతో అడుక్కున్నాడు. చేతులు చాచి. మా బాబుకు ఇలాగైందని చెప్పి. ఖూనీకోరు కొడుకని ఎగతాళి చేశారు. ఇక పరుగెత్తడం మొదలుపెట్టాడు. ఎండకీ, ఆకలికీ ఓర్చుకుంటూ, చీకటినీ, వర్షాన్నీ లెక్కచేయకుండా... ఉరుకు పరుగు నడక ఆయాసం ఆకలి... వచ్చిందా? ఇంకాదూరం. మళ్లీ నడక. పరుగు. అదిగో జైలు. 'ఏం కావాల్రా గుంట నాకొడకా' విసుక్కున్నాడు వార్డెన్.

'నా బాబుకి ఈ రోజు ఉరిసిచ్చని కబురెట్టారు'

వార్డెన్ వాడి కళ్లలోకి చూశాడు. ఇంత ఆలస్యమైందేంటి? తెల్లవారుజామునే ఉరి తీసేశారు!

సచ్చిపోయాడా? నా బాబు సచ్చిపోయాడా? ఒళ్లు గజగజ వణికింది.

వార్డెన్ విస్తరాకులో రెండు జొన్నరొట్టెలు ఇచ్చి తినమన్నాడు. వాళ్ల బాబు చివరి కోరిక ఈ జొన్నరొట్టెలు. ఉరితీసే ముందు, 'బాబూ నా కొడుకు ఇంకా రాలేదూ? రాలేదుగానీ వస్తాడు. రాత్రంతా కడుపు నకనకలాడిపోతూ పరుగెత్తుకుంటూ వస్తాడు. వాడికియ్యండి బాబూ' అన్నాడు. బాబు శవాన్ని పాతిపెట్టిన చోటే కూర్చుని ఆ రొట్టెలు తిన్నాడు డిబిరి.

• • •

గతం పూర్తయ్యేసరికి తూర్పు ఆకాశం మీద వెలుగు. నత్తగొట్టు ఇక వేటకు పనికిరాదని చాకుతో మెడ సఫా చేశాడు డిబిరి. పెంచుకున్న కొంగను చంపడం వర్మకు పాపం అనిపించింది. అమానవీయం. తుపాకీతో కాల్చడానికీ చాకుతో కోయడానికీ మధ్య తేడా ఏమిటన్నాడు డిబిరి. కోడిని పెంచి కోసుకుని తినవా సారూ? 'ఈ రోజు నేను దీనినే తిని పొట్టనింపుకోవాలా! లేదంటే ఆకలితో సవ్వాలా!' ఏది పాపం? భుజానికి సంచీ తగిలించుకున్నాడు డిబిరి. అప్పటికే వర్షం మొదలవుతోంది. అలాగే నిల్చుండిపోయాడు వర్మ.


అల్లం శేషగిరిరావు (1934–2000) 'చీకటి' కథాసారం ఇది. 1995లో అచ్చయింది. ఆయన ఒరిస్సాలో జన్మించారు. రైల్వేలో పని చేశారు. రెండు కథా సంకలనాలు 'మంచి ముత్యాలు', 'అరణ్య ఘోష' ప్రచురించారు.


అల్లం శేషగిరిరావు

కొత్త బంగారం

ఒక క్లాసిక్ తొలి రూపం

1957లో, హార్పర్ లీ తన పబ్లిషరుకి 'గో సెట్ అ వాచ్ మాన్' రాతప్రతి ఇచ్చినప్పుడు, అది నవలలా కాక పిట్టకథల సంకలనంలా ఉందంటూ, అచ్చు వేయడానికి నిరాకరించారు. రెండేళ్ళ పాటు, డ్రాఫ్టులు మారుస్తూ రాసిన తరువాత రూపుదిద్దుకున్నది అమరత్వం పొందిన, 'టు కిల్ అ మాకింగ్‌బర్డ్'. 1960లో అచ్చయిన ఈ నవల 1961లో పులిట్జర్ పురస్కారం గెలుచుకుంది. దీనికి ఇంత పేరు రావడానికి అతి ముఖ్య కారణం– పుస్తకం సరైన సమయాన, దక్షిణ అమెరికాలో జాత్యహంకారం అతి ఎక్కువయిన కాలంలో అచ్చవడం.




మొదటి డ్రాఫ్టయిన, 'గో సెట్ అ వాచ్ మాన్' 2015లో పబ్లిష్ అయింది. ఇది జాన్ లూయిస్ 26 ఏళ్ళ వయసులో ఉన్నప్పటి కథ. న్యూయార్క్ నుండి కాల్పనిక ఊరైన మేకాంబ్‌కి, 72 ఏళ్ళున్న తండ్రి అట్టికస్‌ని చూడ్డానికి వస్తుంది. అట్టికస్ కీళ్ళనొప్పులతో బాధపడుతూ, చెల్లెలు అలెగ్జాండ్రాతో పాటు ఉంటుంటాడు.

తనని పెంచిన నల్లజాతికి చెందిన వంటామె ఇప్పుడు జాన్‌ని 'తెల్లమ్మాయిగా' చూస్తుంది. జాన్ బాల్య జ్ఞాపకాలే నవల అధిక భాగం ఆక్రమించుకుంటాయి. తన చిన్నతనంలో– ఒక నల్ల జాతి యువకుడు తెల్ల జాతి స్త్రీని మానభంగం చేశాడని ఆరోపించబడినప్పుడు, అట్టికస్ కోర్టులో అతని కేసు వాదించి అతన్ని రక్షిస్తాడని చూసి, తండ్రిని ఆదర్శమూర్తిగా ఊహించుకుంటుంది. ఆరేళ్ళ ఆ పిల్ల(అప్పటి పేరు–స్కాట్) దృష్టిలో తండ్రి ఏనాడూ తప్పు చేయలేడు.

అప్పుడు, 'అందరికీ సమాన హక్కులుండాలి, ఎవరికీ ప్రత్యేకాధికారాలు ఉండకూడదు' అని జపించిన తండ్రి ఇప్పుడు మూఢమతాభిమానిగా మారి, జాత్యహంకార కరపత్రాలు పంచుతూ, అనుకూల విభజన ప్రచారంలో పాల్గొంటున్నాడని చూసి జాన్ నమ్మలేకపోతుంది.

ఇంక తండ్రిని ఎదుర్కొనే సమయం వచ్చిందనుకుని వాదన పెట్టుకుంటుంది. అట్టికస్ తన ప్రస్తుత ఆలోచనలని వదులుకోడు. నలుపు జాతన్న వివక్ష ఉండకూడదన్న సుప్రీమ్ కోర్టు కొత్త నిర్ణయంతో విభేదిస్తాడు. నల్ల జాతీయులు అధికారంలోకి వచ్చి, ప్రభుత్వ ఉద్యోగాలు చేపడతారేమో అని బెంగ పడతాడు.


హార్పర్ లీ


కూతురికి బుద్ధి చెప్పడానికి తమ్ముడైన డాక్టర్ ఫించ్‌ని పిలుస్తాడు. 'అంతర్యుద్ధంలో దాస్యం యాదృచ్ఛికమైనది. నల్ల జాతీయులు తెల్లవారి కన్నా తక్కువ. ఇతరుల అభిప్రాయాలకి గౌరవం ఇవ్వాలి' అంటూ, జాన్ చెంపమీద కొట్టి మరీ వివరించి, ఆమెని 'మతోన్మాది' అని పిలుస్తాడు పిన తండ్రి. తండ్రి మెల్లిమెల్లిగా తిరోగమిస్తున్న వ్యక్తని జాన్ గ్రహించి, రాజీ పడుతుంది.

వాచ్‌మాన్‌లోనూ, ప్రామాణిక నవల అయిన మాకింగ్‌బర్డ్‌లోనూ ఉన్న తేడాలు ఆసక్తికరమైనవి. వాచ్‌మాన్‌లోని అట్టికస్ దక్షిణ పట్టణపు జాత్యహంకారి, నైతికంగా దుర్బలుడైన వ్యక్తి. మాకింగ్‌బర్డ్‌లో అతను లోకం ప్రేమించే, న్యాయం పట్ల అక్కర ఉన్న లాయర్. నిర్భయమైన దిక్సూచి. 'ప్రాథమికంగా మనుష్యులు మంచివారు' అన్న ఆశాభావంతో మాకింగ్‌బర్డ్ అంతం అవుతుంది. 'మనుష్యులెప్పుడూ మారరు' అన్న వొప్పుగింతతో వాచ్‌మాన్ ముగుస్తుంది.


మాకింగ్‌బర్డ్‌లో ఉన్న నాటకీయత ఈ నవల్లో లేదు. జాతీ, రాజకీయాలూ గురించిన సుదీర్ఘ ఉపన్యాసాలపైన ఆధారపడుతుంది. దానివల్ల, పాత్రల పట్ల ముందటి ప్రేమ పాఠకులకి కలగదు. మాకింగ్‌బర్డ్‌తో పోల్చి చూస్తే, ఇది ఒక నవల అని కూడా అనిపించుకోదేమో!

◆ క్రిష్ణ వేణి


ఈవారం పుస్తకాలు




రామాయణంలో రాయని పుటలు
మిశ్రో నాటకాలు; పేజీలు: 424; వెల: 300; ఎస్.కె.మిశ్రో, అధ్యక్షులు, బహురూప నటసమాఖ్య, 31–32–12/3, ఘంటసాల రోడ్డు, అల్లిపురం జంక్షన్, విశాఖపట్నం–530004



గోలకొండ పత్రిక అనువాద కథలు–3
సేకరణ, కూర్పు: యామిజాల ఆనంద్, డాక్టర్ వి.వి.వేంకటరమణ; పేజీలు: 182; వెల: 140; ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, జి.ఎస్.ఐ. పోస్టు, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్–68. ఫోన్: 24224453



పిఠాపురం క్రానికల్స్
రచన: కంభంపాటి రవీంద్ర; పేజీలు: 196; వెల: 150; ప్రచురణ: జె.వి.పబ్లికేషన్స్; ప్రతులకు: రచయిత, 302, పొట్లపల్లి రెసిడెన్సీ, విదియా కాలనీ, మియాపూర్, హైదరాబాద్–49. ఫోన్: 9704679994



పాడనా తెనుగుపాట
(పి.సుశీల ఏకగళ గీతాలపై వ్యాఖ్య)
రచన: డాక్టర్ కంపల్లె రవిచంద్రన్; పేజీలు: 264; వెల: 200; ప్రతులకు: క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, 1–8–725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాద్–44; ఫోన్: 9848065658

వ్యంగ్య ప్రపంచం

గురూ! ప్రభుత్వం దిష్టి బొమ్మలని కూడా ఒక కళగా గుర్తిస్తుందట!
నీ పెయింటింగ్‌లని దిష్టి బొమ్మలని పేరు పెట్టి పంపు. అవార్డు నీకే గ్యారంటీ.



పదం పలికింది - పాట నిలిచింది

మన చిరునవ్వులే పూలు నిట్టూర్పులు తడి మేఘాలు



సరిగ్గా చూడగలిగితే, సమస్త ప్రపంచం నీలోనే ఉందంటుంది భారతీయ చింతన. దాన్ని నిజం చేస్తూ, సమస్త ప్రకృతినీ మనిషికి అన్వయిస్తూ 'జనతా గ్యారేజ్' కోసం పాట రాశారు రామజోగయ్య శాస్త్రి.

'ప్రణామం ప్రణామం ప్రణామం
ప్రభాత సూర్యుడికి ప్రణామం
ప్రణామం ప్రణామం ప్రణామం
సమస్త ప్రకృతికి ప్రణామం' అని సాగే ఈ గీతంలో–

'మన చిరునవ్వులే పూలు
నిట్టూర్పులు తడి మేఘాలు
హృదయమే గగనం రుధిరమే సంద్రం ఆశే పచ్చదనం
మారే ఋతువుల వర్ణం
మన మనసుల భావోద్వేగం
సరిగా చూస్తే ప్రకృతి మొత్తం మనలో ప్రతిబింబం' అన్నారాయన.

దీనికి సంగీతం దేవీశ్రీప్రసాద్. గాయకుడు శంకర్ మహదేవన్. 2016లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు కొరటాల శివ. ఎన్టీఆర్ కథానాయకుడు.

రారండోయ్

- 'కథా రచన: ఒక్కరోజు కార్యశాల' మార్చి 14న ఉ. 10 నుండి తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్‌లో జరగనుంది. నిర్వహణ: తెలంగాణ సాహిత్య అకాడమీతో కలిసి విశ్వవిద్యాలయ తెలుగు శాఖ.
- ఆచార్య పి.నరసింహారెడ్డి రాసిన సాహిత్య అకాడమీ ప్రచురణ 'అచార్య జి.ఎన్.రెడ్డి' గ్రంథావిష్కరణ సభ మార్చి 15న ఉదయం 10:30కు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరగనుంది. నిర్వహణ: విశ్వవిద్యాలయ తెలుగు శాఖ.
- నాగరాజు రామస్వామి మూడు గ్రంథాల– 'సూర్యశిల', 'ఎద పదనిసలు', 'అనుస్వనం'– ఆవిష్కరణ, అంకితోత్సవం సభ మార్చి 16న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరగనుంది.
- కటుకోఝ్వల రమేశ్ కవితాసంపుటి 'అగ్నిశిఖ' ఆవిష్కరణ మార్చి 17న సాయంత్రం 5 గంటలకు సీఈఆర్ క్లబ్, ఇల్లందులో జరగనుంది. నిర్వహణ: తెలంగాణ సాహితి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
- కవిసంధ్య, డాక్టర్ ఎస్.ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 21న యానాంలో 'ప్రపంచ కవితా దినోత్సవం' జరగనుంది.
- 'తెలంగాణ వచన కవితా వికాసం' అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సును మార్చి 22, 23 తేదీల్లో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి, హనుమకొండ, కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. సంచాలకులు: ప్రొఫెసర్ బన్న అయిలయ్య.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి బ.దశమి ఉ.11.17 వరకు, తదుపరి ఏకాదశి. నక్షత్రం పూర్వాషాఢ ఉ.9.40 వరకు, తదుపరి ఉత్తరాషాఢ. వర్జ్యం సా.6.30 నుంచి 8.16 వరకు. దుర్ముహూర్తం ప.12.32 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.42 వరకు. అమృత ఘడియలు ఉ. 6.54 నుంచి7.44 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.15
జొహార్ : 12.26
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.25
ఇషా : 7.37

అప్పు కోసం 'తప్పు'.. అసలుకే ముప్పు?

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితుల్లో రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లేనని అధికారులు చెబుతున్నారు. సర్కారు అనాలోచిత నిర్ణయంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం తప్పదని పేర్కొంటున్నారు.

కేంద్రానికి దొరికిన సాకు

2015–16 నుంచి 2019–20 ఆర్థిక సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ లోటులో ఉంటుందని 14వ ఆర్థిక సంఘం స్పష్టం చేసింది. రెవెన్యూ లోటు భర్తీ కింద 2015 నుంచి 2020 వరకు రాష్ట్రానికి రూ.22,113 కోట్లు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదించింది. 2019–20 వరకు రాష్ట్రంలో రెవెన్యూ లోటు ఉంటుందని సాక్షాత్తూ 14వ ఆర్థిక సంఘమే స్పష్టం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.5,235 కోట్ల మేర రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం. దీనివల్ల కేంద్రానికి ఎలాంటి సంకేతాలు ఇస్తున్నామో అర్థం కావడం లేదని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఏపీలో మిగులు బడ్జెట్ ఉందనే సాకుతో కేంద్రం 2018–19లో రెవెన్యూ లోటు కింద నిధులు ఇవ్వకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 14 ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు రాష్ట్రానికి రెవెన్యూ లోటు గ్రాంట్ కింద కేంద్రం నుంచి 2018–19లో రూ.3,644 కోట్లు, 2019–20లో రూ,2499 కోట్లు రావాల్సి ఉంది. 2014–15లో 10 నెలలకు ఏర్పడిన రెవెన్యూ లోటు భర్తీ కింద రూ.4,000 కోట్లు ఇచ్చామని, ఇక రూ.138 కోట్లే వస్తాయని కేంద్రం చెబుతున్న సంగతి తెలిసిందే.

అప్పుల కోసం నిధులు పణం!

రాష్ట్ర ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనలను సడలించాలని, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3 శాతానికి బదులు 3.5 శాతం మేర అప్పులు తెచ్చుకునేందుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పటి నుంచో కేంద్రాన్ని కోరుతోంది. అయితే, రెవెన్యూ మిగులున్న రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం ఆ వెసులబాటు కల్పించింది. రెవెన్యూ మిగులున్న రాష్ట్రాలు తమ స్థూల ఉత్పత్తిలో 3.5 శాతం మేర అప్పులు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణ రెవెన్యూ మిగులులో ఉన్నందున ఇటీవలే ఆ రాష్ట్రానికి 3.5 శాతం మేర అప్పులు తెచ్చుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఏపీ ప్రభుత్వం రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు ఎక్కువ తెచ్చుకోవడానికి కేంద్రం నుంచి వచ్చే రెవెన్యూ లోటు నిధులను పణంగా పెట్టడం సమంజసం కాదని అంటున్నారు.

కేంద్రం మొండిచెయ్యి చూపితే?

14వ ఆర్థిక సంఘం కాలపరిమితి 2019–20తో ముగుస్తుంది. ఆ తరువాత 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి వస్తాయి. 14వ ఆర్థిక సంవత్సరం కాలపరిమితి ముగిసిన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటును ఎదుర్కోనుంది. ఇలాంటి పరిస్థితుల్లో 15వ ఆర్థిక సంఘం ముందు సమర్థంగా వాదనలు వినిపించి, రెవెన్యూ లోటు కింద నిధులు పొందడానికి కృషి చేయాల్సింది పోయి ఇప్పుడే మిగులు బడ్జెట్‌ను ఎలా ప్రవేశపెడతారని అధికార వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో రెవెన్యూ మిగులు బడ్జెట్ ఉంటే రెవెన్యూ లోటు భర్తీ కింద నిధులు ఇవ్వకుండా కేంద్రం మొండిచెయ్యి చూపే అవకాశం ఉందని ఒక అధికారి చెప్పారు.

ఏపీలో ఏటా లోటు బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం 2015–16 నుంచి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ప్రతి బడ్జెట్‌లోనూ రెవెన్యూ లోటును తక్కువగా చూపించినప్పటికీ సవరించిన అంచనాల్లో ఈ లోటు భారీగా పెరిగిపోతోంది. 2015–16 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.6,609 కోట్ల మేర ఏర్పడుతుందని పేర్కొనగా, వాస్తవానికి రూ.7,301 కోట్ల లోటు ఏర్పడింది. 2016–17 బడ్జెట్‌లో రూ.5,047 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని పేర్కొనగా, వాస్తవ అకౌంట్ల మేరకు రూ.17,231 కోట్ల లోటు తలెత్తింది. 2017–18 బడ్జెట్‌లో రూ.415 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని ప్రస్తావించగా, సవరించిన అంచనాల్లో రూ.4,018 కోట్ల లోటు ఏర్పడింది. రాష్ట్రంలో రెవెన్యూ లోటు భారీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌ను చూపడం గమనార్హం.

మిగులు ఎక్కడిది..?

సీఏజీ నివేదిక ప్రకారం... 2017 ఏప్రిల్ నుంచి 2018 జనవరి వరకు 10 నెలలకు రెవెన్యూ లోటు రూ.23,000 కోట్లు. కానీ, 2017–18 బడ్జెట్‌లో సవరించిన అంచనాల్లో.. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 నెలలకు గాను లోటును కేవలం రూ.4,018 వేల కోట్లుగా చూపుతున్నారు. అంటే ఆర్థిక సంవత్సరం చివరి రెండు నెలల్లోనే దాదాపు రూ.19,000 కోట్ల ఆదాయం రావడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు ఈ రెండు నెలల్లో జీరో కాబోతోందా? దేశవ్యాప్తంగా ఏ ప్రభుత్వాన్ని తీసుకున్నా ఆఖరి రెండు నెలల్లో ఖర్చులు పెరుగుతాయి. మరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తగ్గాయా? ఈ ఆర్థిక సంవత్సరంలో ఖర్చులు తగ్గడమే కాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.5,235 కోట్ల మిగులు బడ్జెట్ ఉండబోతోందా? ఖర్చులు తగ్గకుండానే రెవెన్యూ మిగులు ఉండడం ఏమిటని నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఏపీకి తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం రెవెన్యూ లోటు ఉండేది. చంద్రబాబు కంటే ముందున్న ప్రభుత్వాలు, తర్వాత వచ్చిన ప్రభుత్వాల హయాంలో రెవెన్యూ లోటు లేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత మొదటి నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో మళ్లీ రెవెన్యూ లోటు కనిపిస్తోంది. ఐదో సంవత్సరంలో లోటు నుంచి ఏకంగా రూ.5,218 కోట్ల మిగులు ఎలా సాధ్యమన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోంది.

రెవెన్యూ మిగులు అసహజంగా ఉంది



ఎన్నికలకు ముందు సాధారణంగా సంక్షేమ పథకాలతో రెవెన్యూ వ్యయానికి ఎక్కువగా కేటాయిస్తారు. ఇలాంటప్పుడు రెవెన్యూ లోటు మరింత పెరుగుతుంది. కానీ రెవెన్యూ మిగులు చూపెట్టడం అసహజంగా ఉంది. వరుసగా గత మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను రెవెన్యూ లోటుతో పెట్టగా.. ఇప్పుడు హఠాత్తుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంత ఆశాజనకంగా అయిపోయిందా! ఇంత ఆశాజనకంగా ఉంటే రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని నమ్మించి ఆర్థిక వెసులుబాటు పొందడం కష్టతరం అవుతుంది. ఆర్థిక వ్యవస్థలో మౌలికమైన సామర్థ్యం వలన ఈ బడ్జెట్ ఇంత ఆశాజనంగా రూపొందితే మనకిక ఎవరి సహాయం అవసరం ఉండకపోవచ్చు. లేక ఈ అంకెలన్నీ గారడీ అయితే అన్ని విధాలా మనల్ని మనమే మోసం చేసుకున్నట్లవుతుంది.

– ఐవైఆర్ కృష్ణారావు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన రెవెన్యూ లోటు నిధులు(రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	రావాల్సిన నిధులు
2015-16	6,609
2016-17	4,930
2017-18	4,430
2018-19	3,644
2019-20	2,499
మొత్తం	22,112

స్వశక్తితో ఎదిగిన వ్యక్తి గ్రంథి సుబ్బారావు

మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి



గ్రంథి సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

పాత గుంటూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త, క్రేన్ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు గ్రంథి సుబ్బారావు స్వశక్తితో ఎదిగి క్రేన్ గ్రూప్ సంస్థలను వివిధ రాష్ట్రాల్లో విస్తరింపచేసిన మహనీయుడని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. గుంటూరు సంపత్‌నగర్‌లోని క్రేన్ ఫ్యాక్టరీ రోడ్డులో ఆదివారం గ్రంథి సుబ్బారావు ప్రథమ వర్థంతి కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఘననివాళులు అర్పించారు. వేద పండితులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. తులసీ గ్రూప్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు మాట్లాడుతూ స్వయంకృషితో ఆదర్శ పారిశ్రామికవేత్తగా గ్రంథి ఎదిగారని కొనియాడారు. ప్రముఖ సినీనటుడు జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథి సుబ్బారావు గుంటూరుకు ఐకాన్ లాంటివారని అన్నారు. క్రేన్ గ్రూప్ సంస్థల చైర్మన్ జి.వి.ఎస్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ తమ సంస్థలను అభివృద్ధి చేయడంతోపాటు దానధర్మాల్లో మార్గదర్శిగా వెలుగొందిన తన తండ్రి గ్రంథి సుబ్బారావు ఆశయాలు, ఆదర్శాలు కొనసాగిస్తానన్నారు.

1960లోనే ఆస్ట్రేలియాలో పోలియో నిర్మూలన

ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం



పిల్లలతో ఆస్ట్రేలియా ప్రతినిధులు

పెదవాల్తేరు (విశాఖతూర్పు): ఆస్ట్రేలియాలో 1960 దశకంలోనే పోలియో మహమ్మారిని పూర్తిస్థాయిలో నిర్మూలించారని ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందం తెలిపింది. రోటరీ క్లబ్ తరపున ఆస్ట్రేలియా బృందం విశాఖ వచ్చి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేసింది. ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరానికి చెందిన రాన్‌ఈరీ (టీంలీడర్), గ్లెనిస్‌గేరీ, కార్లోగిడిస్, సూ ఎలుడిస్, జెస్సికా అండర్సన్, డాడ్స్ ఉట్టన్ ఆదివారం చినవాల్తేరులోని సీఎం ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బూత్‌ను సందర్శించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు పిల్లలతో ఫొటోలు దిగారు. అనంతరం వారు 'సాక్షి'తో మాట్లాడుతూ, భారత్‌లో పోలియో నివారణకు పల్స్‌పోలియో పేరిట భారీస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాము శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో కూడా పర్యటిస్తామని, ఈనెల 3న మొదలైన తమ పర్యటన 14న ముగుస్తుందని చెప్పారు. రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ తరపున భారత్‌లో పర్యటిస్తున్నామన్నారు. వారి వెంట జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, రోటరీక్లబ్ విశాఖ సెంట్రల్ అధ్యక్షుడు మనోజ్, కార్యదర్శి రష్మి తదితరులు ఉన్నారు.

హోదా కోసం అఖిలపక్షం వేయండి

ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేలా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా తరువాత కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పులేదని, పార్లమెంటు సమావేశాలు ముగిసే నాటికి రాష్ట్రానికి దక్కాల్సినవి సాధించుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

- పొలంలోనే పురుగుమందు తాగిన వైనం
- రూ.17 లక్షల అప్పులు



నాగేశ్వరరావు మృతదేహం

ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామ పొలాల్లో ఆదివారం ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాశం జిల్లా కుర్రవనిపాళెం గ్రామానికి చెందిన తుమాటి నాగేశ్వర రావు(65) 27 సంవత్సరాల క్రితం ఎమ్మిగనూరుకు వలస వచ్చారు. కొన్నేళ్లుగా కలుగొట్ల పంచాయతీ పరిధిలో పదకొండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మొక్క జొన్న, మిర్చి పంటలను సాగుచేస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా పంటలు సరిగా రాకపోవటం, గిట్టుబాటు ధరలు లేకపోవటంతో నష్టపోయాడు. పెట్టుబడుల కోసం రూ.17 లక్షల వరకు అప్పు చేశాడు. పంట చేతికి వచ్చే సమయానికి అప్పుల వారు ఒత్తిడి తీసుకువస్తుండటంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి చాలా సేపటికి తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడు వెళ్లి చూడగా తండ్రి స్పృహకోల్పోయి ఉన్నాడు. పురుగుల మందు డబ్బా పక్కనే ఉండడంతో చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుతాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు.

హోదా విషయంలో బాబుది డబుల్ గేమ్

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మండిపాటు



గన్నవరం: ప్రత్యేక హోదా విషయంలో సీఎం చంద్రబాబు డబుల్ గేమ్ ఆడుతున్నారని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మండిపడ్డారు. ఒక పక్క ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా, మరో పక్క ప్రధాని మోదీకి ఆగ్రహం రాకుండా చూసుకోవాలనే ద్వంద్వ వైఖరి సరికాదని హితవు పలికారు. ఆదివారం కృష్ణా జిల్లా గన్నవరంలోని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వింత సంజీవరెడ్డి నివాసంలో కేంద్ర మాజీ మంత్రి పల్లాంరాజు, టీపీసీసీ నేత మల్లు భట్టివిక్రమార్కతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రత్యేక హోదా సంజీవని కాదని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. పోలవరం, రాజధాని నిర్మాణాల్లో ఎంత దోచుకోవాలి, ఎమ్మెల్యేల సీట్లు ఎలా పెంచుకోవాలనే ఆరాటం తప్ప రాష్ట్ర ప్రయోజనాలు బాబుకు పట్టడం లేదని ధ్వజమెత్తారు. హోదా కోసం అన్ని పార్టీలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఓటమి భయంతోనే కొత్త ఫ్రంట్‌ను తెరమీదకు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, డీసీసీ అధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్, కిసాన్ సెల్ కన్వీనర్ కొమ్మినేని మల్లికార్జునరావు, పీసీసీ నాయకులు నరహరశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

కాలం చెల్లిన వాహనాలే టార్గెట్!

- పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుంటే జరిమానా..
- కేసుల నమోదుకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కోటి దాటిన వాహనాలు విడుదల చేస్తున్న టన్నుల కొద్ది కార్బన్ మోనాక్సైడ్ పరిసరాల్ని విషతుల్యంగా మార్చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అంచనా ప్రకారం రాష్ట్రంలో ప్రజలు నిత్యం 910 టన్నుల కాలుష్యాన్ని పీలుస్తున్నారు. నిషేధిత ధూళి కణాలు కూడా ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. వాహన కాలుష్యాన్ని తగ్గించాలని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ అన్ని రాష్ట్రాల రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రవాణా శాఖ అధికారులు వాహన కాలుష్యంపై దృష్టి సారించారు. కాలం చెల్లిన వాహనాలపై గురి పెట్టారు. సాధారణంగా రవాణా అధికారులు రిజిస్ట్రేషన్, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మాత్రమే తనిఖీలు చేస్తారు. ఇకపై అన్ని కేటగిరీ వాహనాలకు పొల్యూషన్ సర్టిఫికెట్ ఖచ్చితంగా పొందాలి. లేకుంటే రూ. 500 నుంచి రూ. 2 వేల వరకు జరిమానా విధించాలని, కేసులు నమోదు చేయాలని రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దశల వారీగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ వాహన కాలుష్య తనిఖీలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు. తొలిదశలో విజయవాడ, విశాఖలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పొల్యూషన్ సర్టిఫికెట్లు తనిఖీ చేయనున్నారు. కాగా, రాష్ట్రంలో 15 ఏళ్ల దాటిన వాహనాలు 14.04 లక్షలు ఉన్నట్లు గతేడాది రవాణా శాఖ అంచనా వేసింది.


చీరాల కొత్తపేటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జగన్


చీరాలలో చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న జననేత


ఈపూరుపాలెంలో అవ్వతో ఆప్యాయంగా..


కొత్తపేటలో దివ్యాంగురాలైన చిన్నారితో మాట్లాడుతున్న జగన్


చీరాలలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


ఈపూరుపాలెంలో నేతను పరిశీలిస్తున్న జగన్


సోదరి, అవ్వ ఇచ్చిన రాగి జావ తాగుతున్న జననేత

చీరాల వీధుల్లో జనజాతర

- అడుగడుగునా ప్రతిపక్ష నేత జగన్‌కు ఘన స్వాగతం
- మరోవైపు తమ బాధలు చెప్పుకున్న జనం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడంటూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు చీరాలలో ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. నీవే మా ఆశ.. శ్వాస.. అండ.. దండా అంటూ అడుగులో అడుగు వేశారు. కరచాలనాలు, సెల్ఫీలు, ఆటోగ్రాఫుల కోసం యువతీ యువకులు, అక్క చెల్లెమ్మలు పోటీపడ్డారు. మేళతాళాలు, తప్పెట్లు, డప్పు వాయిద్యాలు, బాణసంచా మోత మధ్య వీధి వీధినా ఎదురేగి స్వాగతం పలికారు. మళ్లీ నాన్నగారి నాటి సువర్ణ యుగం రావాలని, రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రజాసంకల్ప యాత్ర ఆదివారం 109వ రోజు ప్రకాశం జిల్లా చీరాల నుంచి కొనసాగింది. కొత్తపేట ఆంధ్రకేసరి జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి లోకం జగన్‌కు ఘన స్వాగతం పలికింది. ప్రత్యేక హోదా జగనన్నతోనే సాధ్యం.. హోదా వస్తేనే తమకు విద్య, ఉపాధి అని, కాబోయే ముఖ్యమంత్రి జగనన్నేనని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అడుగు కదపనీయకుండా కొత్తపేట వాసులు కదం తొక్కారు. ప్రత్యేకించి ఆడపడుచులు హారతులు పట్టి, నుదుట తిలకాలు దిద్దారు. పిల్లలకు నామకరణం చేయించారు. నవదంపతులు ఆశీర్వాదాలు తీసుకున్నారు. మూడు కిలోమీటర్ల యాత్రకు మూడున్నర గంటల సమయం పట్టిందంటే జనాభిమానం ఏస్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. మరోవైపు తమ సమస్యలనూ విన్నవించారు.

ఆరోగ్యశ్రీని ఆగం పట్టించారయ్యా..

చీరాలకు చెందిన షేక్ అల్తాఫ్‌కు ఏడాది వయస్సులోనే మాట రావడం లేదని గుర్తించారు. కనబడిన పెద్దాస్పత్రినల్లా సంప్రదించారు. కొంత వయసు వచ్చే వరకు ఆగమన్నారు. అలా పదేళ్లు గడిచిపోయాయి. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బడుగు వర్గాలకు చేయూత నిచ్చేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారు. ప్రత్యేకించి మూగ, చెవుడు ఉన్న పిల్లలకు ఏడెనిమిది లక్షల రూపాయల ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లను సైతం ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చి ఆదుకున్నారు. ఖరీదైన ఈ ఆపరేషన్ చేయించేందుకు అపోలో వంటి పెద్దాస్పత్రులను సైతం నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేర్చారు. ఆ విధంగా అల్తాఫ్‌కు 2009 అక్టోబర్ 26న డేట్ ఖరారు చేసి ఆపరేషన్‌కు రమ్మన్నారు. ఇంతలో అదే ఏడాది సెప్టెంబర్ 2న డాక్టర్ వైఎస్సార్ మృతి చెందారు. అంతే.. ఆరోగ్య శ్రీ అటకెక్కింది. అల్తాఫ్ ఆపరేషన్ ఆగిపోయింది. ఇప్పటికి 8 ఏళ్లు దాటిపోయాయి. ఆ పిల్లాడిని తీసుకుని వాళ్లమ్మ హసీనా ఇప్పటికీ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి చుట్టూ తిరుగుతూనే ఉంది. యథావిధిగా ఆ ఆస్పత్రి వాళ్లు.. మేమిప్పుడు ఆ ఆపరేషన్లు ఆరోగ్య శ్రీ కింద చేయడం లేదని చెబుతున్నారు. రెండు నెలల వ్యవధిలో అల్తాఫ్ బతుకు ఉల్టా పల్టా అయింది. డాక్టర్ వైఎస్సార్ బతికుంటే నా బిడ్డకు మాటలొచ్చేవని అంటోంది హసీనా. ఇప్పుడా బిడ్డకు 19 ఏళ్లు. ఇతరులు మాట్లాడుతుంటే ఆశగా వాళ్ల నోళ్ల వైపు చూడడం తప్ప నా బిడ్డ నోట మాటరావడం లేదయ్యా అంటూ ఆమె పాదయాత్రలో వైఎస్ జగన్ ఎదుట కన్నీటిపర్యంతమైంది. డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ ఆగమాగమైందని ఆవేదన వ్యక్తం చేసింది. మీరు అధికారంలోకి వచ్చి నా బిడ్డలాంటి వాళ్లందర్నీ కనికరించాలని ఆకాంక్షించింది. అందుకే తాను అధికారంలోకి రాగానే ఆరోగ్య శ్రీని మరింత మెరుగ్గా అమలు చేస్తానని, ఏ పేదవాడు ఆరోగ్యం కోసం అప్పుల పాలు కాకుండా ఆదుకుంటానని జననేత జగన్ భరోసా ఇచ్చారు.

నేటి నుంచి గుంటూరు జిల్లాలో ప్రజా సంకల్ప యాత్ర

సాక్షి, అమరావతి బ్యూరో: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర సోమవారం గుంటూరు జిల్లాలోకి ప్రవేశిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాదయాత్ర కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ ఆదివారం తెలిపారు. జిల్లాలో 13 నియోజకవర్గాల్లో 20 రోజులకుపైగా పాదయాత్ర సాగుతుందని చెప్పారు. బాపట్ల, పొన్నూరు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు, తాడికొండ, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, వేమూరు, తెనాలి, మంగళగిరి నియోజకవర్గాల్లో దాదాపు 275 కిలో మీటర్లకుపైగా యాత్ర సాగుతుందని వివరించారు. సోమవారం బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురం వద్ద పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశిస్తుందని, బాపట్లలో మూడు గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

కనికరం లేని ప్రభుత్వమిది..

చీరాలలోని కొత్తపేటకు చెందిన పి.కపాసన్ అనే ఆరేళ్ల బాలుడి తల్లిదండ్రులు కూలీనాలీ చేసుకుని బతుకీడుస్తున్నారు. ఏడాది కిందట జ్వరం వస్తే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పది రోజులు ఆ టెస్టులు ఈ టెస్టులు చేసిన తర్వాత ఈ పిల్లాడికి బ్లడ్ క్యాన్సర్ అని తేల్చారు. కీమోథెరపీ తక్షణమే చేయిస్తే మేలు జరగొచ్చని వైద్యులు చెప్పారు. దీంతో హతాశులైన తల్లిదండ్రులు కడుపుతీపి చంపుకోలేక ఐదు రూపాయల వడ్డీకి రూ.3 లక్షలు అప్పు చేసి హడావుడిగా కీమోథెరపీ చేయించారు. ఇప్పుడా డబ్బు అయిపోయింది. మరో ఐదారు లక్షల రూపాయలన్నా ఖర్చవుతుందని, ఆ డబ్బు తీసుకురండని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. క్యాన్సర్ వ్యాధికి ఆరోగ్య శ్రీ కింద చికిత్స అందించలేమని నెట్‌వర్క్ ఆస్పత్రులు తెగేసి చెబుతున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదంటూ ఆ బాలుని తల్లి జయ వైఎస్ జగన్ ఎదుట కన్నీరు మున్నీరైంది. కనికరం లేని ఈ ప్రభుత్వాన్ని కదిలించడయ్యా అని వాపోయింది.

కాయకష్టమంతా అర్జీలకే సరి..

భర్త చనిపోయి, ఆదరువు, ఆదరణ కరవై ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు పింఛన్ల కోసం పలువురు వితంతువులు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. చీరాలకు సమీపంలోని లక్ష్మీపురానికి చెందిన పలువురు మహిళలు పెన్షన్ల కోసం తాము పడుతున్న ఇక్కట్లను చెప్పినప్పుడు విస్తుపోవడం వైఎస్ జగన్ వంతైంది. లక్ష్మీపురానికి చెందిన చింతా రత్నకుమారి భర్త నాలుగేళ్ల కిందట చనిపోయారు. ఆమెకున్న ఏకైక కుమార్తె కూడా ఇటీవల చనిపోయింది. దీంతో ఆమె ఒంటరి అయ్యారు. కూలీనాలీ చేసుకోలేక పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నాలుగేళ్లుగా తిప్పుతూనే ఉన్నారు. జన్మభూమి కమిటీలు మొదలు రెవెన్యూ అధికారుల వరకు ఆమె వెళ్లిన ప్రతిసారీ 'దరఖాస్తు తెచ్చావా? జిరాక్సు పేపర్లు తెచ్చావా? అంటున్నారయ్యా.. చేసిన కష్టమంతా ఈ జిరాక్సులు, ఆ దరఖాస్తులకే సరిపోతుందయ్యా..' అని వాపోయారు. మరో మహిళ సామ్రాజ్యం పరిస్థితి మరీ దారుణం. ఐదేళ్ల కిందట భర్త చనిపోయాడు. అల్లుళ్లు ముగ్గురూ తాగుబోతులు కావడంతో కూతుళ్లు పుట్టింటికి చేరారు. ఆమె కూలి డబ్బులు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకుని మూడేళ్లు గడిచినా ఇంతవరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. వీరి గాథల్ని ఓపికగా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి తక్షణమే పింఛన్లు వచ్చే ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

ఓరుగంటిరెడ్లను ఆదుకోండి..

తాము పేరుకు రెడ్లమే అయినా ఆర్థికంగా బాగా వెనుకబడిన వాళ్లమని, ఒకప్పుడు బీసీల్లో ఉన్నా.. ఇప్పుడు ఓసీలంటూ తమకు అన్యాయం చేస్తున్నారని ఓరుగంటిరెడ్ల సంఘం నేతలు జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కోస్తాలోని నాలుగు జిల్లాల్లో నాలుగు లక్షల మందిమి ఉన్నామని వివరించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని జగన్ వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ఎస్కే బాషా నాయకత్వంలో పలువురు ముస్లింలు జగన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన మాన్యం, అసైన్డ్ భూముల్ని తమకు తిరిగి ఇప్పించాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పాటికల పూడి జయరాం నాయకత్వంలో పలువురు జగన్‌కు విన్నవించారు. సేవా కులాలైన కమ్మరి, కుమ్మరి, రజక, నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ తదితర కులాల ఆధీనంలో పశువుల బీడు, పీర్ల మాన్యం, అసైన్డ్ భూములు ఉండేవని, ఇప్పుడవి అన్యాక్రాంతమై సేవా కులాల చేజారాయని, వాటిని తిరిగి తమకు ఇప్పించేలా చూడాలని కోరారు. దీనికి జగన్ స్పందిస్తూ మన ప్రభుత్వం రాగానే ప్రతి సేవా కులానికీ న్యాయం చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోయాయని వసుంధరా దేవి నాయకత్వంలోని మహిళలు జగన్‌తో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ప్రజాసంకల్ప యాత్ర 109వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,472.2** కిలోమీటర్లు

109వ రోజు నడిచిన దూరం **10.3** కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.7.30 గంటలకు చీరాల

ముగింపు
సా.6.00 గంటలకు ఈపూరుపాలెం

ముఖ్యాంశాలు
- చీరాల, కొత్తపేట, ఆంధ్రకేసరి జూనియర్ కళాశాల ప్రాంతం, బాలాజీ థియేటర్ సమీపం, పేరాల, ఐటీసీ, ఈపూరుపాలెంలో జనంతో మమేకం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ.7.30 గంటలకు ఈపూరుపాలెం

ముఖ్యాంశాలు
- పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈపూరుపాలెం వద్ద పతాకావిష్కరణ
- స్టూవర్టుపురం వద్ద గుంటూరు జిల్లాలోకి ప్రవేశం
- ఈపూరుపాలెం (ప్రకాశం జిల్లా), గుంటూరు జిల్లాలోని బేతపూడి, వెదుళ్లపల్లి, వడ్డెపాలెం, మహాత్మాజీపురంలో జనంతో మమేకం
- బాపట్లలో బహిరంగ సభ

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

ప్రకాశించిన ప్రజా సంకల్పం

ప్రకాశం జిల్లాలో ముగిసిన ప్రతిపక్ష నేత పాదయాత్ర
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు..
- జిల్లాలో 21 రోజుల్లో 278.1 కి.మీ నడిచిన జగన్
- 9 నియోజకవర్గాలు, 19 మండలాలు, 124 గ్రామాల మీదుగా యాత్ర
- ఎనిమిది బహిరంగ సభలకు పోటెత్తిన జనం
- ఈ ప్రభుత్వంలో అన్నీ సమస్యలేనని వాపోయిన ప్రజలు
- అందరికీ ధైర్యం చెబుతూ ముందుకు సాగిన జననేత
- మన ప్రభుత్వం రాగానే ఆదుకుంటామని భరోసా
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం

ఇడుపులపాయ మొదలు ఇప్పటి వరకు..

పాదయాత్ర జరిగిన జిల్లాలు	6
నియోజకవర్గాలు	49
మండలాలు	86
గ్రామాలు	753
బహిరంగ సభలు	50
వివిధ వర్గాల వారితో సదస్సులు	26

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్రకు జనం ప్రభంజనంలా తరలివచ్చారు. అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. అక్కచెల్లెమ్మలు హారతులు పట్టి నుదుట తిలకం దిద్దారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వృద్ధులు, వికలాంగులు మొదలుకొని అన్ని వర్గాల వారు జగన్ యాత్రకు తరలివచ్చి ఆయనతో కలసి అడుగులో అడుగు వేశారు. అండగా తామున్నామంటూ ఆశీర్వదించారు. తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడంటూ సమస్యలు ఏకరువు పెట్టారు. చంద్రబాబు సర్కారు వైఫల్యాలను జగన్ దృష్టికి తెచ్చారు. ఎన్నికల హామీలను విస్మరించి వంచించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సమస్యలు విన్న జగన్ మీ అందరి ఆశీస్సులతో మన ప్రభుత్వం రాగానే అన్ని సమస్యలు పరిష్కరించుకుందామని భరోసానిస్తూ ముందుకు సాగారు. అడుగడుగునా ప్రత్యేక హోదా నినాదాన్ని వినిపించారు. హోదాతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, హోదా వల్ల ఉపయోగాలను ప్రజలకు వివరించారు. జననేత పాదయాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. ఫిబ్రవరి 16న కందుకూరు నియోజకవర్గం లింగసముద్రం మండలం రాళ్లపాడు వద్ద వైఎస్ జగన్ పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించింది. 21 రోజుల పాటు సాగిన యాత్రలో కందుకూరు, కనిగిరి, మార్కాపురం, సంతనూతలపాడు, దర్శి, అద్దంకి, పర్చూరు, చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలకు జనం పోటెత్తారు. కొండపిలో రైతు సదస్సును నిర్వహించారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ వై.వి.సుబ్బారెడ్డిలతో పాటు ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు, జిల్లాలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు జగన్ వెంట నడిచారు.

జగనన్నా.. మీరే ఆదుకోవాలి..

రామాయపట్నం పోర్టు ఏర్పాటు, రాళ్ళపాడు ప్రాజెక్టు ఆధునీకరణ, సోమశిల ఉత్తర కాలువ నిర్మాణం పూర్తి తదితర సమస్యలను జనం వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పొగాకు రైతులు తమ ఇబ్బందులు జగన్‌తో చెప్పుకున్నారు. పొగాకు, శనగ, కంది పంటలకు గిట్టుబాటు ధర లేదని వాపోయారు. ఒంగోలు డెయిరీ పరిధిలో వేలాది మంది రైతులకు చెల్లించాల్సిన పాల బకాయిలను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రధాన సమస్యగా ఉన్న ఫ్లోరైడ్, కిడ్నీ వ్యాధి ఇక్కట్లను ప్రజలు జగన్ దృష్టికి తెచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో మొదలైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో బాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జగన్ మండిపడ్డారు. తమ ప్రభుత్వం రాగానే నీటి పారుదల ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేస్తామని చెప్పారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు మూత పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం ఢిల్లీలో ధర్నా చేయడానికి వెళ్తున్న పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసి పంపారు. దొనకొండ పారిశ్రామిక వాడలో లక్షల కోట్లతో పరిశ్రమలు, లక్షలాది మందికి ఉద్యోగాలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఏ ఒక్క పరిశ్రమ నెలకొల్పలేదని ఒక్కరికీ ఉద్యోగమివ్వలేదని జగన్ విమర్శించారు. చేనేతల సమస్యలు పరిష్కరిస్తామని, చీరాలలో నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాలలు, మాదిగలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని, నవరత్నాలతో అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


చీరాలలో సభకు హాజరైన అశేషజనవాహినిలో ఓ భాగం


అద్దంకిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్


దర్శి నియోజకవర్గం తాళ్లూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్


సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తిలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్ జగన్


కందుకూరులో సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం. సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



కనిగిరి, పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్న జననేత


మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో జరిగిన సభలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత

‘యంత్రం’లో అవినీతి తంత్రం!

▶ మొదటి పేజీ తరువాయి

పొడిగించింది. ఈ క్రమంలో వెలిగొండ ప్రాజెక్టులో రెండు సొరంగాల పనులు చేస్తున్న పాత కాంట్రాక్టర్లకు 60సీ నిబంధన కింద నోటీసులు ఇచ్చింది. మొదటి సొరంగంలో మిగిలిన 3.6 కి.మీ.ల పనులను రూ.116.44 కోట్లతో, రెండో సొరంగంలో మిగిలిన 8.037 కి.మీ.ల పనులను రూ.299.48 కోట్లతో పూర్తి చేయొచ్చని అధికారులు ప్రతిపాదించారు. అయితే, ‘ముఖ్య’నేత ఒత్తిడితో మొదటి సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువను రూ.301.01 కోట్లకు, రెండో సొరంగంలో మిగిలిపోయిన పనుల అంచనా విలువను రూ.730.04 కోట్లకు పెంచేశారు. రెండు సొరంగాల పనులను తన కోటరీలోని ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించేలా నిబంధనలు రూపొందించి, టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని జలవనరుల శాఖ అధికారులను ‘ముఖ్య’నేత ఆదేశించారు.

అదిరిపోయే ప్రణాళిక

సొరంగాల తవ్వకం కోసం ఉపయోగించే యంత్రాలు(టన్నెల్ బోరింగ్ మెషీన్–టీబీఎం) కొనుగోలుకు 2005లోనే కాంట్రాక్టర్లకు సర్కార్ నిధులు ఇచ్చింది. ఆ యంత్రాలను కొత్త కాంట్రాక్టర్లకు అప్పగిస్తే సరిపోతుంది. కానీ, గతంలో కొనుగోలు చేసిన యంత్రాలను మళ్లీ కొనడానికి రూ.172.44 కోట్లను కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.51.97 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.120.47 కోట్లు ఇవ్వనుంది. ఇక టీబీఎంలకు కొత్త బుష్‌లు అమర్చడానికి, కన్వేయర్ బెల్ట్ మార్చడానికి 2016 జూన్‌లో ప్రభుత్వం రూ.68.44 కోట్లు ఇచ్చింది. తాజాగా మళ్లీ కొత్త బుష్‌లు అమర్చడానికి, కన్వేయర్ బెల్ట్ మార్చడానికి మొదటి సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.26.26 కోట్లు, రెండో సొరంగం కాంట్రాక్టర్‌కు రూ.25.39 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అంటే బుష్‌లు, కన్వేయర్ బెల్ట్‌ల పేరుతో మళ్లీ రూ.51.65 కోట్లు ఇవ్వనుంది. దీనివల్ల అంచనా వ్యయం రూ.224.09 కోట్లు పెరిగింది. ముందే ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా ఈ పనులను అప్పగించి, రూ.224.09 కోట్లను తన జేబులోకి వేసుకోవడానికి ‘ముఖ్య’నేత ఎత్తులు వేస్తున్నారు.

అభ్యంతరాలు బేఖాతరు

తమకు చెల్లించాల్సిన బిల్లులు, పరిహారం ఇవ్వకుండా 60సీ నిబంధన కింద పనులను తొలగించి, కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించాలన్న సర్కార్ నిర్ణయంపై వెలిగొండ సొరంగాల కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. పాత కాంట్రాక్టర్ల లెక్కలు తేల్చిన తర్వాత టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని హైకోర్టు ఇటీవల ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా పెంచిన అంచనా వ్యయంతో వెలిగొండ సొరంగాల పనులకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ జలవనరుల శాఖ అధికారులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో టెండర్లు నిర్వహిస్తే న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. టీబీఎంలు కొనడానికి గతంలోనే కాంట్రాక్టర్లకు నిధులు ఇచ్చామని.. బుష్‌లు, కన్వేయర్ బెల్ట్ మార్చడానికి 2016లో మళ్లీ రూ.68.44 కోట్లు ఇచ్చామని ఈ నేపథ్యంలో మళ్లీ పాత యంత్రాల కొనుగోలు, బుష్‌లు, కన్వేయర్ బెల్ట్‌ల మార్పు పేరుతో అంచనా వ్యయాన్ని రూ.224.09 కోట్లు పెంచేయడాన్ని ఆర్థిక శాఖ తప్పుపట్టింది. టెండర్లు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వబోమని తేల్చిచెప్పింది. అయితే, ‘ముఖ్య’నేత తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేయడంతో టెండర్ నోటిఫికేషన్ జారీకి అనుమతి ఇవ్వక తప్పలేదని ఆర్థిక శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. వెలిగొండ సొరంగాల పనులకు జలవనరుల శాఖ వారం రోజుల్లోగా టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనుంది.



ఎమ్మెల్యేతో వాగ్వివాదం చేస్తున్న స్థానికులు

‘పార్కు స్థలంలో ఇళ్లకు శంకుస్థాపనా?’

పాతపోస్టాఫీసు(విశాఖ దక్షిణ): విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భావించిన ఆయనపై ప్రజలు తిరుగుబాటు చేశారు. ఎమ్మెల్యే కారును అడ్డగించడంతో కార్యకర్తలు, నాయకుల సాయంతో అక్కడ నుంచి ఉడాయించారు. వివరాలు.. జీవీఎంసీ పరిధిలోని 26వ వార్డు సీహార్స్ కూడలి వద్ద ఖాళీ స్థలంలో ప్రభుత్వ గృహాల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేసేందుకు వచ్చారు. అయితే ఈ స్థలం పార్కు కోసం కేటాయించిందని, కోర్టులో కేసు నడుస్తుండగా ఇళ్ల నిర్మాణానికి ఎలా శంకుస్థాపన చేస్తారని స్థానికులు నిలదీశారు. ఖాళీ స్థలంలోకి ఎమ్మెల్యేను వెళ్లకుండా నిలువరించే ప్రయత్నించారు. పోలీసుల సాయంతో బలవంతంగా లోపలికి వెళ్లిన వాసుపల్లి శంకుస్థాపన చేసి వెనుతిరగగానే ఆయన కారును స్థానికులు అడ్డుకున్నారు. వాసుపల్లికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వృద్ధులు, మహిళలు అని కూడా చూడకుండా టీడీపీ నాయకులు, పోలీసులు ఈడ్చిపారేశారు. ఈ క్రమంలో కొంతమంది గాయపడ్డారు. అయినా ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసులు, కార్యకర్తల సహాయంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎన్డీయేలో ఉంటూ కేంద్రంపై విమర్శలా?





విజయవాడలో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ భేటీలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, చిత్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, కామినేని, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తదితరులు, పక్కన టీడీపీలో పడ్డ ఇబ్బందులు చెబుతూ కన్నీటి పర్యంతమైన కవిత.

- టీడీపీ వైఖరిపై బీజేపీ రాష్ట్ర శాఖ ఆగ్రహం
- కొంతకాలం వేచి చూసి, నిర్ణయం
- రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం
- చేసిన పనుల గురించి చెప్పుకుందాం..
- అభివృద్ధి పనులపై కరపత్రాలు, పుస్తకాలు
- బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగుతామని చెబుతూనే కేంద్ర ప్రభుత్వంపై విమర్శల పర్వం కొనసాగిస్తున్న తెలుగుదేశం పార్టీపై బీజేపీ రాష్ట్ర నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందంటూ ముఖ్యమంత్రి, మంత్రులతోసహా టీడీపీ నేతలు పదేపదే ప్రకటనలు చేస్తుండడం పట్ల మండిపడ్డారు. టీడీపీ వైఖరిపై కొంతకాలం వేసిచూసి, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. ఒకవైపు టీడీపీ తీరును గమనిస్తూనే.. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ నిర్ణయించింది. కేంద్రంలో టీడీపీ మంత్రులు, రాష్ట్రంలో బీజేపీ మంత్రుల రాజీనామా తదనంతర పరిణామాలపై చర్చించేందుకు బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ ఆదివారం సమావేశమైంది. పార్టీ కేంద్ర పరిశీలకుడు సతీష్‌జీ నేతృత్వంలో విజయవాడలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు హరిబాబు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యేలు పి.మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు కంతేటి సత్యనారాయణ రాజు, పీవీఎన్ మాధవ్, కేంద్ర మాజీ మంత్రులు పురంధేశ్వరి, కావూరి సాంబశివరావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు సురేష్‌రెడ్డి, జమ్ముల శ్యాంకిషోర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం పార్టీ వైఖరిపై చర్చించారు. ఎన్డీయేలోనే కొనసాగుతాం, వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వం అంటూనే కేంద్రంపై టీడీపీ విమర్శలు చేయడం ఏమిటని పలువురు నేతలు ప్రశ్నించినట్లు సమాచారం. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో తన పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసమే చంద్రబాబు టీడీపీ మంత్రుల చేత రాజీనామాలు చేయించారని బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

అభివృద్ధి పనులను ప్రజలకు చూపుదాం...

ప్రత్యేక హోదా అనేది రాష్ట్రంలో సెంటిమెంట్‌గా మారిందని, అందుకే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ కేంద్రం చేసిన సాయాన్ని చెప్పుకోవడానికే పరిమితం కావాలని నిర్ణయించారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపాలని తీర్మానించారు. నియోజకవర్గాల వారీగా రాష్ట్ర నేతలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, కేంద్రం ఇస్తున్న నిధుల వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, దీనిపై కరపత్రాలు సైతం పంపిణీ చేయాలని నిర్ణయానికొచ్చారు. టీడీపీ వైఖరిలో స్పష్టత వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో రాష్ట్రంలోసమావేశాలు ఏర్పాటు చేయాలని ఏపీ బీజేపీ పెద్దలు యోచిస్తున్నారు. కాగా, టీడీపీ నేత, సినీ నటి కవిత ఆదివారం బీజేపీలో చేరారు.

రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం?: హరిబాబు

విభజన చట్టంలోని 85 హామీలను నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం మూడున్నర ఏళ్లలోనే నెరవేర్చిందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు చెప్పారు. ఇంత చేసినా రాష్ట్రానికి బీజేపీ ఏమీ చేయలేదంటూ మిత్రపక్షం టీడీపీతో సహా పలు పార్టీలు విమర్శిస్తున్నాయని తప్పుపట్టారు. కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న పనుల పురోగతిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై కరపత్రాలు, పుస్తకాలు ముద్రించి, పంపిణీ చేస్తామని చెప్పారు. దేశ, రాష్ట్రాభివృద్ధిని కోరుకునే వారందరూ బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6న రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు మోటార్ సైకిళ్ల ర్యాలీలు నిర్వహించి, కేంద్రం ఏపీకి అందించిన ఆర్థిక సాయంపై ప్రచారం చేస్తారని హరిబాబు తెలిపారు.

బ్రహ్మానందానికి ‘హాస్య నట బ్రహ్మ’ అవార్డు



స్టేషన్ మహబూబ్ నగర్: 1,100 పైగా సినిమాల్లో నటించిన ప్రముఖ హాస్యనటుడు కె.బ్రహ్మానందాన్ని ‘హాస్య నట బ్రహ్మ’అవార్డుతో సత్కరించారు. టీఎస్‌ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. సినీ ప్రముఖులు సినీనటులు జయప్రద, రాజశేఖర్, జీవిత, బాబుమోహన్, అలీ, శ్రద్ధాదాస్, రఘుబాబు, శ్రీనివాస్‌రెడ్డిలకు కాకతీయ పురస్కారాలు అందజేశారు. కళారంగంలో సేవలు అందిస్తున్న ఎల్లారి శివారెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గోరటి ఎంకన్న, చిక్కా హరీశ్, జంగిరెడ్డి, వంగీశ్వర నీరజ, పద్మాలయ ఆచార్యాను ‘కాకతీయ అవార్డు’లతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి, కళాబంధు సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.



తిరుమలలో జస్టిస్ సునీల్‌చౌదరి



కోదండరాముని సన్నిధిలో జస్టిస్ ఎ.శంకర్‌నారాయణ దంపతులు



తిరుమలలో జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న బోర్డు సెల్ ఏఈవో ధనుంజయులు

రామయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమలకు చేరుకున్న జస్టిస్ సునీల్‌చౌదరి, జస్టిస్ ప్రవీణ్‌కుమార్

ఒంటిమిట్ట/తిరుపతి (అలిపిరి): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ఆదివారం తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.శంకర్‌నారాయణ తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవా చార్యులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రధాన అర్చకులు ఆలయ చరిత్ర గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిలాశాసనం ఎంతో ప్రాచీనమైనదని, శిల్పకళ ఆకట్టుకుందని తెలిపారు. తర్వాత పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కొంతమంది పిల్లలకు పోలియో చుక్కలు దంపతులు వేశారు. వీరి వెంట వైఎస్సార్ జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, సిద్ధవటం జడ్జి రాజశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగరాజు, రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రవికుమార్ ఉన్నారు. ఇలా ఉండగా, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ సునీల్‌చౌదరి ఆదివారం తిరుమలకు వచ్చారు. కుటుంబసభ్యులతో కలిసి వేర్వేరుగా తిరుమలకు చేరుకున్నారు. వారికి టీటీడీ అధికారులు దర్శనం, బస ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

3 వేల ఏళ్ల కిందటే గుజరాత్‌తో వేలేరుపాడుకు సంబంధాలు

- పుణే డెక్కన్ కాలేజీ వీసీ వాసంత్ సిండే
- రుద్రంకోటలో తవ్వకాలను పరిశీలించిన దక్షిణ కొరియా బృందం




సమాధుల తవ్వకాల్లో బయట పడిన వస్తువులను పరిశీలిస్తున్న దక్షిణ కొరియా బృందం

కుక్కునూరు: పశ్చిమ గోదావరి జిల్లా వేలేరుపాడు (పోలవరం విలీన మండలం) మండలం రుద్రంకోటలో కొంతకాలంగా తవ్వకాలు జరుగుతున్న పురాతన సమాధులను ఆదివారం దక్షిణ కొరియా బృందం పరిశీలించింది. పుణేకు చెందిన డెక్కన్ కాలేజీ వైస్ చాన్స్‌లర్ వాసంత్‌సిండే కూడా ఈ బృందంతో పాటు వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. సమాధుల్లో బయటపడిన వస్తువులను బట్టి చేస్తే మూడు వేల ఏళ్ల క్రితమే ఇక్కడి వారికి గుజరాత్‌తో వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోందని చెప్పారు. సమాధుల్లో బయటపడిన పూసలను కార్మేలియన్, క్వాడ్జ్ వంటి క్రిస్టల్స్‌తో తయారు చేశారని, అందులో కార్మేలి యన్ రాయి దేశంలో ఒక్క గుజరాత్‌లో మాత్రమే లభిస్తుందని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాయిన గూడెంలోనూ ఈ తరహా సమాధులను గుర్తించామన్నారు. రుద్రంకోట ముంపు గ్రామమైనందున ఇక్కడి దొరికే వస్తువులను భావితరాలకు అందించేలా మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బృందంలో డెక్కన్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంతి పవార్, పురావస్తుశాఖ టెక్నికల్ అసిస్టెంట్ తిమ్మరాజు ఉన్నారు.

బడ్జెట్ అంతా తప్పుడు లెక్కలే

- రాష్ట్ర లెక్కలు, కాగ్ లెక్కలకు ఎంతో తేడా
- రూ.5 వేల కోట్లపైన రెవెన్యూ మిగులు ఎలా సాధ్యం?
- గొప్పల కోసం రాయితీలు రాకుండా చేస్తున్నారు..
- ఒక్కో వ్యక్తిపై రూ.25 వేల అప్పు చేశారు
- సాగు విస్తీర్ణం తగ్గితే.. ఉత్పత్తి ఎలా పెరిగింది?
- పెట్టుబడులు, ఉద్యోగాలంటూ భారీ మోసం
- పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: బడ్జెట్‌లో లేనిది ఉన్నట్లుగా చూపించి తప్పుడు లెక్కలతో రాష్ట్రానికి చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని పీఏసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, కాగ్ లెక్కలకు, రాష్ట్ర ప్రభుత్వ లెక్కలకు భారీ తేడాలు ఉన్నాయని తెలిపారు. ఆదివారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తప్పుడు లెక్కలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. గొప్పల కోసం రాష్ట్రానికి రావాల్సిన రాయితీలు రాకుండా చేస్తున్నారన్నారు. సమావేశంలో ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

రాష్ట్ర లెక్కలకు.. కాగ్ లెక్కలకు భారీ తేడా

‘‘2018–19లో రూ.1,55,500 కోట్ల రెవెన్యూ రాబడి ఉందని, ఖర్చు మాత్రం రూ. 1,50,000 కోట్లు ఉన్నట్లు రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీనిని బట్టి దాదాపు రూ.5,500 కోట్లు రెవెన్యూ ఎక్కువ ఉందని ప్రభుత్వం చెబుతోంది. 2017–18 సంవత్సరానికి సవరించిన అంచనాల కింద రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ రాబడి రూ.85,704 కోట్లు చూపించింది. అయితే కేంద్ర ప్రభుత్వ అటానమస్ సంస్థ కాగ్ లెక్కల ప్రకారం కేవలం రూ. 62వేల కోట్లు మాత్రమే ఉంది. దీని ప్రకారం రెవెన్యూ రాబడిలో రాష్ట్ర ప్రభుత్వం చెప్పేదానికి, కాగ్ చెప్పే దానికి రూ. 24వేల కోట్లు తేడా ఉంది. అలాగే 2018–19లో రూ. 1,05,000 వేల కోట్లు పన్నేతర రాబడి వస్తుందని చూపిస్తున్నారు. కేంద్రం నుంచి గ్రాంట్స్ రూపంలో రూ. 50,695 కోట్ల రాబడి వస్తుందని చెబుతున్నారు. అయితే కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్స్ పరిశీలిస్తే సవరించిన అంచనాల ప్రకారం 2017–18కి రూ.27,500 కోట్లు వచ్చింది. కాగ్ లెక్కల ప్రకారం (పది నెలలకు) రూ. 12,830కోట్లు మాత్రమే వచ్చింది. పాతలెక్కలకే ఇంత తేడా ఉంటే కొత్తలెక్కల్లో ఇంత మొత్తం చూపించడమేమిటి?

నమ్మశక్యంగా లేని లెక్కలు

2014–15కు రూ. 24 వేల కోట్లు, 2015–16కు రూ. 7,300 కోట్లు, 2016–17కు రూ. 17 వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 2017–18కి ప్రభుత్వం సవరణ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 4వేల కోట్లు. కానీ కాగ్ లెక్కల ప్రకారం రూ. 23 వేల కోట్ల రెవెన్యూ లోటు కనిపిస్తోంది. ప్రభుత్వం మాత్రం 2018–19కి రూ. 5,500 కోట్లు రెవెన్యూ ఎక్కువ ఉందంటుందని చెబుతోంది. ఇది ఏ మాత్రం నమ్మశక్యంగా లేదు. 2017–18 సవరించిన అంచనాల ప్రకారం పక్కా ఆస్తుల కోసం రూ. 22,874 కోట్లు ఖర్చుచేసినట్లు ప్రభుత్వం చెబుతుండగా.. కాగ్ చెబుతున్న ప్రకారం ఖర్చు చేసింది కేవలం రూ. 15వేల కోట్లే. 2018–19కి రూ. 28,500 కోట్లు పక్కా ఆస్తుల కోసం ఖర్చుచేయబోతున్నారని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 30 శాతం పెరుగుదల ఉందని ప్రభుత్వం చెబుతోంది. గతేడాది చూపిందే తప్పుడు లెక్కయితే, మళ్లీ పెరిగిందని చూపించడం మరో తప్పుడు లెక్క.

రాష్ట్ర అప్పు రూ. 2,50,000 కోట్లు

2014లో కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి 60 ఏళ్లలో ఉన్న అప్పు రూ. 97వేల కోట్లు. 2018–19కి అంటే ఐదేళ్ల పరిపాలన పూర్తయ్యే నాటికి రాష్ట్ర అప్పు రూ. 2,50,000 కోట్లకు పెరుగుతోంది. అంటే రూ.1.50 లక్షల కోట్లు అదనంగా అప్పు చేశారు. దీని ప్రకారం ప్రభుత్వం ఒక్కో వ్యక్తిపై రూ. 25వేల అప్పు చేసింది. ఇంత అప్పు చేసినా ప్రజల జీవితాలు ఏ మాత్రం బాగుపడలేదు. మరోవైపు 2014–15కు రూ. 4,300 కోట్లు ఎక్సైజ్ ఆదాయం ఉంటే.. 2018–19కి రూ.7300 కోట్లకు చేరింది. దీన్ని బట్టి ప్రజలతో తాగిస్తే ఆదాయం బాగొస్తుందని నిరూపించారు.

వ్యవసాయంలో పెరుగుదల ఎక్కడ?

వ్యవసాయం కేటాయింపుల్లో 17.44 శాతం పెరుగుదల ఉందని, సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 2013–14లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 157 లక్షల టన్నులని, 2017–18లో 157.5 లక్షల టన్నులు, 2016–17లో కొద్దిగా తగ్గి 149 లక్షల టన్నులుగా ఉందని చెప్పారు. అయితే సాగు విస్తీర్ణం 2013–14 కంటే కూడా 2017–18కి భారీగా తగ్గింది. మరి ఆహార ధాన్యాల ఉత్పత్తి ఎలా పెరిగింది? ప్రభుత్వ పెద్దలకు ముడుపుల కోసమే కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయాల్సిన పోలవరానికి రూ.రూ. 9,994 ఖర్చు పెట్టినట్లు చూపించారు.

రుణమాఫీకి రూ. 18,400 కోట్లేనా?

చంద్రబాబు చెప్పిన ప్రకారం రూ. 87,600 కోట్లు రైతు రుణాలు రద్దు చేయాలి. శ్లాబులు పెట్టి రూ. 24,500 కోట్లకు కుదించారు. ఇప్పటి వరకు రూ. 18,400 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. నిరుద్యోగ భృతి పైసా ఇవ్వలేదు. నిరుద్యోగులకు గత సంవత్సరం ఒక చెవులో పువ్వు పెడితే, ఈ సారి రెండు చెవుల్లో పువ్వులు పెట్టారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు భారీ మోసం చేశారు. ఇంత వరకు ఒక్క రూపాయి మాఫీ చేయలేదు.

పరిశ్రమల రాకపై తప్పుడు లెక్కలు

2016 నుంచి ప్రతి ఏడాది వైజాగ్‌లో జరుగుతున్న భాగస్వామ్య సదస్సు ద్వారా రూ. 16 లక్షల కోట్ల ఎంవోయూలు జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక ప్రభుత్వం చెబుతున్న ఉద్యోగాల లెక్కలు ఆంధ్రప్రదేశ్ జనాభా కంటే ఎక్కువగా ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ ప్రమోషన్(కేంద్ర ప్రభుత్వ సంస్థ) తెలిపిన లెక్కల ప్రకారం 2015లో కేవలం రూ. 4,500 కోట్లు పెట్టుబడులు, 2016లో రూ. 11,400 కోట్ల పెట్టుబడి, 2017లో కేవలం రూ. 3వేల కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయని తెలుస్తోంది. అలాగే చిన్న పరిశ్రమలు 26వేల యూనిట్లు వచ్చాయని, దాదాపు రూ. 11,500 కోట్ల పెట్టుబడులు, మూడు లక్షల ఉద్యోగాలు వచ్చాయని ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఇక పెద్ద పరిశ్రమల గురించి వారు చెబుతున్న లెక్కలు చూస్తే గుండె ఆగిపోతుంది. సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం వాస్తవాలు పరిశీలిస్తే డిసెంబరు వరకు కేవలం 6 వేల యూనిట్లు వచ్చాయి. రూ. 2,300 కోట్లు పెట్టుబడులు, 60వేల ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి’’ అని బుగ్గన పేర్కొన్నారు.

పవన్ ఇంటికి నేడు భూమిపూజ

గుంటూరు జిల్లా కాజ వద్ద నిర్మాణం



కుటుంబ సభ్యులతో విజయవాడ చేరుకున్న పవన్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు పవన్‌కల్యాణ్ గుంటూరు జిల్లా కాజ వద్ద సొంత ఇంటి నిర్మాణానికి సోమవారం ఉదయం 8.00 – 9.00 గంటల మధ్య భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పవన్‌కల్యాణ్ భార్యతో సహ ఆదివారం సాయంత్రమే విజయవాడ చేరుకున్నారు. కాజ వద్ద మురుగన్ హోటల్ రోడ్డులో సాహితీ వెంచర్స్‌లో ఇల్లు నిర్మాణానికి సంబంధించిన వ్యవహారాలను పవన్‌కల్యాణ్ ఒక ప్రైవేట్ నిర్మాణ సంస్థకు అప్పగించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భూమి పూజకు పవన్ అత్యంత సన్నిహితులకే ఆహ్వానాలు పంపినట్లు సమాచారం.

కాంట్రాక్టు ఉద్యోగులు ఏకతాటిపైకి రావాలి

ఏపీ శాక్స్ ఉద్యోగుల సమావేశంలో ఏఐటీయూసీ నేత ఓబులేసు

సాక్షి, అమరావతి: ఉద్యోగ భద్రత సాధించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి(శాక్స్) ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కృష్ణా జిల్లా గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ.. హెచ్ఐవీ బాధితులకు మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న ఏపీ శాక్స్ ఉద్యోగులను.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. సచివాలయ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ.. ఏపీ శాక్స్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ పూదోట, ఏపీ శాక్స్ ఉద్యోగ సంఘం నాయకులు వీరాస్వామి, బద్రి, కోటిరత్నం, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని నమ్ముకుంటే విభజన హామీలు గల్లంతే

మంత్రి నక్కా ఆనందబాబు

సాక్షి, అమరావతి: విభజన చట్టంలోని హామీలను బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తుందన్న నమ్మకం లేదని సాంఘిక సంక్షేమశాఖా మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు పార్లమెంట్ వేదికగా రాష్ట్రానికి అన్యాయం చేశాయన్నారు. విభజన చట్టంలోని 19 అంశాలను సాధించేందుకు తాము కేంద్రంలో పదవులను కూడా వదులుకున్నామన్నారు.

చరిత్రను కాపాడే విద్యా విధానం కావాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- జగపతిబాబుకు జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం



జగపతిబాబుకు జీవితకాల సాఫల్య పురస్కారం అందిస్తున్న వెంకయ్య

సాక్షి, న్యూఢిల్లీ: మన చరిత్రను కాపాడే విధంగా విద్యావిధానంలో మార్పులు రావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఢిల్లీ తెలుగు అకాడమీ ఉగాది సంబరాలు, పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో కలిసి ప్రముఖ నటుడు జగపతిబాబును అకాడమీ జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అలాగే ఐఎఫ్ఎఫ్‌సీవో ఎండీ, సీఈవో ఉదయ్‌శంకర్‌కు కూడా జీవితకాల సాఫల్య పుస్కారాన్ని ప్రదానం చేశారు. వెంకయ్య మాట్లాడుతూ.. పండుగలు మన సంస్కృతిని భావితరాలకు అందించే వేదికలని, ఉగాది జీవితంలోని వివిధ రకాల అనుభవాలు, అనుభూతులకు ప్రతీక అన్నారు. విదేశీ సంస్కృతిలో పడి తెలుగు భాషను మర్చిపోతున్నారని, తల్లిదండ్రులు ఇంట్లోనైనా తమ పిల్లలతో తెలుగులో మాట్లాడాలని జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. ఉద్యోగ రత్న అవార్డులను ఉక్కుశాఖ కార్యదర్శి అరుణ శర్మ, మార్గదర్శి గ్రూప్ ఎండీ శైలజా కిరణ్ అందుకున్నారు. మరో 8 మందికి ప్రతిభ భారతి పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ మోహన్‌కందా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రవీణ్ ప్రకాశ్, సినీనటి రమ్యకృష్ణ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎం శ్రీలేఖ, విజయలక్ష్మీ, సాకేత్, రోహిత్, మనీషా ఇరబతినిల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది.

కాకినాడలో నంది నాటకోత్సవాలు ప్రారంభం



జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న అంబికా కృష్ణ

కాకినాడ కల్చరల్: తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో నంది నాటకోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం కల్పించి, నాటకరంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్థానిక కళాకారులకు అవకాశం కల్పించేందుకు నంది నాటకోత్సవాలను రాష్ట్రంలో 5 విభాగాలుగా నిర్వహిస్తున్నామన్నారు. నాటక ప్రదర్శనలు ఈనెల 28 వరకు నిర్వహిస్తామని చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ఎంవీఎల్ఎన్ శేషసాయి అన్నారు. నాటకోత్సవాల్లో 76 నాటకాలను ప్రదర్శిస్తున్నామన్నారు. ప్రదర్శించిన ప్రతి నాటకానికీ పారితోషకం అందజేస్తున్నట్టు తెలిపారు. తదుపరి శ్రీ మూర్తి కల్చరల్ అసోసియేషన్ (కాకినాడ) ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల పద్యనాటకం, శ్రీకళాధరి నటధామం (పాలకొల్లు) ఆధ్వర్యంలో కారే రాజులు–రాజ్యముల్.. పద్యనాటకం, శ్రీ షిర్డీసాయి నాట్యమండలి (తాళ్లరేవు) ఆధ్వర్యంలో భక్త కన్నప్ప పద్యనాటకం ప్రదర్శించారు.



బోడినాయకనూర్ అడవుల్లో మంటలు

కార్చిచ్చులో నలుగురు ట్రెక్కర్ల సజీవదహనం

తమిళనాడులోని బోడినాయకనూర్ అడవుల్లో మంటలు

15 మందిని రక్షించిన అధికారులు ● రంగంలోకి దిగిన ఐఏఎఫ్ హెలికాప్టర్లు

సాక్షి, చెన్నై / తేని: తమిళనాడులో ఘోరం జరిగింది. తేని జిల్లా బోడినాయకనూర్ అటవీప్రాంతంలో ఆదివారం అకస్మాత్తుగా కార్చిచ్చు చెలరేగడంతో ట్రెక్కింగ్‌కు వెళ్లి తిరిగివస్తున్న వారిలో నలుగురు సజీవ దహనమైనట్లు సమాచారం. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి కార్చిచ్చులో చిక్కుకున్న 15 మందిని రక్షించారు. తీవ్రమైన ఉష్ణోగ్రత ప్రభావంతో గత కొన్నిరోజులుగా ఈ ప్రాంతంలో మంటలు చెలరేగుతుండగా.. అటవీ అధికారులు అదుపుచేస్తూ వస్తున్నారు. ఈ విషయమై తేని జిల్లా కలెక్టర్ పల్లవి బల్దేవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈరోడ్‌కు చెందిన 13 మంది, కోయంబత్తూర్‌కు చెందిన 24 మంది ట్రెక్కర్ల బృందం బోడినాయకనూర్ ప్రాంతంలోని కొజుకుమలై ప్రాంతానికి శనివారం చేరుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చెన్నై ట్రెక్కింగ్ క్లబ్ నిర్వహించిందన్నారు. వీరిలో ముగ్గురు పిల్లలు, 8 మంది పురుషులతో పాటు 26 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. కొజుకుమలైలోని ఓ ఎస్టేట్‌లో రాత్రి బసచేసిన అనంతరం తిరుగుప్రయాణం అవుతుండగా అడవిలో కార్చిచ్చు చెలరేగిందని పేర్కొన్నారు. దీంతో బెదిరిపోయి దట్టమైన గడ్డి ఉన్న ఇరుకైన ప్రాంతానికి చేరుకోవడంతో మంటలంటుకుని నలుగురు ట్రెక్కర్లు దుర్మరణం చెందినట్లు స్థానిక అధికారులు మీడియాకు తెలిపారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని భావిస్తున్నామన్నారు. ఈ ట్రెక్కింగ్‌కు వెళ్లినవారిలో పలువురు విద్యార్థులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో ఒకరికి 80 శాతం కాలిన గాయాలయ్యాయన్నారు. మరోవైపు ప్రమాద విషయం తెలుసుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి.. సాయం చేయాల్సిందిగా రక్షణమంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరారు. దీంతో సీతారామన్ ఆదేశాలతో సులూర్ బేస్ నుంచి బయలుదేరిన రెండు ఐఏఎఫ్ హెలికాప్టర్లు అటవీ ప్రాంతంలో ట్రెక్కర్ల కోసం గాలింపు చేపట్టాయి. వీరిని రక్షించేందుకు సోమవారం ఆర్మీతో పాటు కేరళ, తమిళనాడు అటవీ అధికారులు రంగంలోకి దిగనున్నారు.



ఆదివారం ఆగ్రాలో తాజ్‌మహల్ సందర్శించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్, ఆయన భార్య బ్రిగెట్ మాక్రాన్

'ఖిల్జీని చూస్తే అజంఖాన్ గుర్తొచ్చాడు'



రాయ్‌పూర్: సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అజంఖాన్‌ను ఉద్దేశించి మాజీ ఎంపీ జయప్రద సంచలన వ్యాఖ్యలు చేశారు. పద్మావత్ సినిమాలో అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రను చూస్తే తనకు అజంఖానే గుర్తొచ్చాడని ఆమె వ్యాఖ్యానించారు. ''అజంఖాన్‌ను నేను సోదరునిగా భావించాను. కానీ అతను నాపై ప్రతీకారం తీర్చుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నించాడు' అని రాయ్‌పూర్‌లో వ్యాఖ్యానించారు.

ఏడాదంతా ఓటర్ల నమోదు సాధ్యమా?: కేంద్రం

న్యూఢిల్లీ: వయోజనులు ఏడాదిలో ఎప్పుడైనా ఓటరుగా నమోదుచేసుకునే అవకాశాల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని కేంద్రం కోరింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం..జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు మాత్రమే ఆ ఏడాది ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులు. జనవరి 1 గడువు దాటిన తరువాత వయోజనులైతే ఇక వారు తదుపరి ఏడాదే నమోదుచేసుకోవాలి. గతంలో ఓటరు నమోదుకు ఈసీ నాలుగు కటాఫ్ తేదీలుగా జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1ని ప్రతిపాదించగా, కేంద్రం జనవరి 1, జూలై 1లకు సమ్మతించింది. కానీ ఇప్పుడు 18 ఏళ్లు నిండిన వాళ్లు ఏడాదిలో ఎప్పుడైనా ఓటరుగా నమోదుచేసుకునేందుకున్న అవకాశాలను పరిశీలించాలని ఈసీకి సూచించింది.

ఓటు టోటలైజర్లతో పనిలేదు: సుప్రీంలో కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం ఓట్ల టోటలైజర్ యంత్రాలను ఉపయోగించాల్సిన అవసరం లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రస్తుతం దేశంలో అలాంటి యంత్రాలతో పనిలేదనీ, బూత్‌ల వారీగా ఫలితాలు వెల్లడిస్తేనే అభ్యర్థులకు ఏ ప్రాంతంలో ఓట్లు తక్కువ వచ్చాయి, ఎక్కడ ఎక్కువ వచ్చాయి అనే విషయాలు తెలుస్తాయంది. తద్వారా వారు ఓట్లు తక్కువ వచ్చిన ప్రాంతాలపై మరింత దృష్టి పెట్టి పనిచేసే అవకాశం ఉంటుందని న్యాయ శాఖ సుప్రీంకోర్టుకు తెలిపింది.

నవాజ్ షరీఫ్‌కు షూ దెబ్బ!



లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం జమియా నమీయా ఇస్లామిక్ విశ్వవిద్యాలయంలో ఓ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నవాజ్‌పై ఓ విద్యార్థి షూ విసిరాడు. ఆయన ప్రసంగించేందుకు మైక్ వద్దకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. షూ నేరుగా నవాజ్ భుజాలు, చెవులకు బలంగా తాకడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం నిందితుడితో పాటు అతని సహాయకుడ్ని భద్రతాధికారులు అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు.

సునయన శాంతి ర్యాలీ

హూస్టన్: అమెరికాలో జాత్యాహంకార దాడిలో హత్యకు గురైన తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కూచిభొట్ల శ్రీనివాస్ భార్య సునయన ఆయన సహోద్యోగులతో కలసి హూస్టన్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం కూచిభొట్ల 34వ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. కూచిభొట్ల పనిచేసిన కంపెనీ గార్మిన్ నుంచి హత్యకు గురైన బార్ వరకు సుమారు 3 కి.మీ మేర ఈ యాత్ర సాగింది.

యూపీ, బిహార్‌లో ముగిసిన ఉప ఎన్నికలు

లక్నో/పట్నా: ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఆదివారం జరిగిన ఉప ఎన్నికల్లో ఒక మోస్తరు నుంచి అత్యల్ప ఓటింగ్ నమోదయింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలో వరుసగా 43 శాతం, 37.39 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. కాగా, బిహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో 57 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, భభువా, జహానాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో 54.03, 50.06 శాతం పోలింగ్ నమోదైందని బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి అజయ్ వి.నాయక్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది.

సౌర విప్లవం సాధించాలి

అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో ప్రధాని మోదీ

- అందరికీ చవకైన సౌర విద్యుత్ అందేలా చూడాలని పిలుపు
- 2022 నాటికి 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్తే లక్ష్యం
- సోలార్ ప్రాజెక్టులకు రాయితీలపై రుణాలు సమకూర్చాలి: మోదీ
- మోదీ ఆలోచన నిజం చేశాం: ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్



అంతర్జాతీయ సౌర కూటమి సదస్సును ప్రారంభిస్తున్న మోదీ, మాక్రాన్

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అన్ని దేశాలకు చవకైన సౌరవిద్యుత్ సులువుగా అందేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో సోలార్ ఉత్పత్తి వాటాను పెంచాలని, అందుకోసం సోలార్ ప్రాజెక్టులకు రాయితీలపై రుణాలు సమకూర్చాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్ఏ) వ్యవస్థాపక సదస్సులో ఆదివారం మోదీ ప్రసంగిస్తూ.. 2022 నాటికి పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా భారత్ 175 గిగావాట్స్ విద్యుదుత్పత్తిని సాధించగలదని, ప్రస్తుత సామర్థ్యానికి అది రెండింతలని పేర్కొన్నారు. సోలార్ ఇంధనాన్ని పోత్సహించే లక్ష్యంతో 121 దేశాల్ని ఒకే వేదికపైకి తేవాలన్న మోదీ ఆలోచన నుంచి పుట్టిందే ఐఎస్ఏ(ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్). ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన తొలి సదస్సులో ఆరు దేశాల ఉపాధ్యక్షులు, ఉప ప్రధానులతో పాటు 19 దేశాల నుంచి మంత్రుల స్థాయి బృందాలు పాల్గొన్నాయి.

సోలార్ లక్ష్యాల్ని సాధించేందుకు 10 కార్యాచరణ సూత్రాల్ని ఈ సమావేశంలో ప్రధాని మోదీ ప్రతిపాదించారు. చవకైన సోలార్ ఇంధనాన్ని అందుబాటులోకి తేవడం, కూటమి సమర్థంగా పనిచేసేలా నిబంధనలు, ప్రామాణికాల రూపకల్పన తదితర అంశాల్ని ఆయన ప్రస్తావించారు. 'వివిధ అవసరాల్ని తీర్చేందుకు సోలార్ రంగంలో ఆవిష్కరణల్ని ప్రోత్సహించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లాభదాయకమైన సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సలహాలిచ్చే సౌలభ్యాన్ని కల్పించాలి. ఐఎస్ఏ శాశ్వత కార్యాలయాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు సమర్థంగా పనిచేసేలా తీర్చిదిద్దాలి' అని సూచించారు. పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 175 గిగావాట్స్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమాన్ని భారత్ ప్రారంభించిందని ప్రధాని వెల్లడించారు. సోలార్ నుంచి 100గిగావాట్లు, పవన శక్తి నుంచి 60 గిగావాట్లు విద్యుత్ అందుబాటులో వస్తుందని, 20 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించేలా ఇప్పటికే సోలార్ పవర్ యూనిట్లు నెలకొల్పామని ఆయన తెలిపారు.

నేడు వారణాసికి మోదీ, మాక్రాన్

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సోమవారం ప్రధాని మోదీతో కలిసి వారణాసిలో గంగానదిలో పడవ ప్రయాణం చేయనున్నారు.

ఐఎస్ఏలో చేరేందుకు అమెరికా, చైనా ఆసక్తి

అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్ఏ)లో చేరేందుకు అమెరికా, చైనా కూడా ఆసక్తి చూపుతున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఐఎస్ఏ వైపు మొగ్గ చూపుతున్న మొత్తం 121 దేశాల్లో అమెరికా, చైనా కూడా ఉన్నాయని విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి కె.నాగరాజ్ నాయుడు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన సమావేశంలో మిగతా దేశాలతోపాటు చైనా, అమెరికా ప్రతినిధులు కూడా పాల్గొన్నారని మరో కార్యదర్శి టి.ఎస్.తిరుమూర్తి చెప్పారు.

ఐక్యంగా సాగితేనే లక్ష్యం సాధ్యం: మాక్రాన్

ఈ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ.. 2030 నాటికి ఒక టెరావాట్ సౌర విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని సాధించాలంటే 1 ట్రిలియన్ డాలర్లు(సుమారు రూ.65 లక్షల కోట్లు) అవసరమవుతాయని తెలిపారు. ఇంత భారీ మొత్తంలో పెట్టుబడుల కోసం, అవరోధాల్ని అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్, సామాజిక సంస్థలు ముందుకు రావాల్సి ఉందన్నారు. ఇందులో తమ వంతుగా 1 బిలియన్ యూరోలు (దాదాపు రూ.8000 కోట్లు) వెచ్చించనున్నట్లు ఆయన ప్రకటించారు. పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగుతున్న అమెరికా తదితర దేశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. వారి గురించి పట్టించుకోకుండా ఐఎస్ఏ ఏర్పాటుపై దృష్టి పెట్టి విజయం సాధించారన్నారు. 'మోదీ రెండేళ్ల క్రితం పారిస్ వచ్చినప్పుడు ఐఎస్ఏ ఏర్పాటు ఆలోచనను చెప్పారు. ఆయన అప్పటి ఆలోచనను ఇప్పుడు మేమంతా కలిసి నిజం చేశాం' అని పేర్కొన్నారు.

కదంతొక్కిన రైతన్న

నేడు మహారాష్ట్ర అసెంబ్లీని ముట్టడించనున్న 35 వేల మంది



నాసిక్ నుంచి ముంబై చేరుకున్న రైతు ర్యాలీ

ముంబై: అన్నదాతలు ఆదివారం ముంబై నగరాన్ని ముంచెత్తారు. డిమాండ్ల సాధన కోసం దాదాపు 50 వేల మంది మహారాష్ట్ర రైతులు ముంబైలో అడుగుపెట్టారు. వారంతా సోమవారం అసెంబ్లీని ముట్టడించనున్నారు. రైతు సమస్యలు తీర్చాలంటూ మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది కర్షకులు పాదయాత్రగా వచ్చారు. ఎండలు మండిపోతున్నా, అరికాళ్లు బొబ్బలెక్కుతున్నా లెక్కచేయకుండా దీక్షతో ఆరు రోజులపాటు 180 కిలో మీటర్లు నడిచిన వారంతా ముంబైలోని కేజే సోమయ మైదానానికి చేరుకున్నారు. ఆ తర్వాత వారు అర్ధరాత్రి ఆజాద్ మైదానానికి బయల్దేరారు. మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ వీరికి ముంబై శివార్లలో స్వాగతం పలికారు. మంగళవారం నాసిక్‌లో యాత్ర ప్రారంభమైంది. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లుగా రైతు రుణాలను మాఫీ చేయడం, పెట్టుబడికి అయిన ఖర్చు కన్నా కనీసం 50 శాతం ఎక్కువగా కనీస మద్దతు ధర ఉండేలా చూడడం, ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడం, అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా పంట నష్టపోయిన వారిని ఆదుకోవడం, ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను వారి పేర్లన రిజిస్టర్ చేయడం తదితరాలు రైతుల డిమాండ్లలో ప్రధానమైనవి. రైతు సమస్యల పరిష్కారానికి ఆరుగురు సభ్యులతో ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామనీ, ఆ సంఘం రైతులతో చర్చలు జరుపుతుందని సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ చెప్పారు. కమ్యూనిస్టుల అనుబంధ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) రైతుల పోరాటానికి నేతృత్వం వహిస్తోంది. ఎవరికీ ఇబ్బంది లేకుండా, శాంతియుతంగా తాము నిరసన తెలుపుతామని ఏఐకేఎస్ తెలిపింది.

రాజ్యసభ బరిలో జీవీఎల్

18 మందితో బీజేపీ జాబితా విడుదల

- మహారాష్ట్ర నుంచి రాణే.. రాజస్తాన్ బరిలో కిరోడిలాల్ మీనా



న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు బీజేపీ 18 మందితో జాబితాను ఆదివారం విడుదల చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు యూపీ నుంచి బరిలో దిగుతారని పార్టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడిగా జీవీఎల్‌కు మంచి పేరుంది. భారత ప్రధాని అయ్యే సత్తా మోదీకి ఉందని 2011లోనే జీవీఎల్ తెలిపారు. ప్రస్తుతం ఈయన బీజేపీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. అటు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ రాణే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు అనిల్ జైన్, సరోజ్ పాండే, అధికార ప్రతినిధి అనిల్ బాలుని తదితరులకు అవకాశం కల్పించింది. మహారాష్ట్ర నుంచి రాణే.. జైన్, జీవీఎల్‌లు ఉత్తరప్రదేశ్ నుంచి, ఛత్తీస్‌గఢ్ నుంచి పాండే, ఉత్తరాఖండ్ నుంచి బాలుని బరిలో దిగుతారని పేర్కొంది. కిరోడి లాల్ మీనా, మదన్ లాల్‌లను రాజస్తాన్ నుంచి, కేరళ మాజీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధరన్‌ను మహారాష్ట్ర నుంచి బరిలో దించనుంది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో ఉన్న బలాల కారణంగా 18 మంది సభ్యుల విజయం ఖాయమే. మార్చి 23న ఎన్నికలు జరనుండగా.. నామినేషన్లకు సోమవారమే చివరితేది.

మిషన్ 2019 లక్ష్యంతో..

రాణేకు పట్టం గట్టడం ద్వారా మహారాష్ట్ర కొంకణ్ ప్రాంతంలో బలం పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. రాజస్తాన్‌లో మీనా వర్గానికి ప్రతినిధిగా ఉన్న కిరోడీలాల్‌కు టికెట్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతనుంచి గట్టెక్కాలని బీజేపీ భావిస్తోంది.

చంపేస్తారని ముందే తెలుసు

నానమ్మ, నాన్న హత్యలపై రాహుల్ గాంధీ



సింగపూర్: మాజీ ప్రధాన మంత్రి, తన తండ్రి రాజీవ్ గాంధీని హత్యచేసిన వారిని తన కుటుంబం పూర్తిగా క్షమించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రజలను ద్వేషించటం తమకు చాలా కష్టమైన పని అన్నారు. సింగపూర్‌లో ఐఐఎం పూర్వవిద్యార్థులతో సంభాషణలో రాహుల్.. పలు అంశాలపై కచ్చితమైన నిర్ణయాలు తీసుకున్నందునే ఇందిర, రాజీవ్‌లు హత్యకు గురయ్యారన్నారు. 'నాన్న, నానమ్మ చనిపోతారని మాకు ముందే తెలుసు. తనను చంపేస్తారని నానమ్మ నాతో చెప్పేది. నాన్నను కూడా చంపేస్తారంది. రాజకీయాల్లో దుష్టశక్తులతో పోరాటంలో.. ఒక నిర్ణయానికి కట్టుబడి ఉన్నప్పుడు చనిపోవటం ఖాయం. మేం (రాహుల్, ప్రియాంక) చాలారోజుల వరకు హంతకులపై ఆవేదనగా, కోపంగా ఉన్నాం. కానీ ఇప్పుడు వారిని మేం పూర్తిగా క్షమించేశాం' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ వీడియోను కాంగ్రెస్ పార్టీ ట్వీటర్‌లో పోస్టు చేసింది. 'చరిత్రలో భిన్న సిద్ధాంతాలు, భిన్న శక్తుల మధ్య పోరాటం జరిగినపుడు ఇలాంటి ఘటనలు సహజమే. మా నానమ్మను చంపిన వారితో నేను బ్యాడ్మింటన్ ఆడేవాణ్ణి. ఎల్‌టీటీఈ చీఫ్ ప్రభాకరన్ హతమైన విషయాన్ని టీవీలో చూస్తున్నపుడు.. ఆయన కుటుంబం, పిల్లలు ఎంత బాధపడి ఉంటారోనని అనిపించింది. ఎందుకంటే తండ్రిపోతే పిల్లలు ఎలా బాధపడతారో నాకు బాగా తెలుసు. వెంటనే ప్రియాంకకు ఫోన్ చేసి అతనే నాన్నను చంపాడని చెప్పా. దీనిపై నేను సంతోషపడాలి కానీ ఎందుకో సంతోషం అనిపించటం లేదన్నా. తను కూడా సంతోషంగా లేనని ప్రియాంక చెప్పింది' అని రాహుల్ పేర్కొన్నారు.

సర్వోన్నత నేత స్థాయికి..

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



చైనా రాజ్యాంగ సవరణ ఓటింగ్‌లో జిన్‌పింగ్

బీజింగ్: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇక జీవితకాలం ఆ పదవిలో కొనసాగేందుకు మార్గం అధికారికంగా సుగమమైంది. ఓ వ్యక్తి అధ్యక్షుడిగా రెండు కంటే ఎక్కువసార్లు పనిచేయకూడదంటూ ఉన్న పరిమితిని ఎత్తివేసే రాజ్యాంగ సవరణకు ఆ దేశ పార్లమెంటు ఆదివారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జిన్‌పింగ్ రెండోసారి అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఇకపై కూడా ఆయన ఎన్నాళ్లు కోరుకుంటే అన్నాళ్లు, కావాలంటే చనిపోయేంత వరకు కూడా అధ్యక్షుడిగా ఉండొచ్చు. ఇటీవలి దశాబ్దాల్లో చైనాలో అత్యంత శక్తిమంతమైన నాయకుడిగా జిన్‌పింగ్ ఎదిగారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) స్థాపక చైర్మన్ అయిన మావో జెడాంగ్ తర్వాత అధ్యక్ష పదవిలో జీవితకాలం కొనసాగనున్న నేతగా జిన్‌పింగ్ రికార్డు సృష్టించనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను ఎవరూ రెండు కన్నా ఎక్కువసార్లు చేపట్టకూడదంటూ ఉన్న నిబంధనను రద్దు చేయాలని ఇటీవల జరిగిన సీపీసీ మహాసభల్లో తీర్మానించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులపై ఉన్న పరిమితిని ఎత్తివేయాలన్న సీపీసీ నిర్ణయాన్ని పార్లమెంట్ ఆమోదించింది.

మావో జెడాంగ్ తర్వాత జిన్‌పింగ్‌కే ఆ చాన్స్

- అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులపై పరిమితి ఎత్తివేతకు పార్లమెంటు ఆమోదం

పొరుగుదేశాలకు ఆందోళనకరం..

జిన్‌పింగ్‌కు జీవితకాలం అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం కల్పించడం భారత్, జపాన్, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు ఆందోళన కలిగించే అంశం. 2013లో జిన్‌పింగ్ అధ్యక్షుడయ్యాక ఆయా దేశాలతో ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. భారత్‌తో డోక్లాం వివాదం తెలిసిందే. భారత్‌కు శత్రుదేశమైన పాకిస్తాన్‌కు చైనా బాగా దగ్గరవుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా చైనా–పాక్ ఆర్థిక కారిడార్‌ను కూడా నిర్మిస్తోంది. మాల్దీవులు, శ్రీలంకల్లోనూ తన ప్రాబల్యాన్ని బాగా పెంచుకుంది. రోడ్డు, రైల్వే ప్రాజెక్టులతో నేపాల్‌తో కూడా సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంది. దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం కోసం జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలతోనూ విభేదాలను చైనా పెంచుకుంది. ఇవన్నీ జిన్‌పింగ్ అధ్యక్షుడయ్యాక జరిగినవే. ఈ నేపథ్యంలో జీవితకాలం పదవిలో కొనసాగే అవకాశాన్ని ఆయనకు కల్పించడం పొరుగుదేశాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

అత్యంత ప్రాధాన్యం...

చైనాను ఆర్థికంగా, సైనికపరంగా 'సూపర్‌పవర్'గా మార్చాలనేదే జిన్‌పింగ్ లక్ష్యం. మరో 30 ఏళ్లలో చైనాను ప్రపంచ ఆర్థికశక్తిగా, ప్రపంచస్థాయి మిలటరీ శక్తిగా రూపుదిద్దే తన జీవితకాల లక్ష్యాన్ని సాధించేందుకు జిన్‌పింగ్‌కు తాజా నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నారు. పెద్ద ఎత్తున ఆర్థిక సంస్కరణలను చేపట్టడంతో పాటు పార్టీ కఠినమైన క్రమశిక్షణ పాటించేలా చేయడం, వివిధస్థాయిల్లో అవినీతిని అంతమొందించేందుకు తీసుకున్న ధృడచిత్త వైఖరి ఆయనకు ప్రజాదరణ తెచ్చిపెట్టింది. ఈ విషయంలో పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో ఉన్న వారిని కూడా ఉపేక్షించలేదనే పేరు గడించారు. ఇప్పటికే ఆయన చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రధానకార్యదర్శిగా, చైనా పీపుల్స్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా, సెంట్రల్ మిలటరీ కమిషన్ చైర్మన్‌గా దేశంలోని అన్ని వ్యవస్థలపై కీలకబాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నేపథ్యమిదీ...

విప్లవోద్యమ కాలంలో నిర్వహించిన పాత్రతో జిన్‌పింగ్ తండ్రి పార్టీలో కీలకబాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయనను తప్పించడంతో షీ కుటుంబం కష్టాలు ఎదుర్కొంది. పార్టీలో జిన్‌పింగ్ నిబద్ధతతో, అత్యంత క్రమశిక్షణతో పనిచేశారు. 1971లోనే కమ్యూనిస్ట్ యూత్‌లీగ్‌లో చేరారు. పార్టీలో చేరేందుకు పదిసార్లు చేసిన ప్రయత్నాలు విఫలమై 1974లో దానిని సాధించగలిగారు. 1999లో ఫుజియన్ ప్రావిన్స్ గవర్నర్ పదవిని చేపట్టారు. 2002లో ఝెజియాంగ్ ప్రావిన్స్, 2007లో షాంఘై పార్టీ చీఫ్ బాధ్యతలు చేపట్టారు. 2007లోనే పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో, సెంట్రల్ సెక్రటేరియట్‌లో చేరారు. హుజింటావో అధ్యక్షుడిగా ఉన్నపుడు 2008–13 మధ్యలో ఉపాధ్యక్షుడిగా, 2010–12 మధ్యకాలంలో సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. 2012లో తొలిసారిగా ప్రధానకార్యదర్శి పదవిని చేపట్టిన ఆయన 2017లో మళ్లీ ఆ పదవికి ఎన్నికయ్యారు.

అయోధ్యపై ఏకాభిప్రాయం కష్టమే!

మందిర నిర్మాణం జరిగితీరుతుంది: భయ్యాజీ జోషి



నాగ్‌పూర్: అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ఏకాభిప్రాయం కష్టమని.. అయినా రామమందిర నిర్మాణం జరిగి తీరుతుందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి పేర్కొన్నారు. ఏకాభిప్రాయం ద్వారానే మందిర నిర్మాణం జరగాలని ఆరెస్సెస్ మొదటినుంచీ ఆశించిందని.. కానీ ఇదేమంత సులభం కాదని ఆయన స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లో జరుగుతున్న ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'నిర్ణయించిన స్థలంలోనే రామమందిర నిర్మాణం జరిగితీరుతుంది. నిర్మాణానికి అనుకూలంగానే కోర్టు తీర్పు ఉంటుందని నమ్మకంగా ఉన్నాం. కోర్టు నిర్ణయం తర్వాతే మందిర నిర్మాణం మొదలవుతుంది' అని పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ ప్రయత్నాల్ని స్వాగతిస్తున్నామన్నారు. కర్ణాటకలో లింగాయత్‌లకు మైనారిటీ హోదా డిమాండ్‌తో విభేదిస్తున్నట్లు చెప్పారు.

టీఎస్ పాలిసెట్-2018

తెలంగాణలోని వివిధ ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్/ఇన్‌స్టిట్యూట్స్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి 'తెలంగాణ రాష్ట్ర పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ పాలిసెట్)-2018' ప్రకటన విడుదలైంది. పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. తుది పరీక్షలు రాయబోతున్న/కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ 2018, మార్చి 14 నుంచి ప్రారంభమవుతుంది. చివరి తేదీ ఏప్రిల్ 11, 2018. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21, 2018న ఉంటుంది. పూర్తి వివరాలకు https://polycetts.nic.in

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
బయాలజీ మోడల్ పేపర్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఎగ్జామ్ టిప్స్

జేఈఈ అడ్వాన్స్‌డ్-2018 నిర్వహణ సంస్థ: ఐఐటీ కాన్పూర్; వెబ్‌సైట్: www.jeeadv.ac.in





జేఈఈ అడ్వాన్స్‌డ్-2018

ప్రిపరేషన్ ప్రణాళిక

దేశంలో అత్యున్నత విద్యకు వేదికలుగా నిలుస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు)లో ప్రవేశాలకు వీలుకల్పించే పరీక్ష.. జేఈఈ అడ్వాన్స్‌డ్. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ మే 20న జరగనుంది. త్వరలో ఇంటర్ పరీక్షలు ముగియనున్నాయి. ఆ తర్వాత అందుబాటులో ఉండే కొద్ది సమయాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోవడం ద్వారా 'ఐఐటీ కల'ను నిజం చేసుకోవచ్చు.

అర్హతలు

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరుకావాలంటే.. జేఈఈ మెయిన్‌లో మెరిట్ జాబితాలో నిలవాలి. జేఈఈ మెయిన్ నుంచి 2,24,000 మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత లభిస్తుంది. కేటగిరీల వారీగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సులో 75 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విద్యార్థులు కనీసం 65 శాతం మార్కులు సాధించాలి. (లేదా) టాప్-20 పర్సంటైల్‌లో నిలవాలి.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ రెండు పేపర్లుగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో మే 20న జరుగుతుంది. ఒక్కో పేపర్‌కు మూడు గంటలు అందుబాటులో ఉంటుంది.
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ ఆధారంగా జాబితా రూపొందించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియను జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) చేపడుతుంది.

సన్నద్ధత

పటిష్ట ప్రణాళికతో ముందడుగు వేస్తేనే ప్రతిభావంతుల పరీక్షగా పేర్కొంటున్న జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయం సొంతమవుతుంది. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా ఐఐటీ సీటు సాధించడం కష్టం. కాబట్టి విద్యార్థులు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలి. ప్రతి సబ్జెక్టులోనూ బేసిక్ కాన్సెప్టులు, వాటి అప్లికేషన్స్‌పై పట్టు సాధించాలి.

మ్యాథమెటిక్స్

విద్యార్థులు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడిగా ఉన్న అంశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. ముఖ్యమైన చాప్టర్లకు ప్రిపరేషన్‌లో ప్రాధాన్యమివ్వాలి. కాంప్లెక్స్ నంబర్స్, పర్ముటేషన్స్, ప్రాబబిలిటీ, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ చాప్టర్లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు ఉమ్మడి ముఖ్య చాప్టర్లు

- మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్
- లిమిట్స్ అండ్ డిఫరెన్షియబిలిటీ
- వెక్టార్ ఆల్జీబ్రా
- 3 డీ జామెట్రీ
- స్ట్రెయిట్ లైన్స్
- బైనామియల్ థీరమ్



వీటితోపాటు మెయిన్‌కు ఫంక్షన్స్, మ్యాథమెటికల్ రీజనింగ్, సీక్వెన్స్ అండ్ సిరీస్, స్టాటిస్టిక్స్ తదితర చాప్టర్లపై దృష్టిసారించడం అవసరం.

- ఆన్‌లైన్ మాక్‌టెస్ట్‌లు రాసి వేగం, కచ్చితత్వం పెంచుకోవాలి. అడ్వాన్స్‌డ్ కోసం ప్రత్యేకంగా మిక్స్‌డ్ కాన్సెప్ట్, ఇంటీజర్ టైప్ పేరాగ్రాఫ్స్, మల్టీ ఆన్సర్ క్వశ్చన్స్‌పై దృష్టిసారించాలి. క్రమం తప్పకుండా ప్రతి రెండు రోజులకు ఒకసారి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ టెస్టులు రాసి, వాటిని సమీక్షించుకోవాలి. తప్పులను సరిదిద్దుకోవాలి.
- **ముఖ్యమైన చాప్టర్లు (అడ్వాన్స్‌డ్):** ప్రాబబిలిటీ, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ఏరియాస్, కాంప్లెక్స్ నంబర్స్, డిఫరెన్షియబిలిటీ, వెక్టార్ ఆల్జీబ్రా, 3డీ జామెట్రీ, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఇంటిగ్రల్ క్యాలిక్యులస్, స్ట్రెయిట్ లైన్స్ చాప్టర్లు అడ్వాన్స్‌డ్ కోణంలో ముఖ్యమైనవి. ఏరియాస్, ఇంటిగ్రల్ క్యాలిక్యులస్ చాప్టర్లు కఠినంగా అనిపిస్తాయి కాబట్టి వాటికి అధిక సమయం కేటాయించాలి.
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు గత పేపర్లను పరిశీలించడం ముఖ్యం. 2011లోనూ ఐఐటీ ప్రవేశ పరీక్షలను ఐఐటీ కాన్పూరే చేపట్టింది కాబట్టి ఆ ఏడాది పరీక్ష పేపర్లను పరిశీలించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. 2011లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల కంటే మ్యాథమెటిక్స్ పేపర్ సులువుగా ఉంది. ఒక మోస్తరు క్లిష్టత ఉన్న ప్రశ్నలు వచ్చాయి.

ఫిజిక్స్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్‌లో వచ్చే ప్రశ్నలు క్లిష్టంగా ఉంటాయి. ప్రాథమిక భావనల (బేసిక్ కాన్సెప్ట్స్)పై పట్టుసాధిస్తే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో విజయం తేలికవుతుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రశ్నలు వివిధ భావనల మిళితంగా ఉంటాయి. ఉదాహరణకు ఒక ప్రశ్నకు సమాధానం గుర్తించే సమయంలో మ్యూచువల్ ఇండక్టెన్స్ డెఫినిషన్ తెలిసినా.. మ్యాగ్నటిక్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెషన్, యాక్సిస్ ఆఫ్ సర్క్యులర్ కాయిల్ కాన్సెప్టులు తెలియకుంటే సమస్యను పరిష్కరించలేం. కాబట్టి విద్యార్థులు ఇంటర్ సిలబస్‌లోని డెఫినిషన్స్, డెరివేషన్స్ అప్లికేషన్లను తప్పనిసరిగా తెలుసుకోవాలి.

కెమిస్ట్రీ

ఇతర విభాగాలతో పోల్చితే కెమిస్ట్రీలో అధిక మార్కులను సొంతం చేసుకోవచ్చు. కెమిస్ట్రీ సిలబస్‌ను ప్రధానంగా మూడు విభాగాలుగా విభజించొచ్చు. అవి.. ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ. సిలబస్ పరంగా జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు పెద్దగా వ్యత్యాసం లేనప్పటికీ.. ప్రశ్నలు అడిగే తీరు మాత్రం చాలా భిన్నంగా ఉంటోంది. వెయిటేజీ పరంగా ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీలకు సమ ప్రాధాన్యం ఉంటుంది. ఆర్గానిక్ కెమిస్ట్రీలో నేమ్డ్ రియాక్షన్స్‌పై అధిక శ్రద్ధ పెట్టాలి. కార్బోహైడ్రేట్స్ నుంచి క్రమం తప్పకుండా ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి ఈ పాఠ్యాంశాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో సమస్యలకు అనుగుణంగా సూత్రాలను మార్చుకోగలగాలి. న్యూక్లియర్ కెమిస్ట్రీ పాఠ్యాంశం కూడా కీలకమే. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే న్యూక్లియర్ కెమిస్ట్రీ నుంచి క్లిష్టమైన ప్రశ్నలు వస్తున్నట్లు అర్థమవుతుంది. న్యూక్లియర్ కెమిస్ట్రీ, గ్యాసెస్ స్టేట్, థర్మోడైనమిక్స్, అటామిక్ స్ట్రక్చర్ పాఠ్యాంశాలకు సంబంధించి పొందే పరిజ్ఞానం ఫిజిక్స్ ప్రిపరేషన్‌లోనూ ఉపయోగపడుతుంది. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో రసాయనిక చర్యలను బట్టీ పట్టకుండా.. రిడాక్స్ రియాక్షన్స్‌పై అవగాహనతో రియాక్షన్స్, ప్రొడక్ట్స్‌ను సమతుల్యం చేయడం నేర్చుకోవాలి. మెటలర్జీ పాఠ్యాంశంపై అధిక శ్రద్ధ పెట్టాలి. పీరియాడిక్ టేబుల్ చాప్టర్‌ను ఔపోసన పడితే మిగిలిన పాఠ్యాంశాలు తేలిగ్గా అర్థమవుతాయి.

సమయపాలన



విద్యార్థులు ప్రణాళికతో కూడిన అధ్యయనాన్ని కొనసాగిస్తూ.. మానసికంగా దృఢంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రోజూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. క్లిష్టత ఎక్కువగా ఉండే చాప్టర్లకు వీలైనంత ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రిపరేషన్ పరంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి. పోటీ పరీక్షల విజయంలో 'ఆరోగ్యం' కూడా కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి ఆ దిశగా జాగ్రత్తగా ఉండాలి.



ఇన్‌పుట్స్
మ్యాథమెటిక్స్: ఎం.ఎన్.రావు. ఫిజిక్స్: డా॥ సీహెచ్.రామకృష్ణ.
కెమిస్ట్రీ: విజయ్ కిశోర్.

కెరీర్ గైడెన్స్..



గ్లోబలైజేషన్, ప్రజల అభిరుచుల్లో మార్పుల ఫలితంగా దేశీయ రిటైల్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు మహా నగరాలకే పరిమితమైన షాపింగ్ మాల్స్, హైపర్, సూపర్ మార్కెట్లు.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు సైతం విస్తరించడం ఇందులో భాగమే. ఎంటర్‌టైన్‌మెంట్, రిక్రియేషన్, షాపింగ్, ఫుడ్... అవసరం ఏదైనా.. ఇప్పుడందరి దారులూ మాల్స్ వైపే. ఫలితంగా రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తూ.. అవకాశాలకు వేదికగా నిలుస్తోంది. చక్కటి మాటతీరు, సరైన నడవడిక, కనీస విద్యార్హతలతో రిటైల్ రంగంలోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. కానీ, యువతలో ఎక్కువ మందికి ఈ రంగం కెరీర్‌పై సరైన అవగాహన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో రిటైల్ రంగం అవకాశాలపై ప్రత్యేక కథనం...

అవకాశాల తరంగం.. రిటైల్ రంగం

బ్రాండ్‌లన్నీ ఒకే చోట.. నచ్చింది ఎంచుకొనే సౌలభ్యం.. పైగా ధరలో డిస్కౌంట్.. సూపర్ మార్కెట్ల సూపర్ సక్సెస్ సూత్రం ఇదే. అందుకే ఏది కొనాలన్నా అందరి చూపూ అటు వైపే. దీంతో దేశంలో షాపింగ్ మాల్స్ హవా కొనసాగుతోంది. కొన్ని మాల్స్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, సినిమా, గేమ్స్, రెస్టారెంట్లు, వినోదం వంటివి ఒకే చోట ఉంటుండగా.. మరికొన్ని చోట్ల ప్రత్యేక స్టోర్లుగా కనిపిస్తున్నాయి. మొత్తంగా రిటైల్ రంగం వృద్ధిలో విజృంభిస్తూ.. ఇతర రంగాలతో పోల్చితే అవకాశాల కల్పనలో తానేమీ తక్కువ కాదని నిరూపిస్తోంది.

ఎఫ్‌డీఐలతో ఉపాధికి ఊపిరి!

రిటైల్ వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు సరళీకృత విధానాల అమలు నేపథ్యంలో రిటైల్ రంగంలో పెట్టుబడులు పెరిగి.. స్థానికంగా ఉద్యోగకల్పన మెరుగవుతోంది. కొన్ని అంతర్జాతీయ రిటైల్ దిగ్గజ సంస్థలు త్వరలోనే భారత్‌లోకి ప్రవేశించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే.. మరిన్ని ఉపాధి అవకాశాలు యువతను వెతుక్కుంటూ రావడం ఖాయమంటున్నారు నిపుణులు.

అవకాశాల ఆన్‌లైన్

ఆన్‌లైన్ షాపింగ్ తీసుకొచ్చిన విప్లవంతో రిటైల్ బిజినెస్ స్వరూపమే మారిపోయింది. ప్రస్తుతం ప్రతిదీ ఆన్‌లైన్లో కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ కొనుగోళ్లు, డెలివరీ కార్యకలాపాల్లో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం రిటైల్ ఇండస్ట్రీలో ఆన్‌లైన్ బిజినెస్‌దే అగ్రస్థానం. ఆర్ఎన్‌సీఓఎస్ సర్వే ప్రకారం ఈ-కామర్స్ బిజినెస్ పరిధి మరింత పెరగనుంది. వచ్చే ఏడాదికి ఈ-కామర్స్ విలువ నాలుగు రెట్లు పెరుగుతుందని అంచనా.

- టెక్నాలజీ సహాయంతో వినియోగదారుల విశ్వాసం పొందేందుకు ఈ-కామర్స్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక టెక్నాలజీలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నూతన టెక్నాలజీలు ఈ ఏడాదిలోనే రిటైల్ ఇండస్ట్రీని శాసించే స్థాయికి చేరతాయని పరిశ్రమల వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీల ఆధారంగా 'క్లిక్ అండ్ కలెక్ట్'; షిప్పింగ్ అండ్ డెలివరీ ప్రక్రియలను త్వరగా పూర్తి చేసేలా కంపెనీలు చర్యలు చేపడుతున్నాయి. వివిధ వ్యూహాలను అమలుచేస్తున్నాయి. ఈ క్రమంలో యువతకు ఆధునిక కొలువులు దగ్గరవుతున్నాయి.

అపార అవకాశాలు

రిటైల్ మార్కెటింగ్ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉజ్వల అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వీరికి రిటైల్‌తోపాటు ఇతర రంగాల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయి. స్టోర్ ఆపరేషన్స్; హ్యూమన్ రిసోర్సెస్/ట్రైనింగ్; ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్; కస్టమర్ కాంటాక్ట్ సెంటర్స్; మార్కెటింగ్; లాజిస్టిక్స్ తదితర విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. హైపర్, సూపర్ మార్కెట్లతోపాటు అగ్రికల్చర్, టెలికం, బ్యాంకింగ్, బెవరేజెస్, రెస్టారెంట్స్, ఆటో మొబైల్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫుట్‌వేర్ పరిశ్రమల్లో అవకాశాలు లభిస్తాయి.

జాబ్ ప్రొఫైల్స్

- స్టోర్ మేనేజర్
- డిపార్ట్‌మెంట్ మేనేజర్
- ఫ్లోర్ మేనేజర్
- హెచ్‌ఆర్ మేనేజర్
- రిటైల్ స్టోర్ సూపర్‌వైజర్
- రిటైల్ ఎగ్జిక్యూటివ్
- సేల్స్ మేనేజర్
- బ్రాండ్ మేనేజర్
- ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్

టాప్ రిక్రూటర్స్

సూపర్ మార్కెట్స్, అపెరల్స్ అండ్ ఫుట్‌వేర్, హోమ్ ఫర్నీచర్, లైఫ్‌స్టైల్ అండ్ పర్సనల్ ప్రొడక్ట్స్, హెల్త్ అండ్ వెల్‌నెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ సెక్టార్లలోని కంపెనీలు రిటైల్ రంగంలో ఎక్కువగా అవకాశాలు అందిస్తున్నాయి. వీటిలో ఫ్యూచర్ గ్రూప్, ఆదిత్యా బిర్లా రిటైల్ లిమిటెడ్, ఆదిత్యా బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (పాంటలూన్స్), షాపర్స్ స్టాప్, రిలయెన్స్ రిటైల్ లిమిటెడ్, లైఫ్ స్టైల్, టైటాన్, వాల్‌మార్ట్, బాటా, డోమినోస్, రేమాండ్ తదితర సంస్థలు ముఖ్యమైనవి.

వేతనాలు

రిటైల్ రంగంలో ప్రారంభ వేతనాలు రూ.12,000 నుంచి మొదలవుతాయి. రెండు, మూడేళ్ల అనుభవంతో నెలకు రూ.30,000 పైగా సంపాదించొచ్చు. పేరున్న సంస్థల్లోనైతే మరింత మెరుగైన వేతనాలు అందుకోవచ్చు. రిటైల్ ఇండస్ట్రీ అనుభవంతో విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఏఆర్‌లో 19 ఖాళీలు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ప్రధాన కార్యాలయం, అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌ల్లో 19 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** డైరెక్టర్-9; అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ)-2; ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ)-1; జాయింట్ డైరెక్టర్ (జేడీ)-7.
- **వేతనం:** న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) డైరెక్టర్ పోస్టుకు రూ.75,000+రూ.5,000 (స్పెషల్ అలవెన్స్); మిగిలిన డైరెక్టర్ పోస్టులతోపాటు ఏడీజీ, పీడీ, జేడీ పోస్టులకు రూ.43,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీతోపాటు నిబంధనల మేర అనుభవం, జర్నల్స్ ప్రచురణ తదితర అర్హతలుండాలి.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 60 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 4, 2018.
- **వెబ్‌సైట్:** www.asrb.org.in, www.icar.org.in

సీడాక్ హైదరాబాద్‌లో 13 ఖాళీలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్).. 13 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో)-1, ప్రాజెక్ట్ ఇంజనీర్ (పీఈ)-10 (మల్టీమీడియా-2+ఐఎస్ఈఏ-2+ఇ-చరక్-4+ఈఎల్‌టీ-2), ప్రాజెక్ట్ అసోసియేట్స్(పీఏ)-2 (ఇ-చరక్).
- **వేతనం:** పీవో, పీఈ-రూ.31,000; పీఏ-రూ.20,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/ఎంసీఏ/డీవోఈఏసీసీ 'బి'లెవెల్/ఎంఎస్సీ/ఎంబీఏ (మార్కెటింగ్)/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, అనుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి పీవో, పీఈకి 37 ఏళ్లు, పీఏకి 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 19, 2018.
- **వెబ్‌సైట్:** www.cdac.in

ఐఐఎస్సీలో సమ్మర్ ఫెలోషిప్స్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)... ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 2018కి గానూ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో సమ్మర్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది.

- **ఫెలోషిప్:** ఐఐఎస్సీ సమ్మర్ ఫెలోషిప్ ఇన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-2018.
- **ఫెలోషిప్ స్టైపెండ్:** రూ.5,000, బుక్ గ్రాంట్ రూ.1,500.
- **అర్హతలు:** బయలాజికల్/ఫిజికల్/కెమికల్/మ్యాథమెటికల్ సైన్సెస్‌లో ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం/ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 25, 2018.
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in

ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్

తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం).. 2018-19కి గాను ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు:** ఎంటెక్
- **వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హతలు:** బ్యాచిలర్ డిగ్రీ (ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్) మాస్టర్స్ డిగ్రీ (కెమిస్ట్రీ/లైఫ్ సైన్సెస్/మ్యాథమెటిక్స్/ఫిజిక్స్)/తత్సమాన విద్యతోతోపాటు సంబంధిత విభాగాల్లో గేట్ (2016/2017/2018). (లేదా) ఏదైనా ఐఐటీ నుంచి 8 (ఎస్సీ/ఎస్టీ-7.5)తో బీటెక్. అలాగే గేట్ ఉత్తీర్ణత. (లేదా) స్పాన్సర్డ్ క్యాండిడేట్స్ (నిబంధనల మేర).
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ/మహిళ-రూ.200; మిగిలిన అభ్యర్థులకు రూ.400. స్పాన్సర్డ్ కేటగిరీలో ఎస్సీ/ఎస్టీ/మహిళ-రూ.250, మిగిలిన అభ్యర్థులకు రూ.500.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** ఏప్రిల్ 15, 2018.
- **వెబ్‌సైట్:** www.iitm.ac.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 12-3-2018

స్టాక్ మార్కెట్లు
శుక్రవారం ముగింపు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
44 ▼	16 ▼
33,307	10,227

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,561	▲	133
డోజోన్స్	25,336	▲	441
ఎఫ్‌టీఎస్ఈ 100	7,225	▲	21
డాక్స్	12,347	▼	9
షాంఘై	3,308	▲	19
నికాయ్	21,469	▲	101

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.85	65.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.20	91.38
€	యూరో	ఎస్‌బీఐ	81.32	81.49
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.01	62.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.53	51.63
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.08	50.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.75	18.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.12	18.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.78

నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో (ఎన్‌పీఎస్) పెట్టుబడుల తీరుతెన్నులను మార్చాలని పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) యోచిస్తోంది. ఇందులో భాగంగా... ప్రస్తుతం 50 శాతానికే పరిమితమైన ఈక్విటీలకు కేటాయించే మొత్తాన్ని ఇకపై 75 శాతం దాకా పెంచేలా ప్రతిపాదిస్తోంది. దీనిపై అభిప్రాయాలు సేకరిస్తోంది. ఎందుకిలా? ఒకవేళ ఇలా చేస్తే చందాదారులకు కలిగే లాభనష్టాలేంటి? ఒకసారి చూద్దాం...

- సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం


ఎన్‌పీఎస్‌లో.. పెడుతున్నారా..?

ఈక్విటీ కేటాయింపుల పరిమితి పెంచే అవకాశం

- ప్రస్తుతమున్న 50 శాతాన్ని 75 శాతానికి పెంచే ప్రతిపాదన
- అయితే ఆ పరిమితి వర్తించేది 50 ఏళ్లలోపు వరకే
- దీన్ని అమలు చేస్తే లబ్ధిదారులకు లాభమే
- ఆ ప్రతికూలతలు లేకుంటే ఎన్‌పీఎస్ మరింత ఆకర్షణీయం

ప్రస్తుతం ఎన్‌పీఎస్‌లో నాలుగు రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశముంది. అవి..

1. ప్రభుత్వ సెక్యూరిటీస్ ఫండ్ లేదా స్కీమ్ జీ
2. కార్పొరేట్ బాండ్స్ ఫండ్ లేదా స్కీమ్ సి
3. ఈక్విటీస్ ఫండ్ లేదా స్కీమ్ ఈ
4. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ లేదా స్కీమ్ ఎ.



వీటిల్లో ఇన్వెస్ట్ చేయడానికి ప్రధానంగా రెండు మార్గాలున్నాయి.

మొదటిది... లైఫ్ సైకిల్ ఆధారిత విధానం. ఇందులో మీ వయసు ఆధారంగా పెట్టుబడులు పెట్టేలా ముందే నిర్ణయించిన లైఫ్ సైకిల్ ఫండ్ ప్లాన్ ఉంటుంది. దీని ప్రకారం 35 ఏళ్లు వచ్చే దాకా ఈక్విటీలకు గరిష్టంగా 50% కేటాయించవచ్చు. 55 ఏళ్లు వచ్చేసరికి ఇది 10 శాతానికి తగ్గిపోతుంది. అయితే 2016లో కొత్తగా మరో రెండు లైఫ్ సైకిల్ ఫండ్స్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో ఒక దాని తీరు దూకుడుగా ఉండేది కాగా.. ఇంకొకటి కాస్త సంప్రదాయబద్ధంగా ఉండేది. దూకుడుగా ఉండే అగ్రెసివ్ లైఫ్ సైకిల్ ఫండ్ విధానంలో 35 ఏళ్లు వచ్చే దాకా గరిష్టంగా 75% మేర ఈక్విటీలకు కేటాయించవచ్చు. అదే సాంప్రదాయ బద్ధంగా ఉండే కన్జర్వేటివ్ ఆప్షన్‌లో ఇది 25 శాతమే. 55 ఏళ్లు వచ్చేసరికి ఈక్విటీలకు కేటాయింపులు అగ్రెసివ్ ఫండ్ విధానంలోనైతే 15 శాతానికి, కన్జర్వేటివ్ విధానంలోనైతే 5 శాతానికి తగ్గిపోతాయి. ఈ లైఫ్ సైకిల్ ఫండ్స్ విధానంలో ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ జోలికి వెళ్లవు.

ఇక, రెండవది యాక్టివ్ విధానం. ఇందులో ఏ దశలో కూడా ఈక్విటీలకు కేటాయింపులు 50 శాతానికి మించవు. అయితే, అంతర్గత పరిమితులకు లోబడి ఇన్వెస్టర్లు.. నాలుగింట్లో ఏ స్కీములోనైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. నిర్దిష్ట పరిమితి దాకా కేటాయింపులు చేయొచ్చు. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో మాత్రం పరిమితి 5 శాతమే. ఈ యాక్టివ్ విధానంలోనే ఈక్విటీల్లో ఇప్పటిదాకా 50 శాతంగా ఉన్న పెట్టుబడుల పరిమితిని 75% దాకా పెంచాలని పీఎఫ్ఆర్‌డీఏ యోచిస్తోంది. అయితే, దీన్లోనూ ఓ మెలిక ఉంది. అది... 50 ఏళ్లు వచ్చే దాకా మాత్రమే ఈక్విటీలకు 75%దాకా కేటాయించవచ్చు. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గించుకోవాలి. రిటైర్మెంట్ నాటికి దీన్ని 50 శాతానికి తగ్గించుకోవాలి. ఇలా కేటాయింపులు తగ్గించుకుంటూ రాగా మిగిలిన మొత్తాన్ని ఇతర ఫండ్స్‌కి మళ్లించవచ్చు.

ఎన్‌పీఎస్ ప్రయోజనాలు..

ఎన్‌పీఎస్‌లో ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీలు అత్యంత తక్కువగా 0.01%మేర ఉంటున్నాయి. ఇది కొంత మేర పెరిగినా రాబడులు అధికంగా ఇచ్చే అవకాశాలున్నందున అంతిమంగా ఇన్వెస్టర్లకు లాభమేనన్నది పరిశ్రమ వర్గాల మాట. పన్నుపరమైన ప్రయోజనాలు కల్పించడం ఎన్‌పీఎస్‌లో రెండో ఆకర్షణీయ అంశం. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీసీడీ (1బి) కింద అదనంగా రూ.50,000 మినహాయింపు పొందవచ్చు. సెక్షన్ 80సి కింద లభిస్తున్న రూ.1.5 లక్షల డిడక్షన్‌కి ఇది అదనం.

ప్రతికూలాంశాలూ ఉన్నాయ్...

మెచ్యూరిటీ తరవాత వచ్చే మొత్తంలో కనీసం 40 శాతాన్ని కచ్చితంగా యాన్యుటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాలన్న నిబంధన ఇబ్బందికరమే. సాధారణంగా యాన్యుటీ పథకాలపై వచ్చే రాబడులు తక్కువగా ఉంటాయి. కాబట్టి ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నామంటే.. భవిష్యత్‌లో మళ్లీ కావాలనుకుంటే ఎకాయెకిన వెనక్కి తీసుకోలేకుండా కొంత మొత్తాన్ని యాన్యుటీ పథకాల్లో లాక్ చేసేస్తున్నట్లే లెక్క. అలా కాకుండా రిటైర్మెంట్ అవసరాలకు తగిన ఆదాయాన్ని అందించేలా డెట్, ఈక్విటీ మేళవింపుతో.. సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) గల మ్యూచువల్ ఫండ్స్ ఉపయోగకరంగా ఉంటాయన్నది వారి సూచన. మరోవైపు, 50 ఏళ్ల నుంచి ఈక్విటీలకు కేటాయింపులు తగ్గించుకుంటూ రావాలన్న నిబంధనను వ్యతిరేకించే వారూ ఉన్నారు. యాభై ఏళ్లు పైబడినా దూకుడుగా ఇన్వెస్ట్‌మెంట్ చేయగలిగే సామర్థ్యం ఉండే ఇన్వెస్టర్లు కూడా ఉంటారు కాబట్టి.. ఆ ఆప్షన్ వారికే వదిలేయడం మంచిదని సదరు ఫైనాన్షియల్ ప్లానర్స్ అభిప్రాయం. ఏదైతేనేం.. ఈక్విటీలకు కేటాయింపులు పెంచే వీలు కల్పించే ప్రతిపాదన మంచిదే అయినప్పటికీ పరిమితమైన లిక్విడిటీ స్వభావం ఉన్నందున రిటైర్మెంట్ అవసరాల కోసం ఒక్క ఎన్‌పీఎస్ మీదే ఆధారపడటం సరికాదన్నది నిపుణుల మాట. రిటైర్మెంట్ కోసం ఇతరత్రా సాధనాలకు కూడా పెట్టుబడులు కేటాయించడం మంచిదని వారి అభిప్రాయం.

విశ్రాంత జీవనానికి.. ఈ ఫండ్లు బెటర్..!



రిటైరయ్యాక అవసరమైన నిధి • ప్రస్తుతానికి గణనీయంగా పన్ను ఆదా

ఈ ఏడాది ఆదాయపు పన్ను గడువు ముగియటానికి ఇంకా 20 రోజులే మిగిలి ఉంది. అంటే మార్చి 31 రావటానికి నిండా మూడు వారాలు కూడా లేదు. పన్ను భారం ఎక్కువవుతోందనుకునే వారు చివర్లో మినహాయింపుల కోసం కొన్ని పెట్టుబడులు పెట్టడం మామూలే. ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ఎందరు ఎన్ని రకాలుగా చెప్పినా... వారు చివరి క్షణాల్లోనే ఏదో ఒక పథకంలో ఇన్వెస్ట్ చేస్తుంటారు. సరే!! ఎవరు ఎక్కడ ఇన్వెస్ట్ చేసినా... అది సెక్షన్ 80సీ పరిధిలోకి వచ్చేదైతేనే పన్ను మినహాయింపు లభిస్తుందనేది మనకు తెలియంది కాదు. బ్యాంకులు జారీ చేసే ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు పీపీఎఫ్ డెట్ విభాగంలోనివి. ఈక్విటీ వైపు చూస్తే ముందు కనిపించేది ఈఎల్ఎస్ఎస్‌లే. మ్యూచువల్ ఫండ్స్ అందించే రిటైర్మెంట్ సేవింగ్ ఫండ్స్‌లో పెట్టుబడులు సైతం సెక్షన్ 80సీ కింద ప్రయోజనానికి అర్హత కలిగినవే. పన్ను ఆదాతో పాటు రిటైర్మెంట్ అవసరాల కోసం నిధి సమకూర్చుకునేందుకు ఇవి ఉపకరిస్తాయి. విశ్రాంత జీవనంలో ఇబ్బందులు పడకూడదని భావించే వారు ఏ వయసు వారైనా... ఈ పథకాల వైపు చూస్తే మంచిది.

రిస్క్ ఆధారంగా అందుబాటులో ఎన్నో ఫండ్స్

మూడు నుంచి ఐదేళ్ల లాకిన్ పీరియడ్

అవసరమైతే ఆ తర్వాత వైదొలిగే అవకాశం

కాస్తంత భారంతో ముందే వైదొలగొచ్చు కూడా

రిటైర్మెంట్ ఫండ్స్.. ఒక్కొక్కరికి ఒకటి

ఈ ఫండ్స్ సాధారణంగా రిటైర్మెంట్ ప్రణాళిక కోసం ఉద్దేశించినవి. వీటిలో వార్షికంగా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెడితే అవి సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులోకి వస్తాయి. అంతకు మించి పెట్టుబడి పెట్టినా మినహాయింపు లభించేది రూ.1.5 లక్షలకే అని గుర్తుంచుకోవాలి. హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ హైబ్రిడ్ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ హైబ్రిడ్ డెట్, రిలయన్స్ రిటైర్మెంట్ ఫండ్ వెల్త్ క్రియేషన్, రిలయన్స్ రిటైర్మెంట్ ఫండ్ ఇన్‌కమ్ జనరేషన్, ఫ్రాంక్లిన్ ఇండియా పెన్షన్, యూటీఐ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ప్లాన్ ఇవన్నీ రిటైర్మెంట్ అవసరాల కోసం ఇన్వెస్ట్ చేసుకునేందుకు, పన్ను మినహాయింపునకు అర్హత కలిగిన పథకాలే. ఇన్వెస్టర్ల వయసు, రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా పథకాలను ఎంచుకోవాలి.

యువ ఇన్వెస్టర్లయితే..

హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్ ఈక్విటీ, రిలయన్స్ రిటైర్మెంట్ ఫండ్ వెల్త్ క్రిచేషన్ పథకాలు కాస్తంత దూకుడుగా పెట్టుబడులు పెడుతుంటాయి. అంటే అధిక రిస్క్ తీసుకుని ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులను ఇచ్చే తరహాలో పనిచేస్తాయి. సేకరించిన నిధుల్లో 85 శాతానికి పైగా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. రిటైర్మెంట్‌కు సుదీర్ఘ సమయం కలిగిన యువ ఇన్వెస్టర్లకు ఈ పథకాలు అనువుగా ఉంటాయి.

రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉంటే...

ఇక హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ హైబ్రిడ్ డెట్, రిలయన్స్ రిటైర్మెంట్ ఫండ్ ఇన్‌కమ్ జనరేషన్ పథకాలు ఆచితూచి వ్యవహరిస్తాయి. అంటే, పెట్టుబడుల విలువను కాపాడేందుకు తక్కువ రిస్క్ ఉండే సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అధిక రిస్క్ ఉండే ఈక్విటీల్లో కేవలం 20- 25 శాతాన్నే ఇన్వెస్ట్ చేస్తాయి. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న వారికి ఇవి అనువైనవి. రిస్క్ వద్దనుకునే మధ్య వయస్కులూ వీటిని ఎంచుకోవచ్చు.

మధ్యస్థంగా రిస్క్ భరించగలిగితే...

హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్ హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్ అయితే ఈక్విటీల్లో 65-70 శాతం ఇన్వెస్ట్ చేస్తాయి. ఫ్రాంక్లిన్ ఇండియా పెన్షన్ ప్లాన్, యూటీఐ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ప్లాన్ పథకాలు ఈక్విటీలకు 40 శాతం కేటాయింపులు చేస్తుంటాయి. మిగిలిన నిధుల్ని బాండ్లలో పెడతాయి. మధ్యస్థంగా రిస్క్ భరించే వారు వీటిని పరిశీలించొచ్చు.

ఫ్రాంక్లిన్, యూటీఐ.... సుదీర్ఘ చరిత్ర

ఫ్రాంక్లిన్ ఇండియా పెన్షన్ ప్లాన్, యూటీఐ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ప్లాన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏడాది, మూడేళ్లు, ఐదేళ్లు, పదేళ్ల కాలంలో ఈ పథకాలు చక్కని పనితీరు చూపించాయి. గత పది సంవత్సరాల కాలంలో వార్షికంగా 8.7 నుంచి 9.4 శాతం వరకు రాబడులిచ్చాయి. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ పథకాలకు సుదీర్ఘ చరిత్ర లేదు. ఈ మధ్యే ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ ప్రారంభం నుంచి చూస్తే చెప్పుకోతగ్గ రాబడులనే ఇచ్చాయి. మార్కెట్లు బుల్ ర్యాలీలో ఉండడంతో గడిచిన ఏడాది కాలంలో హెచ్‌డీఎఫ్‌సీ రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్ ఈక్విటీ, రిలయన్స్ రిటైర్మెంట్ ఫండ్ వెల్త్ క్రియేషన్ 34 శాతం చొప్పున లాభపడ్డాయి.

లాకిన్ పీరియడ్... మూడు లేదా ఐదేళ్లు!

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ పథకాల (ఈఎల్ఎస్ఎస్) మాదిరే రిటైర్మెంట్ ఫండ్స్‌లోనూ మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయితే ఇది పథకాలను బట్టి మారిపోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించిన రిటైర్మెంట్ ఫండ్స్‌కు లాకిన్ పీరియడ్ ఐదేళ్లు. ఫ్రాంక్లిన్ ఇండియా పెన్షన్ ప్లాన్, యూటీఐ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ప్లాన్‌లో మూడు ఆర్థిక సంవత్సరాలు లాకిన్ పీరియడ్‌గా అమల్లో ఉంది. సెబీ ఇటీవల మ్యూచువల్ ఫండ్ పథకాల వర్గీకరణలో మార్పులు చేయడంతో ఈ పథకాల్లోనూ లాకిన్ పీరియడ్ ఐదేళ్లకు పెరిగే అవకాశం కనిపిస్తోంది. రిటైర్మెంట్ ఫండ్స్ అన్నవి దీర్ఘకాలిక లక్ష్యానికి ఉద్దేశించినవి. ఇందుకు సంబంధించిన ప్రయోజనాలు నెరవేరడానికి ఇవి దోహదపడతాయి.

మధ్యలో ఉపసంహరిస్తే ఎగ్జిట్ లోడ్...

మధ్యలో కీలకమైన అవసరాలు ఏర్పడితే ఈ ఫండ్స్ నుంచి పెట్టుబడుల్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కానీ, ముందుగా పెట్టుబడుల్ని వెనక్కి తీసుకోవటాన్ని తగ్గించేందుకు కంపెనీలు ఎగ్జిట్ లోడ్ విధిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఫండ్స్ లాకిన్ పీరియడ్ ముగిసి, 60 ఏళ్లు రాకముందే పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే విలువలో ఒక శాతాన్ని ఎగ్జిట్ లోడ్‌గా వసూలు చేస్తున్నాయి. ఇక పన్ను అంశాలనూ చూడాలి. ఈక్విటీ తరహా పథకాలను (అంటే మొత్తం నిధుల్లో 65 శాతం కంటే ఎక్కువ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసేవి) ఏడాది తర్వాత విక్రయిస్తే వాటిపై 10 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను పడుతుంది. అదే డెట్ పథకాల్లో అయితే మూడేళ్ల తర్వాత విక్రయిస్తే 20 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ ఫండ్స్‌లో లాకిన్ పీరియడ్ ఐదేళ్లు ఉంది కనుక డెట్ ఫండ్స్‌ను ఆ తర్వాత విక్రయిస్తే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించి మిగిలిన లాభంపై 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్ పథకాలు ప్రధానంగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసేవి. అదే, రిటైర్మెంట్ ఫండ్స్ అయితే డెట్‌లో ఇన్వెస్ట్ చేసేవీ ఉంటాయి. రిటైర్మెంట్ ఫండ్స్‌ను ఎన్‌పీఎస్, ఇతర పథకాలతో కలిసి పెట్టుబడులకు పరిశీలించొచ్చు.





సాక్షి ఇంటర్వ్యూ

సొంతింటికి పెన్షన్ రుణం!

ఈ ఏడాది చివరికల్లా జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్) చందాదారులకు గృహ రుణాన్ని అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనేక దేశాల్లో గృహ అవసరాల కోసం ఎన్‌పీఎస్‌లో కొంత నిధులను వినియోగించుకునే వీలుంది. అంతెందుకు! పీఎఫ్‌లోనూ ఈ సౌకర్యం ఉంది. అందుకే ఎన్‌పీఎస్‌లోనూ దీన్ని అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ)' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఎ.జి.దాస్ చెప్పారు. ఇక్కడ ఎన్‌పీఎస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. "ఎన్‌పీఎస్ సభ్యులకు గృహ రుణాలివ్వాలనే ప్రతిపాదనపై కమిటీ ఏర్పాటు చేశాం. అది నివేదిక ఇచ్చింది. ఆర్థిక మంత్రి అంతిమ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది" అని ఆయన వివరించారు. వివిధ అంశాలపై ఆయన ఏం చెప్పారనేది ఆయన మాటల్లోనే...

ఈ ఏడాది చివరికల్లా అమల్లోకి వచ్చే అవకాశం

- 'సాక్షి'తో పీఎఫ్ఆర్‌డీఏ ఈడీ ఎ.జి.దాస్
- తాజాగా ఎన్‌పీఎస్‌లో 25 శాతం విత్ డ్రా చేసుకునే వీలు
- పథకంలో చేరి మూడేళ్లు పూర్తయితే చాలు
- బీమాతో సంబంధం లేకుండా పెన్షన్‌కు ప్రత్యేక ఎఫ్‌డీఐ
- నిబంధనల సడలింపు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఎన్‌పీఎస్, ఏపీవై చందాదారుల సంఖ్య 2.05 కోట్లు
- నిర్వహణ ఆస్తుల విలువ రూ.2.25 లక్షల కోట్లు



మూడేళ్లకే 25 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చు

ఈ ఏడాది జనవరి నుంచి ఎన్‌పీఎస్‌లో 25 శాతం సొమ్మును ఉపసంహరించుకునేందుకు వీలు కల్పిస్తూ పీఎఫ్ఆర్‌డీఏ నిబంధనలను సడలించటం తెలిసిందే. అయితే చందాదారులు ఎన్‌పీఎస్‌లో చేరి కనీసం మూడేళ్లు దాటితేనే ఈ వెసులుబాటు ఉంటుంది. గతంలో సభ్యత్వం తీసుకున్న పదేళ్ల తర్వాతే ఈ ఉపసంహరణకు వీలుండేది. పథకం మొత్తం కాలంలో 3 సార్లు మాత్రమే ఉపసంహరణ చేసుకోవాల్సి ఉంటుంది. గృహ అవసరాలకే కాకుండా సొంతిల్లు కొనేందుకు, అనారోగ్య సమస్యలు, ఉన్నత చదువులు, పిల్లల పెళ్లి వంటి వాటికి ఉప సంహరణ చేసుకునే వీలు కల్పించారు. అయితే చందాదారులకు అప్పటికే వ్యక్తిగత, ఉమ్మడి లేదా పూర్వీకుల ఆస్తి ఉంటే ఉపసంహరణకు వీలుండదు.

పెన్షన్ పథకాలన్నీ పీఎఫ్ఆర్‌డీఏ పరిధిలోకే..

మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు సైతం పెన్షన్ పథకాలను నిర్వహిస్తున్నాయి. ఇవి సెబీ, ఐఆర్‌డీఏఐ నియంత్రణలో ఉంటాయి. దేశంలోని అన్ని పెన్షన్ పథకాలు పీఎఫ్ఆర్‌డీఏ పరిధిలోనే ఉండాలనే ప్రభుత్వాన్ని కోరాం. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రస్తుతం దేశంలో 78 డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్స్ ఉన్నాయి. గతంలో ఫండ్ మేనేజర్ల కోసం టెండర్లు పిలిచాం. 8 మందిని ఖరారు చేశాం కూడా. అయితే గతంలో ఫండ్ మేనేజర్లిచ్చిన ఆర్ఎఫ్‌పీ దీనికి చెల్లదు. మళ్లీ తాజా టెండర్లు పిలవాలి. కొత్త ఎఫ్‌డీఐ విధానం ఖరారయ్యాక.. మళ్లీ ఫండ్ మేనేజర్ల కోసం టెండర్లు పిలుస్తాం.

పెన్షన్ పరిశ్రమకు ప్రత్యేక ఎఫ్‌డీఐ..

ప్రస్తుతం పెన్షన్, బీమా పరిశ్రమ రెండింటికీ ఒకే రకమైన ఎఫ్‌డీఐ నిబంధనలున్నాయి. తాజాగా పెన్షన్‌లో ఎఫ్‌డీఐ నిబంధనల్ని మార్చాలంటూ కమిటీ నివేదించింది. బీమాతో సంబంధం లేకుండా పెన్షన్ పరిశ్రమకు ప్రత్యేక ఎఫ్‌డీఐ విధానాన్ని ప్రకటించాలని ఆర్థిక మంత్రిని, పారిశ్రామిక ప్రోత్సాహకాల, విధాన విభాగాన్ని (డీఐపీపీ) కోరాం. అంతిమ నిర్ణయం ఇంకా తీసుకోలేదు. 2015లో కేంద్రం బీమా, పెన్షన్ పరిశ్రమలో 26 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐలను 49 శాతానికి పెంచింది.

ఉద్యోగుల్లో 14-15 శాతమే పెన్షన్‌లో...

విదేశాలతో పోలిస్తే మన దేశంలో పెన్షన్ చందాదారుల సంఖ్య చాలా తక్కువ. పదవీ విరమణ తర్వాత లేదా వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కోసం ముందే ఆలోచించకపోతే అనేక ఇబ్బందులు పడాలి. ప్రస్తుతం దేశంలో ప్రతి 12 మందిలో ఒకరు 60 ఏళ్లకు పైబడి ఉన్నారు. 2050 నాటికి ఈ సంఖ్య ఐదుగురిలో ఒకరికి చేరుతుంది. మొత్తంగా దేశంలో 10 కోట్ల మంది 60 ఏళ్లకు పైబడిన వారున్నారు. 2050 నాటికిది 30 కోట్లకు చేరే అవకాశముంది. ప్రస్తుతం జనాభాలోని ఉద్యోగుల్లో 14-15 శాతమే ఏదో ఒక పెన్షన్ పథకంలో చేరారు. ప్రతి 8 మందిలో ఒకరే పెన్షన్ పథకంలో చందాదారులుగా ఉన్నారు.

2.05 కోట్ల సభ్యులు; రూ.2.25 లక్షల కోట్లు ఆస్తులు..

2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరూ ఎన్‌పీఎస్‌లో సభ్యులే. ప్రస్తుతం ఎన్‌పీఎస్, అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) రెండు కలిపి 2.05 కోట్ల మంది చందాదారులున్నారు. రెండింటి నిర్వహణ ఆస్తి విలువ (ఏయూఎం) రూ.2.25 లక్షల కోట్లు. ఈ ఏడాది మార్చి 6 నాటికి ఎన్‌పీఎస్ సభ్యులు 13.16 లక్షలకు చేరారు. ఇందులో 6.83 మంది లక్షల సభ్యులు 4,365 కార్పొరేట్ కంపెనీలలో నుంచి ఉన్నారు. నిర్వహణ ఆస్తుల్లో అటల్ పెన్షన్‌కు రూ.3,500 కోట్ల వాటా ఉంది. ఈ ఏడాది ముగిసే నాటికి ఏపీవై సభ్యుల సంఖ్యను కోటికి చేర్చాలని లక్ష్యించాం. వచ్చే ఏడాది కాలంలో సభ్యత్వంలో 28 శాతం, ఏయూఎం 47-48 శాతం వృద్ధిని ఆశిస్తున్నాం. గత ఐదేళ్లలో ఎన్‌పీఎస్‌లో 10 శాతం రిటర్న్స్ వచ్చాయి.



“మనిషికి ఏకాగ్రత చాలా అవసరం. అది ఒక కంపెనీని సమర్థంగా నడపడానికి కావచ్చు.. లేదా వ్యక్తిగత జీవితాన్ని సంతోషంగా మార్చుకోవడానికి కావచ్చు”
– టిమ్ కుక్, యాపిల్ సీఈవో

పొదుపు-మదుపు



హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్

అన్ని కాలాల్లోనూ స్థిరమైన రాబడి!

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు దీర్ఘకాలం కోసం ఉద్దేశించినవని సాధారణంగా చెప్పకుంటాం. స్వల్పకాలంలో అస్థిరతల కారణంగా నష్టాలకు అవకాశం ఎక్కువగా ఉంటుంది కనుక. కొందరు ఈ విధమైన రిస్క్ తీసుకునేందుకు సుముఖంగా ఉండరు. కొందరు స్వల్పకాలం కోసమే ఇన్వెస్ట్ చేయాలనుకుంటుంటారు. ఈ తరహా వ్యక్తులు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్ పథకాలను పరిశీలించొచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్ కూడా ఇదే కోవకు చెందుతుంది. 2-3 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు ఈ పథకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.





ఆర్‌బీఐ చాలా నెలలుగా కీలక రేట్లలో ఏ విధమైన మార్పులు చేయడం లేదు. ఇంత కాలం క్రమంగా తగ్గుతూ వచ్చిన రేట్లు ఆర్‌బీఐ మారిన విధానంతో అక్కడే ఆగిపోయాయి. త్వరలోనే కీలక రేట్లు పెరిగేందుకు ఇది సంకేతమని విశ్లేషకుల అంచనా. బాండ్ మార్కెట్ దీన్ని ఇప్పటికే పరిగణనలోకి తీసుకుంది. వడ్డీరేట్ల పరంగా రిస్క్ తీసుకోని ఇన్వెస్టర్లకు హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్ తరహా షార్ట్ టర్మ్ ఇన్‌కమ్ ఫండ్స్ ఈ దశలో అనువైనవి. ఇవి 3–4 ఏళ్లలో కాల వ్యవధి ముగిసే డెట్ సెక్యూరిటీల్లో ఎక్కువ మొత్తం ఇన్వెస్ట్ చేస్తాయి. దీర్ఘకాలిక సాధనాలకు స్వల్ప మొత్తం, మధ్య కాలిక సాధనాలకు కూడా అధిక నిధులు కేటాయిస్తాయి. హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్ ఈ తరహా పథకమే. అన్నికాల రేట్లలోనూ స్థిరమైన రాబడులను అందిస్తోంది.

రాబడులు

2002లో ఈ పథకం మొదలు కాగా, ఏటా 8 శాతం చొప్పున రాబడులను అందించిన చరిత్ర ఉంది. 16ఏళ్ల కాలంలో స్థిరమైన, ఈ విభాగంలో మెరుగైన లాభాలను అందిస్తున్న పథకంగా హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్‌ను చెప్పుకోవచ్చు. ఐదు, ఏడు, పదేళ్ల రాబడులు 8.8 – 8.9 శాతం మధ్య ఉండడం ఈ విభాగంలో మెరుగైన పనితీరుకు నిదర్శనం. వడ్డీ రేట్ల పరంగా రిస్క్ ఉండని షార్ట్ టర్మ్ బాండ్లలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేయడం స్థిరమైన రాబడులకు సాయపడుతోంది. మార్కెట్లు నిరుత్సాహంగా ఉన్న 2012, 2015లోనూ ఈ పథకం 7–9 శాతం మధ్యలో రాబడులను ఇవ్వడం విశేషం. స్వల్ప కాలంలో మార్కెట్లు అస్థిరంగా ఉంటే బాండ్లు లబ్ధి పొందుతాయి. వడ్డీ రేట్ల క్షీణ దశలో మాత్రం వీటి రాబడులు పడిపోతాయి. 2014, 2016 ర్యాలీల్లో షార్ట్ టర్మ్ బాండ్ల రాబడులు తగ్గితే, దీర్ఘకాలిక గిల్ట్ ఫండ్స్ 16–17 శాతం స్థాయిలో అదిరిపోయే రాబడులను ఇచ్చాయి. హెచ్‌డీఎఫ్‌సీ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్ మాత్రం 10–11 శాతం రాబడులను అందించింది. ప్రస్తుతం వడ్డీ రేట్ల పరంగా అనిశ్చితి నెలకొని ఉంది. ఈ సమయంలో స్వల్పకాల బాండ్లలో ఇన్వెస్ట్ చేసే ఈ పథకం ఆకర్షణీయమైనదే.

పెట్టుబడులు

ప్రస్తుతం సగటున 1.8 సంవత్సరాల కాల వ్యవధి కలిగిన బాండ్లలో ఈ పథకం పెట్టుబడులు ఉన్నాయి. ఏఏఏ రేటెట్ బాండ్లలో 27 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఏఏ రేటెడ్ బాండ్లలో 54 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఏ రేటెడ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లో 12 శాతం పెట్టుబడులు ఉన్నాయి. జనవరి 31నాటి పెట్టుబడుల విలువ రూ.5,433 కోట్లు.

ఎందులో ఎంతెంత..?

సాధనం	పెట్టుబడుల శాతం
ఏఏ+, తక్కువ రేటింగ్ ఉన్నవి	66.5
ఏఏఏ రేటెడ్ బాండ్లు	27.4
నగదు	4.3
సావరీన్	1.4

మద్దతుపైనే పసిడి..



మార్చి 9వ తేదీతో ముగిసిన వారంలో పసిడి అంతర్జాతీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ నైమెక్స్‌లో పటిష్ట స్థాయిలో నిలిచింది. వారం వారీగా ఔన్స్‌కు (31.1గ్రా) కేవలం ఒక డాలర్ అధికంగా 1,324 వద్ద ముగిసినప్పటికీ, తక్షణ మద్దతు 1,305 పైనే నిలవడం గమనార్హం. వారంలో 1,340 – 1,324 డాలర్ల శ్రేణిలో తిరిగింది. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై వరుసగా 25,10 శాతం చొప్పున అమెరికా సుంకాల విధింపు... ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, డాలర్ ఇండెక్స్‌పై ఈ ప్రభావం దీనితోపాటు అమెరికా– ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్తతల ఉపశమనం వంటి అంశాలు వచ్చే కొద్ది నెలల్లో పసిడి కదలికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆయా ప్రభావ అంశాల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో పసిడి 1,250 డాలర్లు – 1,400 డాలర్ల స్థాయిలోనే తిరిగే అవకాశం ఉందన్నది నిపుణుల అభిప్రాయం. 1,300, 1,270, 1,240 డాలర్ల వద్ద పసిడికి పటిష్ట మద్దతు ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక ఎగువస్థాయిలో తక్షణ నిరోధం 1,365 డాలర్లు. ఇక డాలర్ ఇండెక్స్ గడచిన వారంలో స్వల్పంగా 0.25 సెంట్లు పెరిగి 89.95 నుంచి 90.11కు ఎగసింది. **దేశంలో రూపాయి అడ్డు..:** అంతర్జాతీయ ప్రభావంతోపాటు దేశీయంగా డాలర్ మారకంలో రూపాయి బలోపేతం (వారం వారీగా 28 పైసలు లాభంతో 64.94) ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడిపై కనిపించింది. వారంలో 10 గ్రాముల ధర స్వల్పంగా రూ.47 తగ్గి, రూ.30,401కి చేరింది. ఇక దేశీయంగా ముంబై ప్రధాన మార్కెట్‌లో పసిడి వారం వారీగా 99.9 స్వచ్ఛత ధర రూ.300 లాభంతో రూ.30,545కు చేరింది.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, మార్చి 8 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75- 6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.7	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.7	6.8 - 7	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6-6.7	6.7-6.9	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.25-6.5	6.60	6.40
ఎస్‌బీఐ	6.35-6.4	6.4	6.50
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.50

మరింత సమాచారం కోసం www.bankbazaar.com పై క్లిక్ చేయండి

రెండేళ్లకు రిటర్నులు వేయొచ్చు

ఆర్థిక సంవత్సరం 2015-16కి, అలాగే 2016-17కి సంబంధించి ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఇంకా దాఖలు చేయలేదా? అయితే ఇదొక్కసారి చదవాల్సిందే...

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

ముందుగా 2015–16 విషయానికొస్తే...

ఈ ఆర్థిక సంవత్సరం గడువు తేదీలు 2016 జూలై, సెప్టెంబర్‌తో ముగిశాయి. అప్పుడే గడువు తేదీని పొడిగించారు. అప్పుడు వేయలేనివారు 31.3.2018 లోపల వేయొచ్చు. 31.3.2018 దాటిపోతే వేయడానికి అవకాశం ఉండదు. అయితే ఆ సంవత్సరం ఏదైనా నష్టాన్ని కానీ వడ్డీని కానీ రాబోయే సంవత్సరం ఆదాయంలోంచి తగ్గించే సర్దుబాటు మాత్రం ఉండదు. ఆ సర్దుబాటు హక్కు కేవలం గడువు తేదీ లోపల వేసిన వారికే ఉంటుంది. రిటర్నులు వేయకపోతే వడ్డీలు, పెనాల్టీలు, జైలు శిక్షలు వంటివి ఉంటాయి. అందుకే రిటర్నులు తప్పక వేయాలి.

ఇక 2016–17 ఆర్థిక సంవత్సరం

2016–17 ఆర్థిక సంవత్సరం రెండు గడువు తేదీలు.. జూలై, సెప్టెంబర్. వీటిని కూడా కొన్ని రోజులు పొడిగించారు. మొదటి గడువు ట్యాక్స్ ఆడిట్ లేనివారికి, రెండో గడువు ట్యాక్స్ ఆడిట్ ఉన్నవారికి. ఈ గడువు తేదీలు ముగిసిపోయాయి. 2018 మార్చిలోకి ప్రవేశించాం. ఈ ఏడాది రిటర్నులు దాఖలు చేయడానికి ఆలస్యంగా 31.3.2018 వరకు అవకాశం ఉంది. ఆలస్యం కారణంగా నష్టాన్ని కానీ, వడ్డీని కానీ సద్దుబాటు చేయరు. కానీ మిగతా ప్రయోజనాలు ఉంటాయి.

అవి ఏమిటంటే..

- మిమ్మల్ని డిఫాల్టర్‌గా పరిగణించరు.



- రుణాల మంజూరీకి ఉపయోగపడుతుంది.
- మీ క్రెడిట్ విశ్వసనీయత పెరుగుతుంది.
- వడ్డీలు తప్పించుకున్నా.. పెనాల్టీలు పడతాయి.

ఇక 2017–18 సంవత్సరం నుంచి ఆలస్యంగా దాఖలు చేసినట్లయితే వేలల్లో ఆలస్య రుసుము చెల్లించాలి. జీవితంలో మాదిరే ఆర్థిక అంశాల్లోనూ అత్యంత శ్రద్ధ, క్రమశిక్షణ అవసరం.


డీసీబీ బ్యాంక్ నుంచి విదేశాలకు రెమిటెన్స్ సర్వీసులు



ముంబై: ప్రైవేట్ రంగానికి చెందిన డీసీబీ బ్యాంక్ తాజాగా 'డీసీబీ రెమిట్' పేరిట రెమిటెన్స్ సర్వీసులు ప్రారంభించింది. దీనితో దేశీయంగా బ్యాంక్ ఖాతా ఉన్నవారు విదేశాలకు ఆన్‌లైన్‌లో నగదు పంపొచ్చు. అమెరికా సహా కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, యూఏఈ, జర్మనీల కోసం ఈ సర్వీసును ఉపయోగించుకోవచ్చని డీసీబీ బ్యాంక్ తెలిపింది. నిర్ధారిత విదేశీ మారక రేటు ప్రకారం ముందుగా.. ఖాతాదారు ఏ బ్యాంకు ఖాతా నుంచైనా డీసీబీ బ్యాంక్ ఖాతాలోకి ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత తదుపరి పని దినం లోగా సదరు నగదును విదేశాల్లోని లబ్ధిదారు ఖాతాకు డీసీబీ బ్యాంక్ బదలాయిస్తుంది. విదేశీ కళాశాలల్లోని పిల్లల చదువుల కోసం, వైద్యం ఖర్చులు మొదలైన వాటి కోసం ఈ సత్వర రెమిటెన్స్ సేవలు ఉపయోగపడతాయని డీసీబీ బ్యాంక్ రిటైల్ విభాగం హెడ్ ప్రవీణ్ కుట్టి తెలిపారు. ఎవెన్యూస్ పేమెంట్స్ సంస్థతో కలిసి డీసీబీ బ్యాంక్ ఈ కొత్త సర్వీసు ప్రారంభించింది.

స్టాక్స్ వ్యూ

పేజ్ ఇండస్ట్రీస్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతీలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.21,451
టార్గెట్ ధర: రూ.27,490

ఈ కంపెనీ పురుషుల, మహిళల లోదుస్తులు, స్పోర్ట్స్ వేర్‌లను అందిస్తోంది. ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్స్(ఈబీఓ)లను వేగంగా విస్తరిస్తోంది. ఈ నెలలోనే 80కు పైగా ఈబీఓలను ప్రారంభించనున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 500 ఈబీఓలను అందుబాటులోకి తేనున్నది. గత ఏడాది మార్చి నాటికి 360గా ఉన్న ఈబీఏలను వచ్చే ఏడాది మార్చి కల్లా 1,000 కు పెంచాలనేది కంపెనీ లక్ష్యం. ఈ ఈబీఏల ఏర్పాటు ఇటు కంపెనీకి, అటు ఫ్రాంఛైజీ సంస్థలకు కూడా ప్రయోజనకరమైనదే. ఇంత భారీగా ఈబీఓల విస్తరణ....అమ్మకాల వృద్ధి పట్ల ఫ్రాంఛైజీలకు, కంపెనీకి గల ధీమాను సూచిస్తోంది. మొత్తం అమ్మకాల్లో ఈబీఓల వాటా గత ఆర్థిక సంవత్సరంలో 15%గా ఉండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం కల్లా 40%గా ఉండనున్నది. 2017–20 కాలానికి రూ.200 కోట్ల మేర పెట్టుబడులు పెడుతోంది. మూలధన ప్రణాళికల్లో భాగంగా అనంతపురం, ఒడిశాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నది. గత ఆర్థిక సంవత్సరంలో 16–17%గా ఉన్న అవుట్ సోర్సింగ్ మాన్యుఫాక్చరింగ్ వచ్చే ఆర్థిక సంవత్సరం కల్లా 35%కి పెరిగే అవకాశాలున్నాయి. డిమాండ్ బాగా ఉండడమే దీనికి కారణం. డిస్ట్రిబ్యూటర్ల సంఖ్యను ప్రతి ఏడాది 10% చొప్పున పెంచుతోంది. ఈ కంపెనీ ఉత్పత్తులకు పోటీ చాలా తక్కువగా ఉంది. వ్యాన్ హ్యూసెన్ కంపెనీ ఉత్పత్తులు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. మొత్తం అమ్మకాలు 2.6 శాతంగా ఉన్న ఆన్‌లైన్ అమ్మకాలు మెల్లమెల్లగా పుంజుకుంటున్నాయి. వృద్ధి, ఈపీఎస్ ప్రతి ఏడాదీ 15% కంటే ఎప్పుడూ తక్కువ వృద్ధి సాధించలేదు. రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్(ఆర్‌ఓసీఈ) 40% ఉంది.

బ్రిటానియా ఇండస్ట్రీస్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: యాక్సిస్ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.4,840
టార్గెట్ ధర: రూ.5,300

ఈ కంపెనీ బిస్కెట్లు, బ్రెడ్‌లు, డైరీ ఉత్పత్తులు, కేక్‌లను అందిస్తోంది. కొత్త ఉత్పత్తుల జోరును పెంచుతోంది. పూర్తి ఫుడ్ కంపెనీగా మారే క్రమంలో ఈ ఆర్థిక సంవత్సంరలో 50కు పైగా కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నది. ఇప్పుడున్న సెగ్మెంట్లతో పాటు కొత్త సెగ్మెంట్లలో కూడా కొత్త ఉత్పత్తులను అందించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నికర అమ్మకాలు 13 శాతం, ఇబిటా 27 శాతం, నికర లాభం 20 శాతం చొప్పున వృద్ధి చెందాయి. పన్ను రేటు 33.7 శాతంగా ఉండటంతో నికర లాభం 20 శాతమే వృద్ధి చెందింది. స్థూల మార్జిన్లు 38.5 శాతంగా, ఇబిటా మార్జిన్ 15.5 శాతంగా ఉన్నాయి. కరెన్సీ ఒడిదుడుకుల కారణంగా అంతర్జాతీయ అమ్మకాలు అంతంత మాత్రంగా ఉండగా, దేశీయ అమ్మకాలు 15 శాతం వృద్ధి చెందాయి. బిస్కెట్ కేటగిరీ అమ్మకాలు ఊపందుకుంటాయని కంపెనీ అంచనా వేస్తోంది. రానున్న క్వార్టర్లలో ఈ సెగ్మెంట్ అమ్మకాలు 9–10 శాతం వృద్ధి సాధించగలదని కంపెనీ భావిస్తోంది. ఈ క్యూ3లో ఉత్పత్తి వ్యయాలు ఫ్లాట్‌గా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉత్పత్తి వ్యయాలు 3–3.5 శాతం రేంజ్‌లో పెరగగలవని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం రూ.400 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం స్థాయిని ఐదేళ్లలో నాలుగు రెట్లకు రూ.1,500 కోట్లకు పెంచుకోవాలనేది కంపెనీ లక్ష్యం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.



అమెరికా సుంకాల పెంపు ప్రభావం ఉండకపోవచ్చు

అల్యూమినియం తయారీదారుల సంఘం

న్యూఢిల్లీ: అల్యూమినియం, స్టీల్ దిగుమతులపై అమెరికా సుంకాలు విధింపు దేశీయ పరిశ్రమపై నేరుగా అంత ప్రభావం చూపకపోవచ్చని అల్యూమినియం తయారీదారుల సంఘం అభిప్రాయపడింది. అయితే, అంతర్జాతీయంగా అమెరికా వెలుపల అల్యూమినియం లభ్యత పెరగడం వల్ల ఆ ప్రభావం ఉంటుందని అల్యూమినియం అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రభుత్వరంగ నాల్కో చైర్మన్, ఎండీ కూడా అయిన టీకే చంద్ అన్నారు. ప్రముఖ అల్యూమినియం తయారీ సంస్థ వేదాంత లిమిటెడ్ సైతం ఏటా లక్ష టన్నుల అల్యూమినియం ఎగుమతి చేస్తున్నామని, అమెరికా సుంకాలతో పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని పేర్కొంది. సుంకాల పెంపుతో సరఫరా వ్యయాలు పెరిగి దానికి తగినట్టు ధరలు కూడా సర్దుబాటు అవుతాయని వేదాంత లిమిటెడ్ చీఫ్ సేల్స్ ఆఫీసర్ జీన్ బాప్టిస్ట్ ల్యుకాస్ అభిప్రాయపడ్డారు.

పరిశీలిస్తున్న వాణిజ్య శాఖ

భారత్ నుంచి ఏటా 2 బిలియన్ డాలర్ల మేర (రూ.13,000 కోట్లు) అల్యూమినియం, స్టీల్ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి జరుగుతున్న నేపథ్యంలో సుంకాల పెంపు ప్రభావం ఏ మేరకు ఉండొచ్చన్న అంశంపై కేంద్ర వాణిజ్య శాఖ దృష్టి సారించింది. స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి టారిఫ్ విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. కెనడా, మెక్సికోలకు మాత్రం మినహాయింపు కల్పించారు. అమెరికా నిర్ణయం నేపథ్యంలో ఆ దేశానికి వ్యతిరేకంగా ఏ దేశమైనా ప్రపంచ వాణిజ్య మండలి (డబ్ల్యూటీవో)కి వెళితే థర్డ్‌పార్టీగా చేరే అంశాన్ని పరిశీలించనున్నట్టు ఓ అధికారి తెలిపారు.


సాక్షి



బొమ్మ–బొరుసు

“స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లేకుంటే.. నీవు ఎప్పటికీ మంచి ఇన్వెస్టర్ కాలేవు”

– వారెన్ బఫెట్



నోట్ల రద్దు సమస్యల నుంచి భారత్ గట్టెక్కుతోంది



ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ తావో ఝాంగ్

వాషింగ్టన్: నోట్ల రద్దు(డీమోనిటైజేషన్), వస్తు–సేవల పన్ను(జీఎస్టీ) సమస్యల నుంచి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) పేర్కొంది. అయితే, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడం... విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రభుత్వం సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. 'గడచిన కొన్నేళ్లలో భారత్ ఎకానమీ పటిష్ట వృద్ధిని సాధిస్తోంది. సరఫరా సంబంధ అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, నిర్మాణాత్మక సంస్కరణలు, స్థూల ఆర్థిక విధానాలే దీనికి కారణం. అయితే, జీఎస్టీ, నోట్ల రద్దు కారణంగా వృద్ధి మందగించింది. ఇప్పుడు మళ్లీ ఈ ప్రభావం నుంచి గట్టెక్కుతుండటంతో డిసెంబర్ క్వార్టర్‌లో జీడీపీ వృద్ధి 7.2 శాతానికి ఎగబాకింది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానాన్ని తిరిగి సంపాదించుకోగలిగింది' అని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తావో ఝాంగ్ చెప్పారు. ఈ నెలలోనే భారత్ పర్యటనకు రానున్న నేపథ్యంలో పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంశాలను పేర్కొన్నారు. 'రానున్న కాలంలో ముఖ్యంగా విద్య, వైద్యం వంటి రంగాల్లో కీలక సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా అధిక వృద్ధిని సాధించవచ్చు. మౌలిక రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం, బ్యాంకింగ్–ఫైనాన్షియల్ వ్యవస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటివి కూడా చాలా కీలకం. ఈ చర్యలన్నీ సమ్మిళిత, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయి. దీనివల్ల దేశంలో సమాన స్థాయిలో ప్రజల ఆదాయాలు పెరిగేందుకు బాటలు వేస్తుంది' అని ఝాంగ్ వివరించారు. కాగా, ప్రాంతీయ, ప్రపంచ ఆర్థికాభివృద్ధికి భారత్, చైనాలు అత్యంత ప్రధానమైన చోదకాలని చెప్పారు. బలమైన ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్యంతో ఇరు దేశాలకూ ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు.

మూలధన నిధులపై...: మొండిబకాయిల సమస్య పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న విస్తృత ఫైనాన్షియల్ సంస్కరణల్లో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన నిధులను(రీక్యాపిటలైజేషన్) అందించాలని ఐఎంఎఫ్ అభిప్రాయపడింది. బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న తీవ్ర ఇబ్బందులను(మొండిబకాయిలకు సంబంధించి) పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన విధానపరమైన సంస్కరణలు చాలా కీలకమైనవని ఝాంగ్ వ్యాఖ్యానించారు.

గణాంకాలు కీలకం!

ఐఐపీ, ద్రవ్యోల్బణంపై ఇన్వెస్టర్ల దృష్టి

- ఆరంభం సానుకూలంగా ఉన్నా, బలహీనతలుంటాయ్...
- కన్సాలిడేషన్ కొనసాగవచ్చు
- ఈ వారం మార్కెట్‌పై నిపుణుల అంచనా



పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం మార్కెట్‌కు కీలకం కానున్నాయని మార్కెట్ నిపుణులు అంటున్నారు. వీటితో పాటు ప్రపంచ మార్కెట్ల పోకడ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి తదితర అంశాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని వారంటున్నారు.

నేడు రిటైల్ ద్రవ్యోల్బణం డేటా...

నేడు (సోమవారం) ఫిబ్రవరి నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, జనవరి నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు(ఐఐపీ) మార్కెట్ ముగిసిన తర్వాత వస్తాయి. గత ఏడాది డిసెంబర్‌లో 5.21 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జనవరిలో 5.07 శాతానికి తగ్గింది. ఇక గత ఏడాది డిసెంబర్‌లో ఐఐపీ 7.1 శాతంగా నమోదైంది. ఈ ఏడాది జనవరిలో ఐఐపీ 6.3–6.4 శాతం రేంజ్‌లో ఉండొచ్చని అంచనా. ఇక ఫిబ్రవరి టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు (డబ్ల్యూపీఐ) ఈ నెల 14న(బుధవారం) వెలువడతాయి. ఈ ఏడాది జనవరిలో డబ్ల్యూపీఐ 2.84 శాతంగా ఉంది. సోమవారం వాణిజ్య లోటు గణాంకాలు, మంగళవారం (ఈ నెల 13న) క్యూ4 కరంట్ అకౌంట్ లోటు గణాంకాలు వస్తాయి. ఐఐపీ, రిటైల్‌ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మార్కెట్ ఎదురు చూస్తోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. రిటైల్ ద్రవ్యోల్బణం గత నెలలో 4.74 శాతానికి దిగి వస్తుందన్న అంచనాలున్నాయని ఆయన అన్నారు. ఐఐపీ, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రతికూలంగా ఉంటే మార్కెట్ పతనమవుతుందని ఎపిక్ రీసెర్చ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముస్తఫా నదీమ్ చెప్పారు. ఐఐపీ, రిటైల్ గణాంకాల ప్రభావం బ్యాంక్ నిఫ్టీపై అధికంగా ఉంటుందని, ఈ సూచీ 200 రోజుల సగటు కంటే దిగువకు పడిపోయిందని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ ఎనలిస్ట్ వికాస్ జైన్ చెప్పారు. వాహన, ప్రైవేట్ బ్యాంక్, కన్సూమర్ డ్యూరబుల్ రంగాల షేర్లు సానుకూలంగా చలించవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు.

బలహీనతలు కొనసాగుతాయ్...

గత శుక్రవారం వెలువడిన ఉద్యోగ గణాంకాలు అంచనాలను మించడంతో అమెరికా మార్కెట్ భారీగా లాభపడిందని, దీంతో ఈ సోమవారం మన మార్కెట్ సానుకూలంగానే ఆరంభమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వారంలో బలహీనతలు కొనసాగుతాయని, కన్సాలిడేషన్ కొనసాగుతుందని వారంటున్నారు. స్టాక్ సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడుతాయని, అయితే బ్యాంక్ రుణ కుంభకోణాలకు సంబంధించి కొత్త అంశాలు వెల్లడైతే మాత్రం అమ్మకాలు వెల్లువెత్తుతాయని వారు హెచ్చరిస్తున్నారు. రూ.5,000 కోట్ల బ్యాంక్ ఫ్రాడ్‌కు సంబంధించి ఆంధ్రాబ్యాంక్ మాజీ డైరెక్టర్‌పై ఈడీ చార్జ్‌షీట్ వేయడం, రూ.50 కోట్లకు మించిన బ్యాంక్ రుణాలకు సంబంధించి బ్యాంక్ పుస్తకాలను తనిఖీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు ప్రతికూల ప్రభావం చూపించవచ్చు.

ఈ వారంలో మూడు ఐపీఓలు

ఈ వారంలో మూడు ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)లు రానున్నాయి. భారత్ డైనమిక్స్ ఐపీఓ ఈ నెల 13న(మంగళవారం) ఆరంభమై 15న ముగుస్తుంది. ఈ ఐపీఓ ధర శ్రేణి రూ.413–428గా ఉంది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.961 కోట్ల మేర సమీకరించనుంది. కనీసం 35 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. బంధన్ బ్యాంక్ ఐపీఓ ఈ నెల 15న(గురువారం) ఆరంభమై ఈ నెల 19న ముగుస్తుంది. రూ.370–375 ధర శ్రేణితో ఈ బ్యాంక్ రూ.4,473 కోట్లు సమీకరించనున్నది. కనీసం 40 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఐపీఓ ఈ నెల 16(శుక్రవారం) ప్రారంభమై 21న ముగుస్తుంది. రూ.1,215–1,240 ప్రైస్‌బాండ్‌తో రూ.4,482 కోట్లు సమీకరిస్తుంది.

ఈ వారం ఈవెంట్స్

12 సోమ	జనవరి ఐఐపీ గణాంకాలు
	ఫిబ్రవరి రిటైల్ ద్రవ్యోల్బణగణాంకాలు
	వాణిజ్య లోటు వివరాలు
13 మంగళ	క్యూ4 కరంట్ అకౌంట్ లోటు గణాకాలు
14 బుధ	ఫిబ్రవరి టోకు ధరల ద్రవ్యోల్బణ వివరాలు

భవిష్యత్ ఆణిముత్యాల కోసం రిలయన్స్ యూనివర్సిటీ



ముంబై: పరిశోధన, ఆవిష్కరణలతోపాటు భవిష్యత్తు నేతలు, సంగీత విద్వాంసులు, శాస్త్రవేత్తలు, ఒలింపిక్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్టు రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ తెలిపారు. ఇండియా టుడే సదస్సులో పాల్గొన్న ఆమె క్రీడలు, విద్యకు సంబంధించిన అంశంపై మాట్లాడుతూ... ఈ రెండు రేపటి రోజున భారత్ ఎదిగేందుకు గల శిఖరాలుగా పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ, అతిపెద్ద కంపెనీలు సైతం పరిమిత జీవిత కాలం ఉంటే, విద్యా సంస్థలు మాత్రం కల కాలం ఉంటాయి. ఎన్నో తరాలకు అవి శక్తినిస్తాయి' అని నీతా అంబానీ అన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కూడా పాల్గొన్నారు.

గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.773 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో ఆదరణ రోజురోజుకీ క్షీణిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017 ఏప్రిల్ నుంచి) ఇప్పటి వరకు రూ.773 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే రూ.94 కోట్ల మేర గోల్డ్ ఈటీఎఫ్‌లను విక్రయించగా, జనవరిలో రూ.110 కోట్ల మేర ఉపసంహరణలు చోటు చేసుకున్నాయి. రాబడులు దారుణంగా ఉండటం, ధరల్లో అస్థిరతలు ఇన్వెస్టర్ల విక్రయానికి కారణాలు.

వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలి

- పీఎన్‌బీ స్కామ్ భయాందోళనకు దారితీయరాదు
- ఫిక్కీ, అసోచామ్ సూచనలు

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) స్కామ్ ఆర్థిక వ్యవస్థలో భయాందోళనకు, అచేతనానికి దారితీయరాదని ఫిక్కీ సూచించింది. ఈ విధమైన పరిస్థితి ఏర్పడకుండా చూడాలని ఆర్‌బీఐ, ప్రభుత్వాలకు లేఖ రాసినట్టు ఫిక్కీ ప్రెసిడెంట్ రశేష్ షా తెలిపారు. షా ఎడెల్వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నారు. పీఎన్‌బీ స్కామ్ యూపీఏ–2 హయాంలోని చివరి రోజులను గుర్తు చేస్తోందని, నాడు సీబీఐ, సీవీసీ, కాగ్ అంటే భయం ఉండేదని షా పేర్కొన్నారు. ఈ తరహా స్కామ్‌లతో బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్న ఆయన, 1992లో హర్షద్ మెహతా స్కామ్, 2001లో కేతన్ పరేఖ్ స్కామ్‌ల తర్వాత పరిస్థితిని గుర్తు చేశారు. పీఎన్‌బీ స్కామ్‌ను వ్యవస్థల బలోపేతానికి అవకాశంగా సూచించారు.

రుణాలపై ప్రభావం పడరాదు

పీఎన్‌బీ స్కామ్‌తో దర్యాప్తు సంస్థలు, బ్యాంకులు అతిగా స్పందించడం వల్ల వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు రుణాల జారీపై ప్రభావం పడుతుందని అసోచామ్ హెచ్చరించింది. బ్యాంకులు, నియంత్రణ సంస్థలు, ప్రభుత్వ చర్యలు నష్టాన్ని పరిమితం చేసే విధంగా ఉండాలని సూచించింది. ''కుంభకోణాలు బయటకు వచ్చాక, మీడియాలో ప్రముఖంగా వార్తలు రావడంతో ఈ స్థాయి హడావిడి సాధారణమే. కానీ, ఇది బ్యాంకుల విశ్వాసానికి విఘాతం కలిగిస్తుంది. కనుక ఎంతో నిగ్రహంతో ఈ సందర్భాన్ని ఓ అవకాశంగా భావించి వ్యవస్థాపరమైన సమస్యల పరిష్కారానికి వినియోగించుకోవాలి'' అని అసోచామ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్ సూచించారు.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఆర్‌బీఐ ప్రత్యేక ఆడిట్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రత్యేక ఆడిటింగ్‌ను ఆర్‌బీఐ నిర్వహించనుంది. భారీ కుంభకోణాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో వాణిజ్య రుణాల జారీపై, ముఖ్యంగా లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌వోయూ)ల ఆధారంగా జారీ అయిన రుణాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌వోయూల ఆధారంగానే 13,000 కోట్ల మోసానికి పాల్పడటం తెలిసిందే. అలాగే, ఢిల్లీకి చెందిన ద్వారాకాదాస్ సేత్ ఇంటర్నేషనల్ సైతం ఎల్‌వోయూల ఆధారంగా మోసానికి పాల్పడిన ఘటన సైతం ఇటీవలే వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో తాము జారీ చేసిన ఎల్‌వోయూలు, వాటికి సంబంధించి బాకీలు, ఎల్‌వోయూలు జారీ చేసే ముందు తగినంత నగదు మార్జిన్ ఉంచారా? అనే వివరాలు అందించాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది.

ఎయిర్ ఇండియా రేసులోకి జెట్ ఎయిర్‌వేస్?

ఫ్రాన్స్ కేఎల్ఎం, డెల్టా ఎయిర్‌లైన్స్‌తో కలసి బిడ్



న్యూఢిల్లీ: తీవ్ర నష్టాల్లో మునిగి ఉన్న ప్రభుత్వరంగ ఎయిర్ ఇండియాను సొంతం చేసుకునేందుకు జెట్ ఎయిర్‌వేస్, ఫ్రాన్స్ కేఎల్ఎం, డెల్టా ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా పోటీపడనున్నాయి. ఎయిర్ ఇండియాలో వాటాల విక్రయానికి త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు (ఈవోఐ) ఆహ్వానించనుంది. ఈ నేపథ్యంలో జెట్ ఎయిర్‌వేస్‌తో కూడిన కన్సార్షియం కూడా బిడ్ వేయనుందని, ఈ మేరకు అవి ఆసక్తితో ఉన్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం.

గత వారం హీరోలు

స్టాక్స్	1 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	196	155	26
అశోక్ లేలాండ్	147	141	4
క్రాంప్టన్ గ్రీవ్స్	240	233	3
జీ ఎంటర్‌టైన్‌మెంట్	568	557	2
టెక్ మహీంద్రా	619	611	1
ఐఓసీ	386	381	1
టైటాన్	818	810	1
ఏషియన్ పెయింట్స్	1,128	1,120	1
ఎన్‌టీపీసీ	164	163	1
ఐషర్ మోటార్స్	27,875	27,735	1

ఎందుకు పెరిగాయంటే...

ఎఫ్‌టీఎస్‌ఈ గ్లోబల్ ఈక్విటీ ఇండెక్స్‌లో చోటు దక్కడంతో ఐటీ షేర్ వక్రంగీ 26% ఎగసింది. జేపీ మోర్గాన్ ఓవర్ వెయిట్ రేటింగ్‌ను ఇవ్వడంతో క్రాంప్టన్ గ్రీవ్స్ కన్సూమర్ 3% పెరిగింది. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా లేని 15 ఏళ్లు దాటిన వాణిజ్య వాహనాలపై నిషేధం విధించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్న వార్తలతో అశోక్ లేలాండ్ షేర్ 4% పెరిగింది. లైవ్, స్ట్రీమింగ్ సేవలను సింగిల్ యాప్ 'జీ5'లో విలీనం చేయడంతో జీ ఎంటర్‌టైన్మెంట్ 2% పెరిగింది.

గత వారం జీరోలు

స్టాక్స్	1 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
టాటా స్టీల్	606	675	-10
ఆర్‌ఈసీ	128	142	-10
పవర్ ఫైనాన్స్ కార్ప్	93	102	-9
హిందాల్కో	220	240	-8
టాటా మోటార్స్	342	371	-8
టాటా మోటార్స్ డీవీఆర్	193	208	-7
పిరమల్ ఎంటర్‌ప్రైజెస్	2,362	2,547	-7
అంబుజా సిమెంట్	235	253	-7
అదాని పోర్ట్స్	377	405	-7
ఎన్ఎండీసీ	122	131	-7

ఎందుకు తగ్గాయంటే...

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలు విధించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీల ధరలు కూడా తగ్గడంతో టాటా స్టీల్, హిందాల్కో, ఎన్ఎమ్‌డీసీ షేర్లు 10–6 శాతం రేంజ్‌లో పతనమయ్యాయి. రాష్ట్రాల విద్యుత్ బోర్డ్‌ల రుణాలపై ఆందోళనతో ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ షేర్లు చెరో 9% పడ్డాయి. జేఎల్ఆర్ అమ్మకాల తగ్గుదలతో టాటా మోటార్స్, టాటా మోటార్స్ డీవీఆర్ షేర్లు 7–8 % రేంజ్‌లో క్షీణించాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-3-2018

విజయవాడ	322-00
గోదావరి	322-00
విశాఖ	332-00
వరంగల్	332-00
చిత్తూరు	363-00
చెన్నై	370-00
ముంబై	370-00
నమక్కల్	360-00
11-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365-00
కోల్‌కతా	368-00
ఢిల్లీ	320-00

చిన్న కమతాలే పెద్ద సమస్య

- తెలుగు రాష్ట్రాల్లో అధికం
- స్వరాజ్ ట్రాక్టర్స్ సీఓఓ వీరేన్ పొప్లి

(చండీగఢ్, సాక్షి బిజినెస్ బ్యూరో)

భారత్‌లో వ్యవసాయ యాంత్రీకీకరణకు ప్రధాన అవరోధం చిన్న కమతాలేనని, తెలుగు రాష్ట్రాల్లో ఇవి చాలా ఎక్కువని స్వరాజ్ ట్రాక్టర్స్ సీఓఓ వీరేన్ పొప్లి అభిప్రాయపడ్డారు. ఇంతవరకు 60 హెచ్‌పీలోపు ట్రాక్టర్ల ఉత్పత్తిపైనే శ్రద్ధ చూపిన స్వరాజ్ ట్రాక్టర్స్ తొలిసారి అధిక హెచ్‌పీ విభాగంలోకి కాలుమోపింది. ఇందులో భాగంగా 60– 75 హెచ్‌పీ విభాగంలో కొత్తగా స్వరాజ్ 963 ఎఫ్ఈ పేరిట కొత్త ట్రాక్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా చండీగఢ్‌లో సాక్షి బిజినెస్ బ్యూరోతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న కాంట్రాక్ట్ ఫామింగ్ బిల్లుతో చిన్న కమతాల సమస్య క్రమంగా కనుమరుగుకావచ్చని ఆయన అంచనా వేశారు. కాంట్రాక్ట్ ఫామింగ్ సరైన రీతిలో అమల్లోకి వస్తే శక్తిమంతమైన యంత్రాల వినియోగం పెరుగుతుందన్న ఆలోచనతో కంపెనీ ఈ విభాగంలోకి అడుగుపెట్టింది. ఈ నెల్లో ఎంసీఎఫ్‌సీఏ(కాంట్రాక్టు సాగు ముసాయిదా బిల్లు)కు కేబినెట్ ఆమోదముద్ర పడే అవకాశం ఉంది.

స్టీల్ ధరలు పెరగడమే ప్రమాదం!

క్రూడాయిల్ ధర పెరుగుదల కన్నా స్టీల్ ధరల పెరుగుదలపైనే ఆటో రంగం ఆందోళన చెందుతోందని వీరేన్ చెప్పారు. స్టీలు ధరల పెంపుతో ఉత్పాదకాల ధరలు పెరిగి అంతిమంగా విక్రయాలు, లాభాలపై నెగిటివ్ ప్రభావం పడవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఏపీ, తెలంగాణ, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రైతులకు కొత్త ట్రాక్టర్ అందుబాటులోకి వస్తుందని, త్వరలో దేశమంతా విక్రయాలు ఆరంభిస్తామని ఎం అండ్ ఎం వ్యవసాయోపకరణాల విభాగం అధిపతి రాజేశ్ జెజురికర్ చెప్పారు. దీని ఆరంభ ధర రూ. 7.4 లక్షలు(మొహాలీ ఎక్స్ షోరూం ధర).ఇతర ప్రత్యేకతలు: 60హెచ్‌పీ ఇంజన్, 2200 కిలోల లిఫ్టింగ్ సామర్థ్యం.3 రేంజ్ స్పీడ్ ఆప్షన్, డిజిటల్ డాష్ బోర్డ్ తదితరాలు.



ఎల్‌టీసీజీ భారం ఫండ్ ఇన్వెస్టర్లపై ఎంత?

మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల తరపున షేర్ల కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలు నిర్వహిస్తారు కదా! ఇప్పుడు తాజాగా వచ్చిన దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్)ను మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు కూడా చెల్లించాలా ? ఇది మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లపై ప్రభావం చూపిస్తుందా ?

– రవికాంత్, విజయవాడ

పోర్ట్‌ఫోలియో తరపున మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు షేర్లు విక్రయించినా, కొన్నా...అది ఇన్వెస్టర్ల తరపునే. అందుచేత ఫండ్ ద్వారా ఒనగూరే లాభనష్టాలు..ఫండ్స్ చేసే చెల్లింపులు అన్నీ ఎన్ఏవీలో ప్రతిబింబిస్తాయి. ఈ ఎన్ఏవీ ఆధారంగానే ఇన్వెస్టర్ల పెట్టుబడులు వుంటాయి. ఇక దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ)ను ఫండ్ మేనేజర్లు చెల్లించరు. మ్యూచువల్ ఫండ్ యూనిట్లను విక్రయించిన ఇన్వెస్టర్లే ఈ పన్నును చెల్లించాల్సివుంటుంది. ఇక మీరు ఎప్పుడు ఇన్వెస్ట్ చేశారు అనే అంశాన్ని బట్టి మీరు మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మొత్తం నిధుల్లో 65 శాతం వరకూ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ యూనిట్లను ఏడాది లోపు విక్రయిస్తే మీరు మీకు వచ్చిన రాబడులపై 15 శాతం చొప్పున స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత ఈ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను విక్రయిస్తే, మీరు ఎలాంటి దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఇప్పటి వరకూ ఉండేది కాదు. కానీ ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను ఏడాది తర్వాత విక్రయిస్తే, మీకు లక్షకు పైగా లాభాలు వస్తే, ఆ లాభాలపై 10 శాతం మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

నా వయసు 50 సంవత్సరాలు. ప్రస్తుతం నా దగ్గర రూ.3 లక్షలున్నాయి. పదేళ్ల తర్వాత నెల వారీ నాకు కొంత ఆదాయం కావాలంటే ఈ మూడు లక్షలను నేను ఎలా ఇన్వెస్ట్ చేయాలి ?

– రియాజ్, హైదరాబాద్

రిటైరైన తర్వాత నెలవారీ ఆదాయం కావాలంటే రెండు మార్గాలున్నాయి. మొదటిది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయడం. ఇక రెండోది ఏదైనా బ్యాలన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడం. ఎన్‌పీఎస్(నేషనల్ పెన్షన్ సిస్టమ్)..రిటైర్మెంట్ అవసరాల కోసం సులభంగా ఉండే ప్లాన్ ఇది. ఈ మూడు లక్షలను ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయండి. అంతే కాకుండా మీరు పనిచేసినంత కాలమూ మీరు పొందే ఆదాయంలో నెలకు కొంత మొత్తాన్ని ఎన్‌పీఎస్‌కు కేటాయించండి. మీకు 65 సంవత్సరాలు వచ్చే వరకూ మీరు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఆ తర్వాత ఎన్‌పీఎస్‌లో జమ అయిన మొత్తం మీకు పెన్షన్‌గా లభిస్తుంది. దీంట్లో 60 శాతం మాత్రమే మీకు ఒకేసారి ఏకమొత్తంగా తీసుకోవడానికి వీలవుతుంది. మిగిలిన దాంట్లో నెలకు కొంత మొత్తం చొప్పున మీకు పెన్షన్‌గా వస్తుంది. మీకు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేయడం ఇష్టం లేకపోతే, మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. మీరు మొదటిసారిగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కాబట్టి, ముందుగా బ్యాలన్స్‌డ్ ఫండ్‌ను ఎంచుకోండి. మీ దగ్గరున్న మొత్తం మూడు లక్షలను ఒకేసారి ఏక మొత్తంగా ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవద్దు. స్టాక్ మార్కెట్ సంబంధిత ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల్లో ఎప్పుడూ ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయకూడదనేది మొదటి సూత్రం. ఈ మూడు లక్షలను 12 భాగాలుగా చేసి, ఒక్కో భాగాన్ని ఒక నెల చొప్పున బ్యాలన్స్‌డ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. ప్రతి నెలా కొంత మొత్తం చొప్పున ఈ బ్యాలన్స్‌డ్ ఫండ్‌లో కనీసం ఏడు నుంచి ఎనిమిదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయండి. ఇలా చేస్తే మీరు రిటైరైన తర్వాత తగిన మొత్తంలో పెన్షన్ పొందగలిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలన్స్‌డ్, టాటా బ్యాలన్స్‌డ్, ఎస్‌బీఐ బ్యాలన్స్‌డ్ ఫండ్లను పరిశీలించవచ్చు.

వన్ టైమ్ మాండేట్(ఓటీఎమ్) అంటే ఏమిటి ?

– మేరీ, విజయవాడ

వన్ టైమ్ మాండేట్(ఓటీఎమ్) మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన సొమ్ములను చెల్లించే ఒక ప్రత్యామ్నాయ విధానం. మీరు ఒక మ్యూచువల్‌ఫండ్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ప్రతి నెలా కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేస్తున్నారనుకుందాం. ఆ మొత్తానికి సరిపడా చెక్కును ప్రతినెలా సదరు మ్యూచువల్ ఫండ్ సంస్థకు పంపించడమో, లేకపోతే సదరు మ్యూచువల్ ఫండ్ సంస్థకు వెళ్లి డబ్బులు చెల్లించడమో కొంత వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీనికి బదులుగా వన్‌టైమ్ మాండేట్ ద్వారా మీ సిప్ మొత్తాన్ని సులభంగా, సత్వరంగా సదరు మ్యూచువల్ ఫండ్ సంస్థకు చెల్లించవచ్చు. బ్యాంక్ ఖాతా నుంచి ఆ సిప్ మొత్తాన్ని డెబిట్ చేసుకునే అధికారాన్ని సదరు మ్యూచువల్ ఫండ్‌కు ఇవ్వడమే వన్ టైమ్ మాండేట్. ఈ ఓటీఎమ్ ఫెసిలిటి కోసం మీ బ్యాంక్‌లో నమోదు చేసుకోవాలి. మీ సిప్ మొత్తం రూ.10,000 లేదా రూ.5,000 ఇలా ఎంత మొత్తంలో మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారో, అంత మొత్తాన్ని సదరు మ్యూచువల్ ఫండ్ సంస్థ మీ బ్యాంక్ ఖాతా నుంచి డెబిట్ చేసుకొని ఫండ్ మేనేజర్ వ్యూహాల ప్రకారం ఇన్వెస్ట్ చేస్తుంది. ఓటీఎమ్ దరఖాస్తును తీసుకొని, సంబంధిత వివరాలు, మీ బ్యాంక్ ఖాతా, చెల్లించాల్సిన మొత్తం, ఎన్ని నెలలు తదితర వివరాలను నింపి, బ్యాంక్‌కు సమర్పిస్తే సరిపోతుంది.

Q & A




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

33,650పైన ముగిస్తేనే...

మార్కెట్ పంచాంగం


ఐదు వారాల నుంచి ఒడుదుడుకులకు లోనవుతున్న ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు..పతనం వెంటనే కొంతవరకూ కోలుకుంటున్నప్పటికీ, భారత్ మార్కెట్ మాత్రం చిన్న పెరుగుదలలో సైతం అమ్మకాల ఒత్తిడిని చవిచూస్తున్నది. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ నాలుగు దఫాలు వడ్డీ రేట్లు పెంచవచ్చన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్...ఉక్కు, అల్యూమినియం లోహాలపై దిగుమతి సుంకాన్ని ప్రతిపాదించి...ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి తెరతీయడం వంటి అంశాల నుంచి అమెరికా ఈక్విటీ మార్కెట్ త్వరితంగా కోలుకుని కనిష్టస్థాయి నుంచి 70 శాతం వరకూ ర్యాలీ చేయగలిగింది. అలాగే ఇతర ప్రపంచ ప్రధాన మార్కెట్లయిన జపాన్, హాంకాంగ్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బ్రెజిల్ వంటివి కూడా శరవేగంగా రికవరీ కాగలిగాయి. ముఖ్యంగా ఈ వారం ప్రపంచ మార్కెట్లను మన మార్కెట్ అనుసరించలేకపోతే...ఇక్కడ సాంకేతిక అమ్మకాలు మరింత వెల్లువెత్తే ప్రమాదం వుంటుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇక ప్రధాన సూచీల సాంకేతిక అంశాలు ఇలా వున్నాయి...

సెన్సెక్స్ సాంకేతికాలు..



మార్చి 9తో ముగిసిన వారం ప్రథమార్థంలో.. ఫిబ్రవరి తొలివారంలో నమోదైన 33,483 పాయింట్ల కనిష్టస్థాయిని కూడా ఛేదించి 32,991 పాయింట్ల కనిష్టస్థాయికి బీఎస్ఈ సెన్సెక్స్ పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో 740 పాయింట్ల నష్టంతో 33,307 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా సూచీలు రికార్డు ర్యాలీ జరిపిన ప్రభావంతో ఈ సోమవారం మన మార్కెట్ గ్యాప్‌అప్‌తో మొదలైతే సెన్సెక్స్‌కు 33,650 పాయింట్ల వద్ద తక్షణ అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం వుంటుంది. అలా జరిగితే 34,060 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ స్థాయిని ఛేదించగలిగితే 34,320 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ సోమవారం తొలి నిరోధంపైన స్థిరపడలేకపోతే 32,990 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయి దిగువన 200 డీఎంఏ రేఖ సంచరిస్తున్న 32,745 పాయింట్ల స్థాయి మరో కీలక మద్దతు. ఈ స్థాయిని కూడా కోల్పోతే 32,600 పాయింట్ల వరకూ పతనం కొనసాగే ప్రమాదం వుంటుంది.

నిఫ్టీ 10,325 పైన ముగిస్తే...



గతవారం గ్యాప్‌డౌన్‌తో మొదలైన ఎన్ఎస్ఈ నిఫ్టీ...ఫిబ్రవరి 3న నమోదైన 10,276 పాయింట్ల కనిష్టస్థాయిని కోల్పోయి 10,140 పాయింట్ల వరకూ క్షీణించింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 232 పాయింట్ల నష్టంతో 10,227 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం పాజిటివ్‌గా మార్కెట్ మొదలైతే నిఫ్టీకి 10,325 పాయింట్ల వద్ద తొలి నిరోధం ఏర్పడవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ జరిగి 10,450 పాయింట్ల స్థాయికి చేర్చగలుగుతుంది. అటుపైన ముగిస్తే 10,535 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం తొలి అవరోధ స్థాయిపైన నిఫ్టీ ముగియలేకపోతే...200 డీఎంఏ రేఖ కదులుతున్న 10,140 పాయింట్ల వద్దకు తిరిగి తగ్గవచ్చు. ఈ లోపున ముగిస్తే 10,075 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఆ లోపున 10,030 పాయింట్ల స్థాయిని పరీక్షించే ప్రమాదం వుంటుంది.

– పి. సత్యప్రసాద్

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 12-3-2018



నంబర్‌వన్ ర్యాంక్‌కు అడుగు దూరంలో...

భారత మహిళా రెజ్లర్ నవ్‌జ్యోత్ కౌర్ నంబర్‌వన్ ర్యాంక్‌కు కేవలం అడుగు దూరంలో నిలిచింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో నవ్‌జ్యోత్ కౌర్ 65 కేజీల విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఇటీవల ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా ఘనత సాధించిన నవ్‌జ్యోత్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్. 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ కూడా రెండో స్థానంలో ఉండటం విశేషం.

లంక పని పట్టాలి!

ఆత్మవిశ్వాసంతో భారత్ ◆ జోరుమీదున్న ధావన్ ◆ నేడు శ్రీలంకతో పోరు



రోహిత్

కొలంబో: నిదహస్ ట్రోఫీలో ఫైనలే లక్ష్యంగా ఆతిథ్య శ్రీలంకతో పోరుకు భారత్ సిద్ధమైంది. ఈ టోర్నీలో మూడు జట్లు ఒక్కో గెలుపోటములతో ఉండటంతో అందరిని ఫైనల్ బెర్తు ఊరిస్తోంది. ఈ నేపథ్యంలో రన్‌రేట్‌పైనో, మరో జట్టు జయాపజయాలతోనో సంబంధం లేకుండా... తమ శక్తిసామర్థ్యాలతోనే టైటిల్ పోరుకు అర్హత సాధించాలంటే సోమవారం జరిగే మ్యాచ్‌లో టీమిండియా గెలవాల్సిందే. ఈ ముక్కోణపు టి20 టోర్నీలో ఇప్పటి వరకైతే భారత్ బ్యాటింగ్ ఫర్వాలేదు. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌తో పాటు, నిలకడలేని బౌలింగ్ జట్టు యాజమాన్యాన్ని కలవరపరుస్తోంది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో లంక ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా కాపాడుకోలేకపోయింది. రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ వేటు పడటంతో చండిమాల్ స్థానంలో తిసారా పెరీరా లంకకు సారథ్యం వహించనున్నాడు.

రోహిత్ చెలరేగాలి...

కోహ్లి గైర్హాజరీలో పగ్గాలు చేపట్టిన రోహిత్ శర్మ వ్యక్తిగతంగా గత రెండు టి20ల్లోనూ ఘోరంగా విఫలమయ్యాడు. ఆతిథ్య జట్టుతో కీలకమైన ఈ మ్యాచ్‌లో అతను రాణిస్తే తిరిగి పుంజుకునే అవకాశముంది. సూపర్ ఫామ్‌లో ఉన్న ధావన్‌కు రో'హిట్స్' జతయితే జట్టు భారీస్కోరు ఖాయమవుతుంది. టి20ల్లో ధావన్ ఫామ్ అద్భుతంగా కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా పర్యటనలో చెలరేగిన అతను ఈ టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీలు బాదాడు. మనీశ్ పాండే అతనికి అండగా నిలిచాడు. నిలకడగా ఆడిన పాండే రెండు మ్యాచ్‌ల్లోనూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేశాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైన రైనా బంగ్లాపై ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రాహుల్‌కు అవకాశం ఇస్తే...పంత్ బెంచ్‌కు పరిమితం కావొచ్చు. బౌలింగ్ విభాగం కూడా కెప్టెన్ ఫామ్‌లాగే టీమ్ మేనేజ్‌మెంట్‌లో ఆందోళన పెంచుతోంది. ఉనాద్కట్ గత మ్యాచ్‌లో 3 వికెట్లు తీసినప్పటికీ తొలిపోరులో చేతులెత్తేశాడు. చహల్ మ్యాజిక్ కూడా ఇక్కడ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. కొత్తగా జట్టులోకి వచ్చిన విజయ్ శంకర్ బంగ్లాపై రెండు వికెట్లు తీసి ఫర్వాలేదనిపించాడు. అయితే సమష్టిగా రాణిస్తేనే భారీస్కోర్లు చేస్తున్న శ్రీలంకను నిలువరించగలం. లేదంటే తొలి మ్యాచ్ ఫలితం పునరావృతమయ్యే అవకాశముంది.

లంక బలం కూడా బ్యాటింగే...

ఈ టోర్నీలో శ్రీలంక బ్యాటింగ్ అద్భుతం. తొలి మ్యాచ్‌లో భారత్ తమ ముందుంచిన లక్ష్యాన్ని ఛేదించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో రెండొందల పైచిలుకు స్కోరు చేసింది. ఫలితం నిరాశపరిచినప్పటికీ ఓవరాల్‌గా బ్యాటింగ్ ఫామ్ స్థిరంగా ఉంది. ముఖ్యంగా కుశాల్ పెరీరా స్ట్రయిక్‌రేట్ అసాధారణంగా ఉంది. ఇద్దరు ప్రత్యర్థులపైనా అతను రెండు మెరుపు అర్ధశతకాలు సాధించాడు. అతనితో పాటు కుశాల్ మెండిస్ గత మ్యాచ్‌లో కనబరిచిన జోరు భారత బౌలర్లకు మింగుడు పడని అంశమే. వీరికి గుణతిలక, తరంగలు కూడా జతయితే ప్రత్యర్థి బౌలర్లకు కష్టాలు తప్పవు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాహుల్/రిషభ్ పంత్, మనీశ్‌పాండే, దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, చహల్, విజయ్ శంకర్, శార్దుల్ ఠాకూర్, ఉనాద్కట్.

శ్రీలంక: తిసారా పెరీరా (కెప్టెన్), లక్మల్, తరంగ, గుణతిలక, కుశాల్ మెండిస్, షనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, నువాన్ ప్రదీప్, చమీర, ధనంజయ డిసిల్వా.

పిచ్, వాతావరణం

ఈ టోర్నీలో జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఛేజింగ్ చేసిన జట్లే గెలిచాయి. పిచ్ మరోసారి బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. రాత్రివేళలో వర్షం కురిసే అవకాశం ఉంది.

స్లో ఓవర్‌రేట్... చండిమాల్ సస్పెన్షన్

స్లో ఓవర్‌రేట్ కారణంగా శ్రీలంక సారథి చండిమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించారు. దీంతో అతను నేటి మ్యాచ్‌తో పాటు, 16న బంగ్లాదేశ్‌తో పోరుకూ దూరమయ్యాడు. బంగ్లాతో శనివారం జరిగిన పోరులో లంక నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తిచేయలేకపోయింది. ఆదివారం కెప్టెన్ చండిమాల్ మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్‌కు వివరణ ఇచ్చిన అనంతరం ఆయన 'సీరియస్ స్లో ఓవర్‌రేట్' కావడంతో శిక్ష ఖరారు చేశారు. సస్పెన్షన్‌తో పాటు సహచరులపై పది శాతం జరిమానా పడింది. ఈ 12 నెలల్లో మరోసారి ఇది పునరావృతమైతే ఏకంగా రెండు టెస్టులు లేదంటే నాలుగు వన్డేలు/నాలుగు టి20ల సస్పెన్షన్ వేటు పడుతుంది. బంగ్లా సారథి మహ్ముదుల్లాపై కూడా స్లో ఓవర్‌రేట్ కారణంగా 20 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు.

వహ్వా... అఖిల్

- ప్రపంచకప్ షూటింగ్‌లో పసిడి పతకం
- రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో అగ్రస్థానం



గ్వాడలహారా (మెక్సికో): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత గన్ మళ్లీ గర్జించింది. నాలుగో స్వర్ణంతో మెరిసింది. పురుషుల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో మేటి షూటర్లు బరిలో ఉండగా... కెరీర్‌లో కేవలం రెండో ప్రపంచకప్ ఆడుతోన్న 22 ఏళ్ల అఖిల్ షెరాన్ అద్భుతమే చేశాడు. ఎలాంటి ఒత్తిడిని దరిచేరనీయకుండా ఆడుతూ అందర్నీ బోల్తా కొట్టించి ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువ షూటర్ గురికి భారత్ ఖాతాలో నాలుగో పసిడి పతకం వచ్చి పడింది. అఖిల్‌తోపాటు భారత్‌కే చెందిన సంజీవ్ రాజ్‌పుత్, స్వప్నిల్ కుసాలే ఫైనల్‌కు చేరారు. అఖిల్ 455.6 పాయింట్లతో విజేతగా నిలువగా... బెర్నాడ్ పికిల్ (ఆస్ట్రియా–452 పాయింట్లు) రజతం, ఇస్త్‌వాన్ పెని (హంగేరి–442.3 పాయింట్లు) కాంస్యం సాధించారు. 430.9 పాయింట్లతో సంజీవ్ రాజ్‌పుత్ నాలుగో స్థానంలో... 407.2 పాయింట్లో స్వప్నిల్ ఆరో స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌కిది తొమ్మిదో పతకం. ఇందులో నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

అంతర్జాతీయ షూటింగ్‌లో 38 పతకాలు గెలిచిన హంగేరి దిగ్గజం పీటర్ సిడి, రియో ఒలింపిక్ కాంస్య పతక విజేత అలెక్సిక్ రెనాల్డ్ (ఫ్రాన్స్), ఎయిర్ రైఫిల్‌లో పసిడి పతకం నెగ్గిన ఇస్త్‌వాన్ పెని (హంగేరి)లాంటి మేటి షూటర్లు బరిలో ఉండగా... అఖిల్ సంయమనంతో షూట్ చేసి అనుకున్న ఫలితం సాధించాడు. క్వాలిఫయింగ్‌లో త్రీ పొజిషన్స్ (మోకాళ్లపై కూర్చొని, ముందుకు వాలి, నిలబడి)లో భాగంగా షూటర్లు ఒక్కో విభాగంలో 40 చొప్పున షాట్‌లు సంధించారు. 1174 పాయింట్లతో అఖిల్ నాలుగో స్థానంలో, 1176 పాయింట్లతో రాజ్‌పుత్ రెండో స్థానంలో, 1168 పాయింట్లతో స్వప్నిల్ ఏడో స్థానంలో నిలిచి ఎనిమిది మందితో కూడిన ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించారు. ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అఖిల్ చివరిదాకా నిలకడగా పాయింట్లు స్కోరు చేశాడు. చివరి షాట్‌లో అఖిల్ అత్యుత్తమంగా 10.8 స్కోరు చేయడం విశేషం. మరోవైపు మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో మను భాకర్ ఐదో స్థానంలో నిలిచింది.

పేస్ పునరాగమనం

ఏడాది తర్వాత జట్టులో చోటు ● చైనాతో ఏప్రిల్‌లో భారత్ డేవిస్ కప్ మ్యాచ్



న్యూఢిల్లీ: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్‌కు డేవిస్ కప్ జట్టులో చోటు దక్కింది. ఏప్రిల్ 6, 7 తేదీల్లో చైనాతో జరిగే పోరు కోసం అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ఆదివారం జట్టును ప్రకటించింది. ఇందులో 44 ఏళ్ల పేస్‌తో పాటు యూకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్, సుమిత్ నాగల్, రోహన్ బోపన్నలు ఉన్నారు. దివిజ్ శరణ్ రిజర్వ్ సభ్యుడిగా ఉంటాడు. గత ఏప్రిల్‌లో ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్–1 పోరుకు పేస్‌ను పక్కన పెట్టారు. అయితే ఇటీవలే దుబాయ్ ఓపెన్‌లో పేస్ రన్నరప్‌గా నిలిచి డబుల్స్ ర్యాంకుల్లో మళ్లీ టాప్–50లో చోటు దక్కించుకున్నాడు.

'రోహన్ బోపన్నకు పేస్‌తో జతకట్టడం ఇష్టం లేదు. అవసరమైతే అతను చైనాతో జరిగే మ్యాచ్ నుంచి వైదొలిగేందుకు సిద్ధంగా ఉన్నాడు' అని నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి సెలక్షన్ కమిటీ చైర్మన్‌కు లేఖ రాశారు. అయితే భూపతి లేఖను, బోపన్న విజ్ఞప్తిని సెలెక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. 'బోపన్న ప్రభుత్వం నుంచి నిధులు పొందుతున్నాడు. అలాంటి వ్యక్తి సొంత విషయాల కోసం దేశం తరపున ప్రాతినిధ్యం వహించడానికి వెనుకాడితే ఏఐటీఏ ఆ ఆటగాడిని ప్రోత్సహించదు. ఏడాదిలో రెండు లేదా మూడు సార్లు దేశం కోసం ఆడే అవకాశం లభిస్తుంది. అన్ని విషయాలను పక్కనబెట్టి రెండువారాల పాటు దేశం కోసం కలిసి ఆడలేరా? కెప్టెన్ భూపతి అభిప్రాయం ప్రకారం వారిద్దరి మధ్య (పేస్, బోపన్న) సఖ్యత లేదు. ఈ విషయంలో బోపన్నను ఒప్పించే బాధ్యత పేస్‌దే. అతను మాత్రమే ఈ పని చేయగలడు' అని ఏఐటీఏ అధికారి వివరించారు. మరో మ్యాచ్ గెలిస్తే పేస్ డేవిస్‌కప్‌లో అత్యధిక డబుల్స్ మ్యాచ్‌లు నెగ్గిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు.

> భారత జట్టులోకి తిరిగి రావడం ఆనందంగా ఉంది. కొంత కాలంగా బాగా శ్రమిస్తూ ర్యాంక్ మెరుగు పరుచుకున్నా. బోపన్నతో కలిసి ముందుకు సాగాలని భావిస్తున్నా. ఓ ఆటగాడిగా బోపన్న ప్రతిభను గౌరవిస్తాను. మేమిద్దరం కలిసి మంచి ప్రదర్శన చేస్తాం.
> **-పేస్**

డివిలియర్స్ సెంచరీ

- దక్షిణాఫ్రికాకు ఆధిక్యం
- ఆస్ట్రేలియాతో రెండో టెస్టు



పోర్ట్ ఎలిజబెత్: ఏబీ డివిలియర్స్ (126 నాటౌట్; 20 ఫోర్లు, 1 సిక్స్) సూపర్ సెంచరీకి లోయర్ ఆర్డర్ పోరాటం తోడవడంతో ఆస్ట్రేలియాతో జరుగుతోన్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా కీలక ఆధిక్యం సాధించింది. మిడిలార్డర్ విఫలమైన చోట టెయిలెండర్లతో కలిసి డివిలియర్స్ సఫారీలకు తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగుల ఆధిక్యాన్ని సాధించి పెట్టాడు. అనంతరం రబడ (3/38) మరోసారి రెచ్చిపోవడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు 41 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిచెల్ మార్ష్ (39 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), పైన్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. వీరిద్దరు నాలుగో రోజు ఉదయం ఎలా బ్యాటింగ్ చేస్తారనే దానిపైనే ఆసీస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 263/7తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికాను డివిలియర్స్ ఆదుకున్నాడు. ఫిలాండర్ (36; 5 ఫోర్లు)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 84 పరుగులు, మహరాజ్ (30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో తొమ్మిదో వికెట్‌కు 58 పరుగులు జోడించడంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 382 పరుగులు సాధించింది. ప్రత్యర్థి బౌలర్లలో కమిన్స్‌కు 3, హాజల్‌వుడ్, మిచెల్ మార్ష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన కంగారూలను రబడ మరోసారి వణికించాడు. వార్నర్ (13), ఖాజా (75; 14 ఫోర్లు), షాన్ మార్ష్ (1)లను వెనక్కి పంపాడు. 86 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన సమయంలో ఖాజా, మిచెల్ మార్ష్ ఐదో వికెట్‌కు 87 పరుగులు జోడించడంతో ఆసీస్ కోలుకోగలిగింది.

కోర్టు బయట పరిష్కరించుకుంటాం: షమీ





న్యూఢిల్లీ: తన భార్యతో తలెత్తిన వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భారత క్రికెటర్ మొహమ్మద్ షమీ తెలిపాడు. తన భర్త మోసగాడని, పలువురి మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడని, తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని షమీ భార్య హసీన్ జహాన్ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గృహహింస, హత్యాయత్నం కింద షమీపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. 'ఈ సమస్యపై చర్చించి పరిష్కరించుకోవడం మినహా చేసేదేమీ లేదు. కోర్టు వెలుపల పరిష్కారం కనుగొనడమే నాకు, నా పాపకు, నా కెరీర్‌కు ప్రయోజనకరం. కోల్‌కతాకు వెళ్లి నా భార్యతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నా' అని మీడియాతో షమీ అన్నాడు. మరోవైపు అతని భార్య కూడా వివాద పరిష్కారానికే మొగ్గుచూపుతోంది. 'నేను అతని అనుచిత స్క్రీన్ షాట్స్, వాట్సాప్ మెసేజ్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాకే షమీ నిజ స్వరూపమేంటో బయటపడింది. అయితే ఇప్పటికీ అతను నిజాయతీగా తన తప్పులను సరిదిద్దుకుంటానంటే మా అనుబంధాన్ని కొనసాగించేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. సయోధ్యపై ఆలోచిస్తాను' అని హసీన్ తెలిపింది. 'అతని ఫోన్ నాకు దొరకడం, అందులో అభ్యంతరకర ఫొటోలు, చాటింగ్‌లు ఉండటం వల్లే షమీ మిన్నకుండిపోయాడు. లేదంటే ఇప్పటికే విడాకులిస్తానని కోర్టుకెక్కేవాడు' అని ఆమె చెప్పింది. మరోవైపు ఇప్పటికే బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టును కోల్పోయిన షమీకి ఐపీఎల్–11 సీజన్ కూడా చేజారే ప్రమాదముంది. అతను ప్రాతినిధ్యం వహిస్తున్న ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు షమీని ఆడించాలా వద్దా? అనే అంశంపై బోర్డు అనుమతి కోరింది. బీసీసీఐ నిర్ణయం కోసం వేచిచూస్తున్నట్లు ఢిల్లీ ఫ్రాంచైజీ సీఈఓ హేమంత్ దువా వెల్లడించారు.

'డ్రా'తో ముగింపు

సిరీస్ 3–1తో భారత్ సొంతం

సియోల్: దక్షిణ కొరియా మహిళల హాకీ జట్టుతో జరిగిన చివరిదైన ఐదో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న భారత జట్టు 3–1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌కు ముందే సిరీస్ ఖాయం చేసుకున్న రాణి రాంపాల్ బృందం నామమాత్రమైన ఐదో మ్యాచ్‌ను 1–1తో 'డ్రా'గా ముగించింది. తొమ్మిదో ర్యాంకర్ కొరియాతో ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ తరపున వందన (48వ ని.లో), ప్రత్యర్థి జట్టు నుంచి బోమీ కిమ్ (50వ ని.లో) చెరో గోల్ చేశారు.

భారత్ X ఆస్ట్రేలియా

మహిళల క్రికెట్ తొలి వన్డే; వడోదర
ఉదయం 9 గంటల నుంచి
స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

● కావేరి అభివృద్ధి మండలి, పర్యవేక్షణ కమిటీ సాధన కోసం కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా తమిళనాడు ఎంపీలందరూ తమ పదవులకు రాజీనామా చేయాలని మక్కల్‌నిధి మయ్యం అధినేత కమల్ హాసన్ డిమాండ్ చేశారు. రెండో రోజు ఆదివారం ఈరోడ్‌లో ఆయన పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెప్పారు.

ప్రభుత్వాలు రైతు సంక్షేమంపై దృష్టి పెట్టాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

కొర్నెపాడు(వట్టిచెరుకూరు): ప్రభుత్వాలు రైతు సంక్షేమంపై మరింత దృష్టి పెట్టాలని.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించినప్పుడే రైతు కుటుంబాలు సంతోషంగా ఉంటాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన గోశాల, భూసార పరీక్షా కేంద్రం, సహజ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను జస్టిస్ జాస్తి చలమేశ్వర్, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యవస్థలోని లోపాల వల్లే ధరలు పతనమవుతున్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో కూడిన సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు. పదవీ విరమణ తర్వాత తనకున్న 17 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తానని చెప్పారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ కోసం రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ రైతులు, జర్నలిస్టులను సన్మానించారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి, మదనపల్లి ప్రాకృతిక రైతు ఎం.సి.వి.ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోట జానయ్య, ఎంపీపీ గోబిదేశి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సాగుబడి ఇన్‌చార్జ్ పంతంగి రాంబాబును సన్మానిస్తున్న జస్టిస్ జాస్తి చలమేశ్వర్, మంత్రి సోమిరెడ్డి

షేర్లలో పెట్టుబడులంటూ రూ.300 కోట్లకు టోకరా

● బెంగళూరులో మదుపరులకు కుచ్చుటోపి పెట్టిన ఓ సంస్థ

● బాధితుల్లో రాహుల్ ద్రవిడ్, ప్రకాశ్ పదుకొణే కూడా..

బనశంకరి (బెంగళూరు): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో బెంగళూరులోని ఓ సంస్థ మదుపుదారులకు రూ.300 కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టింది. బాధితుల్లో క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ వంటి ప్రముఖులు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఆదివారం నలుగురిని అరెస్టు చేశారు. విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రాఘవేంద్ర శ్రీనాథ్ అనే వ్యక్తి బనశంకరి, యశ్వంతపురలో ఓ కంపెనీని నడుపుతున్నాడు. దీనికి సూత్రం సురేశ్ అనే మాజీ క్రీడాకారుడు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరూ ప్రముఖ క్రీడాకారులు, రాజకీయవేత్తలు, సినీనటులను కలిసి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో కోట్లాది రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. క్రికెటర్ రాహుల్ ద్రవిడ్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాష్ పదుకొణె తదితరులతో ఒక్కొక్కరి నుంచి రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్లు మేర పెట్టుబడులు పెట్టించుకున్నారు. వందలాది మంది నుంచి భారీగా నగదును సేకరించారు. ఈ మొత్తం రూ.300 కోట్ల మేర ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

ఏనుగుల దాడిలో యువకుడు మృతి

కొత్తూరు: ఏనుగులను దగ్గరగా చూడాలన్న కోరిక ఒక యువకుడి ప్రాణాలు బలి తీసుకుంది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం రాయల పంచాయతీ పరిధి టింపటగూడలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. టింపటగూడకు చెందిన కుమార్(20) మండల పరిధిలోని పొన్నుటూరు వద్దనున్న చెరుకు తోటల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని తెలిసి శనివారం సరదాగా చూడటానికి వెళ్లాడు. తోట లోపలకు వెళ్లిన కుమార్ చీకటి పడినా ఇంటికి తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అయితే ఏనుగుల భయంతో రాత్రి వెతకడానికి తోటలోకి వెళ్లలేకపోయారు. ఆదివారం ఉదయం అటవీ సిబ్బందితో పాటు కుమార్ కుటుంబ సభ్యులు చెరుకు తోటల్లోకి వెళ్లి చూడగా అతని మృతదేహం కనిపించింది. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి శాంతి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

PUBLISHED AND PRINTED BY K.RAMACHANDRA MURTHY, EDITORIAL DIRECTOR, ON BEHALF OF JAGATI PUBLICATIONS LIMITED, PUBLISHED AT PHASE – 2, PLOT NO. 06, 100 FEET ROAD, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA DISTRICT – 520 007 (AP) AND PRINTED AT JAGATI PUBLICATIONS LIMITED, PHASE – 2, PLOT NO. 06, 100 FEET ROAD, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA DISTRICT – 520 007 (AP), AND D. NO. 5- 625, VADLAMUDI ROAD, ATMAKUR VILLAGE, MANGALAGIRI MANDAL, GUNTUR DIST-522 503. EDITOR: V. MURALI, PHONE NO : 0863-2512581 FAX NO: 0863-2512584, RNI REGN NO. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం, 12-3-2018

'న్యూ'స్

కుర్ర విటమిన్

మంచి ఆరోగ్యానికి అన్ని విటమిన్లతో పాటు విటమిన్–కె కూడా చాలా అవసరం. అయితే, చాలా మంది విటమిన్–కె లోపంతో బాధపడుతుంటారు. విటమిన్–కె లోపం తీవ్రంగా ఉన్నట్లయితే రక్తం గడ్డ కట్టడంలో ఇబ్బందులు తలెత్తి, గాయాల పాలైనప్పుడు ప్రాణాంతక పరిస్థితులు తలెత్తుతాయని ఇప్పటికే తెలిసిన సంగతే. అయితే, విటమిన్–కె వార్ధక్య నివారణలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా విటమిన్–కెలో భాగమైన విటమిన్–కె2 ఉన్న ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకుంటున్నట్లయితే, గుండె ఆరోగ్యం మెరుగు పడుతుందని, ధమనులు బిరుసెక్కే పరిస్థితి తలెత్తకుండా ఉంటుందని, జీర్ణ సమస్యలు దరిచేరకుండా ఉంటాయని, అంతేకాకుండా, చర్మం ఆరోగ్యంగా యవ్వనకాంతితో మిసమిసలాడుతూ ఉంటుందని పోషకాహార నిపుణురాలు, 'హెల్తిస్టా' సంపాదకురాలు ఆనా మాగీ తన పరిశోధక వ్యాసంలో వెల్లడించారు. బ్రకోలి, ఆకుకూరలలో పుష్కలంగా లభించే విటమిన్–కె2 వార్ధక్యాన్ని వాయిదా వేయగలదని ఆమె తన వ్యాసంలో వివరించారు.



హేమమాలిని (69) : ప్రతీకాత్మక చిత్రం

కౌంటర్ వ్యూ

అన్నయ్యే వచ్చి కాపాడాలా?

నిండుసభలో ద్రౌపదికి దుశ్శాసనుడు వస్త్రాపహరణం చేస్తున్న సమయంలో సాక్షాత్తు ఆమె సోదర సమానుడైన శ్రీకృష్ణుడు వచ్చి ఆమెను కాపాడాడు. నిజానికి ద్రౌపది తనను తాను రక్షించుకోలేని శక్తిహీనురాలు కాదు. ఆ సమయంలో ఆమె ఏకవస్త్ర. అందువల్ల శరణు వేడింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాజస్తాన్



● రాజస్తాన్ ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ సుమన్ శర్మ

ఉమెన్స్ కమిషన్ చైర్‌పర్సన్ సుమన్ శర్మ ప్రసంగిస్తూ, ''చెవులకు రింగులు పెట్టుకుని, లో వెయిస్ట్ జీన్స్ వేసుకుంటున్న మగపిల్లలు, వారి చెల్లెళ్లను, అక్కలను ఎలా కాపాడగలరు? ఒకప్పుడు మగవారు విశాలమైన ఛాతీతో, కండలు తిరిగిన భుజాలతో బలంగా ఉండేవారు. వారిని చూడగానే అమ్మాయిలను ఏడిపించడానికి పోకిరీలు భయపడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు'' అంటూ మగపిల్లల శారీరక దారుఢ్యం గురించి వ్యాఖ్యానించారు.

నిజమే.. ఒకప్పుడు అమ్మాయిలు ఎవరైనా పోకిరీలు తమను టీజ్ చేస్తుంటే, వెంటనే అన్నయ్యలనో, తండ్రులనో వెంటపెట్టుకుని వచ్చి, బెదిరించేవారు. ఇప్పుడు అమ్మాయిలకు ఎవ్వరి అవసరం లేదు. వారి సమస్యలను వారే పరిష్కరించుకోగల స్థితికి ఎదిగారు. శారీరక బలంతో పాటు, మానసిక బలం కూడా పెంచుకున్నారు. మరి సుమన్ శర్మ వ్యాఖ్యలను ఎలా తీసుకోవాలి? 'అబ్బాయిలు బలహీనంగా ఉంటేనేం, వాళ్లను కాపాడే బలం అమ్మాయిలకు ఉన్నప్పుడు?..' అనుకుంటే సరి.



మానవ జాతి మీదే వెగటు పుట్టించే దారుణం ఇది. నిత్యం అంతర్యుద్ధంతో రక్తం ఓడుతున్న సిరియాలో.. కుటుంబం ఆకలి తీర్చేందుకు సరుకులకోసం సహాయక కేంద్రాలకు వెళుతున్న మహిళలపై కూడా లైంగిక దోపిడీ జరుగుతోంది! 'నా కోరిక తీరిస్తే నీ కుటుంబం ఆకలి తీరుస్తా'నని దళారులు బేరం పెట్టడాన్ని ఐక్యరాజ్యసమితి సైతం నివ్వెరపోయి చూస్తోంది.

● సహాయక కేంద్రం వెలుపల బిడ్డను ఎత్తుకుని సంశయంగా నిలుచుండిపోయిన సిరియన్ మహిళ

కోరిక తీరిస్తేనే ఆకలి తీరేది!

ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) కబంధ హస్తాల నుంచి విముక్తమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సిరియాలో ఇప్పటికీ మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. నేటికీ అక్కడ కొనసాగుతున్న అంతర్యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి అందే మానవతా సహాయానికి 'ప్రతిఫలం'గా మహిళలు లైంగిక దాడులకు గురవుతున్నట్టుగా తాజాగా వెలుగులోకి వచ్చింది!

ఉప్పుకీ పప్పుకీ లైంగిక దోపిడీ!

ఐరాస, ఇతర అంతర్జాతీయ సేవా సంస్థలు సిరియాకు వివిధ రూపాల్లో ఇచ్చే ఉచిత సహాయం పొందేందుకు మధ్యదళారులకు ఆ దేశ యువతులు, బాలికలు తమను తాను సమర్పించుకోవాల్సిన అమానవీయ స్థితి ఏర్పడింది! సిరియాలో కొన్ని ప్రాంతాల్లో ఇంకా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున అక్కడకు స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది చేరుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఐరాస, ఇతర సంస్థలిచ్చే సహాయాన్ని బాధితులకు చేరవేసే బాధ్యతను మధ్యదళారులు, స్థానిక అధికారులకు అప్పగిస్తున్నారు. యుద్ధ బీభత్సం కొనసాగుతున్న కారణంగా అక్కడి ప్రజలు.. ముఖ్యంగా మహిళలు, అమ్మాయిలకు పూట కింత తిండితో పాటు కనీస నిత్యావసరాలు దొరకని స్థితి ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకుని స్థానిక అధికారులు, మధ్యదళారి సంస్థల ప్రతినిధులు తాము అందించే సహాయానికి ప్రతిగా ఆ యువతులు తమ లైంగిక వాంఛను తీర్చేలా ఒత్తిడి తెస్తున్నారు! అందుకు అంగీకరించని బాధితులకు ఈ సహాయం అందకుండా నిలిపేస్తున్నారని, తమ దారికి వచ్చిన వారికే వాటిని ఇస్తున్నట్టుగా బీబీసీ వెల్లడించింది. ఇలాంటి వేధింపులు, ఉల్లంఘనలు జరుగుతున్నట్టుగా మూడేళ్ల క్రితమే హెచ్చరికలొచ్చాయి. అయినా సిరియాలోని దక్షిణ ప్రాంతంలో నేటికీ ఇవి కొనసాగుతున్నాయని తాజా నివేదికలో వెల్లడైంది.



● నిర్బంధ వివాహ బాధితులు

> ### ఆహారం కోసం స్వల్పకాల వివాహాలు!
>
> ''స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే రోజువారి ఆహారం కోసం యువతులు, అమ్మాయిలు పరిమిత కాలానికి వివాహాలు చేసుకుని అక్కడి అధికారులకు 'సెక్సువల్ సర్వీసెస్' అందిస్తున్నారు. సహాయాన్ని అందుకునేందుకు వచ్చే వారి ఫోన్ నెంబర్లు తీసుకోవడంతో పాటు వారిని ఇంటివరకు వాహనాల్లో వదిలిపెడుతున్నారు. తాము అందజేస్తున్న సహాయాలకు ప్రతిగా అధికారులు, ప్రతినిధులు కోరిక తీర్చుకుంటున్నారు'' అని వాయిస్ ఫ్రం సిరియా 2018 నివేదిక వెల్లడించింది. పురుషుల పరిరక్షణలో లేని మహిళలు, అమ్మాయిలతో పాటు భర్తను కోల్పోయిన, విడాకులు తీసుకున్న వారి పరిస్థితి మరింత అధ్వాన్నం అని పేర్కొంది. జోర్డన్‌లోని ఓ శరణార్థుల శిబిరంలో సిరియా మహిళ బృందం ఇలాంటి లైంగికదాడులకు గురైనట్లు మూడేళ్ల క్రితం మొదటిసారి బయటపడింది. దారా, క్యునీత్ర తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై తాను జరిపిన పరిశీలనల్లో ఇది యధార్థమేనని తేలిందని స్వచ్ఛంద సహాయ సలహాదారు డానియల్ స్పెన్సర్ తెలిపారు.

వెళ్లడానికే జంకుతున్నారు..!

సిరియాలో ఇలాంటి అనైతిక కార్యకలాపాలు పెచ్చు మీరడంతో అంతర్జాతీయ సేవా సంస్థల ద్వారా ఉచితంగా అందే సహాయాన్ని తీసుకునేందుకు కూడా మహిళలు జంకుతున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఈ అమానవీయ పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో ఈ సహాయ కేంద్రాలకు వెళ్లేందుకు అక్కడి మహిళలు నిరాకరిస్తున్నట్టు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు బీబీసీకి వెల్లడించారు. అక్కడి మగవారి కోరికలను తీర్చాకే ఈ సంస్థలిచ్చే సహాయాన్ని తాము వెంట తెచ్చుకున్నామని ఇతరులు భావించే అవకాశమున్నందున ఈ సరఫరా కేంద్రాలకు వెళ్లడం లేదని కొందరు యువతులు తెలిపారు. ఇలాంటి అకృత్యాలు సాగుతున్నా కొన్ని స్వచ్ఛంద సంస్థలు పట్టించుకోవడం లేదని ఓ ఉద్యోగి పేర్కొన్నాడు. సిరియాలో గవర్నర్ల పాలనలోని వివిధ ప్రాంతాల్లో మానవతా సహాయానికి ప్రతిగా లైంగిక దోపిడీ సాగుతున్నట్టుగా గత ఏడాదే ఐరాస జనాభా నిధి (యూఎన్‌ఎఫ్‌పీఏ) పరిశీలనలో తేలింది.



● సహాయ కేంద్రాలకు ఐక్యరాజ్యసమితి పంపిన నిత్యావసర సరుకులలో తన వంతుకు వచ్చిన ఆహార పదార్థాలను మోసుకెళుతున్న సిరియన్ మహిళ.

నివారణకు ఐరాస ప్రయత్నాలు

దక్షిణ సిరియాలో మహిళలు లైంగిక వేధింపులు, దోపిడీకి గురవుతున్నారనే ఆరోపణలపై యూఎన్‌ఎఫ్‌పీఏ, ఆక్స్‌ఫామ్ ప్రతినిధులు స్పందిస్తూ తాము స్థానిక కౌన్సిళ్ల ద్వారా సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదని స్పష్టం చేశాయి. తమ కార్యకలాపాలు నెరపుతున్న రెండు స్వచ్ఛంద సంస్థలపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని యూఎన్‌ఎఫ్‌పీఏ తెలిపింది. ఇలాంటి ఘటనల నివారణకు కొత్త విధానాలు ప్రవేశపెట్టినట్టు, ఎప్పటికప్పుడు ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు స్థానిక భాగస్వామ్య సంస్థలకు అవసరమైన శిక్షణనిస్తున్నట్టు ఐరాస శరణార్థుల హైకమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ప్రతినిధి పేర్కొన్నారు.

– కె.రాహుల్, సాక్షి నాలెడ్జ్ సెంటర్

ఉలిక్కిపడకండి!

అడవిలో అమ్మాయిలు

"అమ్మాయికి తోడుగా ఎవరు వెళ్తున్నారు?" ఒక అమ్మాయి పని మీద బయటకు వెళ్తుంటే నానమ్మ హెచ్చరిస్తుంది.

"అక్కకు తోడు వెళ్లరా" అని తమ్ముడిని పంపిస్తుంది అమ్మ.

ఈ 21వ శతాబ్దంలోనూ ఈ మాటలనే వింటుంటాం! అలాంటిది ఓ అమ్మాయి "నాకు ఉద్యోగం వచ్చింది నానమ్మా.. బీట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా" అంటే నానమ్మ ఉలిక్కిపడదా? ఆ ఉద్యోగానికి పంపించాలా వద్దా అని అమ్మానాన్న ఆలోచనలో పడరా? ఎవరు ఉలిక్కిపడినా, ఎవరు ఆలోచనలో పడినా.. ఈ అమ్మాయిలు వెనకడుగు వేయలేదు. ఇది మగవాళ్ల ఉద్యోగం అనే సామాజిక భ్రాంతిని మరొకసారి భళ్లున బద్దలు చేశారు.

కేరళలోని ఇడుక్కి జిల్లా, మరాయూర్ శ్రేణులు. వందల ఏళ్ల నాటి ఎత్తైన చందనపు వృక్షాలమయం. ఎప్పుడు స్మగ్లర్లు ఆ చందనపు దుంగలను నరికి తరలించుకుపోతారో తెలియదు. వేటగాళ్లు ఎప్పుడు పొంచి ఉండి జంతువుల మీద దాడి చేస్తారో ఊహించడం కష్టం. ఏ జంతువుకి ఎప్పుడు ఆకలవుతుందో, ఎప్పుడు మనుషులను ఓ చూపు చూస్తుందో ఆ దేవుడికే తెలియాలి. ఇలాంటి అడవులలో అడుగుపెట్టడానికి ఎవరైనా జంకుతారు. ఏ జగదేకవీరుడో తోడుగా వస్తే తప్ప ఇలాంటి చోటకు వెళ్లడానికి భయపడతారు మామూలుగా అమ్మాయిలు.

బీటెక్ చదివి ఫారెస్ట్ బీట్‌కు

''భయపడితే మేమూ మామూలు అమ్మాయిలమే అయ్యేవాళ్లం. కానీ మేము అంతకంటే కొంచెం ఎక్కువే. అందుకే ఆ అడవుల సంరక్షణ బాధ్యతను ధైర్యంగా తలకెత్తుకున్నాం'' అంటున్నారు అథిరా, శ్రీదేవి. కేరళలో బీట్ ఫారెస్ట్ ఆఫీసర్‌లుగా ఎంపికైన తొలి మహిళలుగా రికార్డు కూడా వీరిదే. ఈ ఏడాది జనవరిలో కేరళ ప్రభుత్వం 40 మంది బీట్ ఫారెస్ట్ ఆఫీసర్లను నియమించింది. వారంతా మహిళలే. వారిలో తొలి మహిళలు అథిర, శ్రీదేవి. ఇద్దరూ బీటెక్ గ్రాడ్యుయేట్లు. ప్రస్తుతం ఈ అమ్మాయిలు కుదుక్కాథరా డివిజన్‌లోని నచివాయల్ ఫారెస్ట్ స్టేషన్‌లో డ్యూటీ చేస్తున్నారు.



కేరళ ఫస్ట్ బ్యాచ్‌లోని బీట్ ఫారెస్ట్ ఆఫీసర్లు

> ### ఒక అడ్వెంచర్‌లా డ్యూటీ!
>
> 
>
> అథిర, శ్రీదేవి
>
> అథిర, శ్రీదేవి ఇద్దరూ రోజంతా అడవుల్లోనే సంచరిస్తుంటారు. సాయంత్రం ఆరు నుంచి తెల్లవారు జామున ఆరుగంటల వరకు డ్యూటీ. పగలు విశ్రాంతి కూడా అడవుల్లోనే. ఖాకీ దుస్తులు, జంగిల్ షూస్ వాళ్ల డ్రస్. బ్యాక్ ప్యాక్‌లో వాకీ టాకీ, ఫ్లాష్‌లైట్లు ఉంటాయి. ''ఈ డ్యూటీ చాలా అడ్వెంచరస్‌గా ఉంది. ఎంజాయ్ చేస్తున్నాం. అలాగే రాత్రిళ్లు ఎండుపుల్లలతో చలిమంట వేసుకున్నప్పుడు వచ్చే చందనపు పరిమళాలను కూడా'' అంటున్నారు వాళ్లు!

ప్రతి అడుగూ ఒక చాలెంజ్

ఆరువందల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ అడవుల్లో ఏ ఒక్క జోన్ కూడా భద్రమైనది కాదు. ఫారెస్ట్ ఆఫీసర్‌లు స్మగ్లర్లను, వేటగాళ్లను చూసీ చూడనట్లు వదిలేయాలి లేదా ప్రాణాలకు ఎదురొడ్డి ఉద్యోగం చేయాలి. అలాంటి చోట్ల విధులు నిర్వర్తించడం గురించి మాట్లాడుతూ.. ''ఇది సులభమైన ఉద్యోగం కాదు, ఆ సంగతి తెలుస్తూనే చాలెంజింగ్‌గా తీసుకున్నాం. కాబట్టి ఇప్పుడు వెనకడుగు వేయడం ఉండదు. అయితే క్షణక్షణం అప్రమత్తంగా ఉండాలని మాత్రం గుర్తు చేసుకుంటుంటాం'' అంటోంది శ్రీదేవి. ''భయాలను అధిగమించాం కాబట్టే ఈ ఉద్యోగంలోకి వచ్చాం. ప్రమాదాలనేవి లేనిదెక్కడ? ఇంట్లో ఉన్నా వచ్చేవి వస్తూనే ఉంటాయి. రోడ్డు మీద, బహిరంగ ప్రదేశాలు, ఆఫీస్‌లు అని చోట్లా ప్రమాదాలు ఎదురవుతూనే ఉంటాయి. వాటి నుంచి కాచుకుంటూ జీవిస్తుంటాం. అడవుల్లో ఎదురయ్యే ప్రమాదాలు అంతకంటే భయంకరమైనవేమీ కాదు'' అంటోంది అథిర.

– మంజీర

చెట్టు నీడ

అతిథి కోసం వెలిగిన దీపం

మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ఆస్థానానికి చాణక్యుడు ప్రధాన సలహాదారు. ఓ రాత్రి అతడు తన ఇంట్లో కూర్చొని, దీపం బుడ్డీ వెలుగులో రాజప్రాసాదానికి అవసరమైన పాలనా పత్రాలను లిఖిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో ఓ అతిథి చాణక్యుడి ఇంటికి వచ్చాడు. చాణక్యుడు అతడిని తన పక్కనే కూర్చోబెట్టుకుని, తన రాత పనిని త్వరత్వరగా ముగించాడు. తర్వాత వేరొక దీపపు బుడ్డీని వెలిగించి తెచ్చి ఆ అతిథి దగ్గర పెట్టాడు. ఆ వెంటనే అంతకు క్రితం వరకు ఏ దీపపు బుడ్డీ వెలుగులోనైతే తను రాస్తూ కూర్చున్నాడో ఆ బుడ్డీని ఆర్పేశాడు.

అతిథి ఆశ్చర్యపోయాడు!

> **ఆ సమయంలో ఓ అతిథి చాణక్యుడి ఇంటికి వచ్చాడు. చాణక్యుడు అతడిని తన పక్కనే కూర్చోబెట్టుకుని, తన రాత పనిని త్వరత్వరగా ముగించాడు.**

'ఇదేమైనా మీ ఇంటి ఆచారమా?'' అని అడిగాడు.

చాణక్యుడు నవ్వాడు. 'కాదు' అన్నాడు.

'మరేమిటి?' అని అడిగాడు ఆ అతిథి.

అప్పుడు చాణక్యుడు:

''నేను రాస్తున్నప్పుడు వెలుగుతూ ఉన్న దీపపు బుడ్డీలో ఉన్నది రాజప్రాసాదం ఇచ్చిన తైలం. అందుకని ఆస్థాన పత్రాలను ఆ వెలుగులో రాశాను. నువ్వు నా వ్యక్తిగత అతిథివి కనుక నీతో మాట్లాడ్డం కోసం నా ఇంట్లో ఉన్న తైలంతో వెలిగే దీపపు బుడ్డీని తెచ్చాను'' అని అన్నాడు.

అతిథి ఆశ్చర్యపోయాడు.

వృత్తి వల్ల ఒనగూడే ప్రయోజనాలతో ఇంటిని గడుపుకునేవారు మనకు చాలామంది కనిపిస్తూ ఉంటారు. అలా చెయ్యడం తప్పు అని, అనైతికం అని ఈ కథ నీతి. కథ నీతి కాదు. చాణక్య నీతి.

బ్యూటిప్

సింపుల్ ఫేస్ ప్యాక్స్



- నిర్జీవంగా, కాంతిహీనంగా మారినట్లున్న చర్మం మృదువుగా మారాలంటే కీరదోస కాయను పచ్చిపాలతో కలిపి గ్రైండ్ చేసి ప్యాక్ వేయాలి.
- ఒక టేబుల్ స్పూన్ చందనం పొడిని పన్నీటితో కలిపి ప్యాక్ వేస్తే చర్మసౌందర్యం ఇనుమడించడంతోపాటు ఎండ వేడి నుంచి ఉపశమనం ఉంటుంది. అయిలీ స్కిన్ అయితే ఇందులో కొద్దిగా నిమ్మరసం లేదా పుల్లటి పెరుగు కలుపుకోవచ్చు.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా...! నేను వంశీ అనే అబ్బాయిని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నా. తను కూడా నన్ను ప్రేమిస్తున్నాడు. మా నేపథ్యాలు వేరు. వాళ్ల ఇంట్లో అందరూ మా పెళ్లికి ఓకే అన్నారు. కానీ మా పేరెంట్స్ ఒప్పుకోవడంలేదు. పెళ్లి గురించి వాళ్లు మాట్లాడటానికి వస్తామంటే.. ''వాళ్లు వస్తే మేం చచ్చిపోతాం'' అని మా పేరెంట్స్ బెదిరిస్తున్నారు. ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవడం కుదరదని కచ్చితంగా చెబుతున్నారు. మా పేరెంట్స్ చిన్నప్పటి నుంచీ నాకు ఫ్రీడమ్ ఇవ్వలేదు. కానీ నేను ప్రేమించిన అబ్బాయి అన్నీ అర్థం చేసుకుని నన్ను చిన్న పిల్లలా చూసుకుంటాడు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు అన్నయ్యా. మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– రాణి

ఫ్రీడమ్ ఇస్తే భయమమ్మా...
కడుపు చింపుకొని కన్న అమ్మకు భయమమ్మా...
రక్తం కార్చి పెంచిన నాన్నకు భయమమ్మా...
నీకేమవుతుందోనని భయమమ్మా...
తెలియని వయసులో నువ్వు ఏ దుర్మార్గానికి గురి అవుతావోనని భయమమ్మా...
పగిలిన బంగారు తల్లిని ఎలా అతికించగలమని భయమమ్మా...

'సార్ ఇంత ఎమోషన్‌లో రాస్తే... ఇంకెవరూ మీకు రాయరు సార్. దుకాణం బంద్ చేసుకోవాల్సొస్తుంది. లవ్ డాక్టర్ బోర్డు విరిగిపోతే మళ్లీ అతికించుకోలేమని నాకు భయం సార్!!'

జోక్ చెయ్యకు నీలాంబరీ... రాణిని రాణిలా పెంచారు. అమ్మానాన్నలకు మళ్లీ చెప్పి చూడాలి.

'ఒప్పుకుంటారా సార్???'

ప్రాబ్లమ్ ఏంటంటే ఇంట్లో ఫ్రీడమ్ లేదని, వాడే ఫ్రీగా ఆడిస్తున్నాడని అమ్మాయి టెంప్ట్ అయిపోతుంది. అదే వాడి చెల్లెలు ఫ్రీగా.. చాలా ఫ్రీగా ఇంకో అబ్బాయితో తిరిగితే భరించగలడా? అమ్మాయి అర్థం చేసుకోవాలి. అన్నీ అమ్మానాన్న సమకూరుస్తుంటే ఏ పెంటగాడైనా ఫ్రీడమ్ ఇస్తాడు.

'కరెక్ట్ సార్.. రాణి బి కేర్ఫుల్!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

గొడవేంటి?


రవితేజ

వచ్చి, పోయే ప్రయాణికులతో రద్దీగా ఉందా రైల్వేస్టేషన్. అప్పుడే అక్కడికి ఎంట్రీ ఇచ్చారు హీరో రవితేజ. అప్పటి వరకూ ఫ్రెండ్స్‌తో సరదాగా జోకులేస్తున్న రవితేజ సడన్‌గా ఒకరితో గొడవ పడ్డారు. అసలు... గొడవేంటి? రవితేజ రైల్వేస్టేషన్‌కు ఎందుకు వెళ్లారు? అన్న అంశాలు తెలుసుకోవాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే. కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. మాళవిక శర్మ కథానాయిక. ఈ చిత్రానికి 'నేల టిక్కెట్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. రీసెంట్‌గా జరిగిన ఈ సినిమా షెడ్యూల్‌లో రైల్వే స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సన్నివేశాల్లో మాళవిక శర్మ, అలీ పాల్గొన్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు రాజకీయనాయకుడి పాత్రలో, నటుడు సంపత్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారని సమాచారం.

తాత పాత్రలో మనవడు


నాగచైతన్య

అలనాటి అందాల తార సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా 'మహానటి' సినిమా రూపొందనుందంటూ ప్రకటన చేసినప్పటి నుంచి అటు సినీ అభిమానుల్లో ఇటు చిత్ర వర్గాల్లోనూ తెగ ఆసక్తి నెలకొంది. సావిత్రి సినీ కెరీర్‌లో ఎన్టీఆర్, ఏఎన్ఆర్ పాత్రలు ఎంతో కీలకం. వారి పాత్రల్లో ఎవరు నటిస్తారనే ఉత్సుకత అందరిలోనూ నెలకొంది. ఎన్టీఆర్‌గా జూనియర్ ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌గా నాగచైతన్య నటిస్తారనే వార్తలు గతంలో హల్‌చల్ చేసినా అధికారికంగా ప్రకటించ లేదు. తాత పాత్రలో నటించే అవకాశాన్ని ఎన్టీఆర్ సున్నితంగా తిరస్కరించారన్నది టాక్. అయితే.. తాత అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో నటించేందుకు మనవడు నాగచైతన్య పచ్చజెండా ఊపారు. త్వరలోనే చైతన్య 'మహానటి' షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ విషయాన్ని చిత్రవర్గాలు అధికారికంగా ప్రకటించాయి. సావిత్రి పాత్రలో కీర్తీ సురేశ్ నటిస్తున్న ఈ చిత్రాన్ని 'ఎవడే సుబ్రమణ్యం' ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ సమర్పణలో స్వప్న దత్ నిర్మిస్తున్నారు. ఎస్వీ రంగారావు పాత్రలో మోహన్‌బాబు, జెమినీ గణేశన్‌గా దుల్కర్ సల్మాన్ నటిస్తున్న ఈ చిత్రంలో సమంత, ప్రకాశ్‌రాజ్, క్రిష్, విజయ్ దేవరకొండ, షాలినీ పాండే తదితరులు ఇతర పాత్రలు చేస్తున్నారు.

తెలుగు చలనచిత్ర దర్శకుల మండలి అధ్యక్షునిగా ఎన్. శంకర్

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలుగు చలన చిత్ర దర్శకుల మండలి ఎన్నికల్లో ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రత్యర్థి సానా యాదిరెడ్డిపై 310 ఓట్ల మెజారిటీతో ఎన్.శంకర్ గెలుపొందారు. ఎన్.శంకర్‌తో పాటు ఆయన ప్యానల్ సభ్యులు ప్రధాన కార్యదర్శిగా జి. రాం ప్రసాద్, కోశాధికారిగా కాశీ విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా ఏ.యస్.రవి కుమార్ చౌదరి, ఎస్.వి.భాస్కర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కట్టా రంగారావు, ఎమ్.ఎస్.శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా డీవీ రాజు(కళింగ), ఎన్ గోపీచంద్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్ అడ్డాల, అనిల్ రావిపుడి, ప్రియదర్శిని, గంగాధర్, అంజిబాబు, మధుసూదన్ రెడ్డి, కృష్ణ మోహన్, కృష్ణ బాబు, చంద్రకాంత్ రెడ్డి విజయం సాధించారు. నూతన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతుంది.


ఎన్.శంకర్


ప్రియాప్రకాశ్

మాలీవుడ్ టు బాలీవుడ్

'ఒక్క ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది.. ఒక్క సినిమా హిట్ అయితే ఓవర్ నైట్ స్టార్ అయిపోవచ్చు'.. కానీ.. ఒక్క చూపుతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయారు మాలీవుడ్ బ్యూటీ ప్రియాప్రకాశ్ వారియర్. 'ఒరు అదార్ లవ్' మలయాళ చిత్రం ట్రైలర్‌లో ప్రియ కన్నుకొట్టే సన్నివేశానికి ఎంతటి స్పందన వచ్చిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఆ సినిమా ఇంకా విడుదల కాకముందే టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ ప్రియకు అవకాశాలు తలుపుతడుతున్నాయి. తాజాగా రణ్‌వీర్ సింగ్ సరసన నటించే అవకాశం ప్రియా ప్రకాశ్‌ని వరించిందని బాలీవుడ్ టాక్. తెలుగు హిట్ మూవీ 'టెంపర్' కి రీమేక్‌గా బాలీవుడ్‌లో 'శింబా' మూవీ తెరకెక్కుతోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా రోహిత్‌శెట్టి దర్శకత్వంలో కరణ్ జోహార్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రణ్‌వీర్‌కి జోడీగా అలనాటి అందాలనటి శ్రీదేవి తనయ జాన్వీ నటించనున్నారంటూ బాలీవుడ్‌లో వార్తలు హల్‌చల్ చేశాయి. తాజాగా ప్రియాప్రకాశ్ పేరు తెరపైకి వచ్చింది. 'శింబా' చిత్రవర్గాలు ప్రియను సంప్రదించాయట. అయితే.. తొలి సినిమా 'ఒరు అదార్ లవ్' విడుదల వరకూ ఏ సినిమా ఒప్పుకోకూడదనే ఒప్పందం కారణంగా ఆమె ఇంకా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదని టాక్.

అటెండెన్స్ వేయించే బాధ్యత నాది


సంయుక్తా హెగ్డే, అనిల్ సుంకర, నరేశ్, నిఖిల్, సిమ్రాన్

''స్టూడెంట్స్ ఎవ్వరూ ఈనెల 16న అటెండెన్స్ గురించి పట్టించుకోకండి. ఆరోజు అటెండెన్స్ వేయించే బాధ్యత నాది'' అన్నారు 'అల్లరి' నరేశ్. – 'అల్లరి' నరేశ్

నిఖిల్, సిమ్రాన్ పరింజా, సంయుక్తా హెగ్డే ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. కన్నడ 'కిరిక్ పార్టీ' కి రీమేక్. శరణ్ కొప్పిశెట్టిని దర్శకుడిగా పరిచయం చేస్తూ రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16న విడుదలవుతోంది. అజనీష్ లోక్నాథ్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను విజయవాడలో రిలీజ్ చేశారు. ముఖ్య అతిథి 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''నిఖిల్‌ను చూస్తే నాకు డ్యూరోసెల్ బ్యాటరీ గుర్తొస్తుంటుంది. అంత ఎనర్జిటిక్‌గా ఉంటాడు. కన్నడలో ఎంత పెద్ద హిట్ అయిందో తెలుగులోనూ అంతే హిట్ అవుతుందని ఆశిస్తున్నా'' అన్నారు. ''ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మెసేజ్ ఉన్న సినిమా ఇది. ఈ చిత్రంలో నటించే అవకాశాన్నిచ్చిన అనిల్ సుంకరగారికి థ్యాంక్స్. చందు మొండేటికి 'కార్తికేయ', సుధీర్ వర్మకు 'స్వామి రారా' ఎంత పేరు తెచ్చాయో, 'కిరాక్ పార్టీ' శరణ్‌కి అంతే పేరు తీసుకొస్తుంది'' అన్నారు నిఖిల్. ''టీమ్ అంతా ఎంతో కష్టపడి పని చేశాం. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత అనిల్ సుంకర. ''ప్రతి స్టూడెంట్ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. 16న బంక్ కొట్టి మరీ ఈ సినిమా చూస్తారని కోరుకుంటున్నా'' అన్నారు దర్శకుడు శరణ్. దర్శకుడు సుధీర్ వర్మ, సిమ్రాన్ పరింజా, సంయుక్తా హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

దేవుడు వరమందిస్తే..


సాయిధరమ్ తేజ్

ఫేమస్ పాటల పల్లవితో మూవీ టైటిల్‌ను ఎంపిక చేసుకున్న కుర్రహీరోల జాబితాలో తాజాగా సాయిధరమ్ తేజ్ కూడా చేరబోతున్నారని టాక్. సాయిధరమ్ తేజ్ హీరోగా కరుణాకరన్ దర్శకత్వంలో కేయస్ రామారావు నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. ఈ చిత్రానికి 'దేవుడు వరమందిస్తే...' అనే టైటిల్‌ను చిత్రబృందం పరిశీలిస్తున్నారని సమాచారం. నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వంలో వచ్చిన '6టీన్స్' చిత్రంలోని 'దేవుడు వరమందిస్తే.. నే నిన్నే కోరుకుంటాలే' పాట ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఆల్రెడీ హీరో రామ్ చిత్రానికి 'హలో గురు ప్రేమకోసమే..' అని, శర్వానంద్ చిత్రానికి 'పడి పడి లేచె మనసు' అనే టైటిల్స్‌ను ఖరారు చేశారు.

అమీర్‌పేట్‌లో తిరిగినోడే!

'అమీర్‌పేట్‌లో కళ్లు మూసుకుని అమెరికాలో ఉన్న బిల్డింగులు.. కార్లు.. డాలర్లు.. ఇట్లా అన్నీ పగటి కలలు సింగిల్ టేక్‌లో కనేస్తుంటారు మన యూత్'.. 'అమెరికా అంటే నీకు అంత ఇష్టం ఏంటిరా బాబూ'.. 'అమెరికా వెళ్లిన ప్రతివోడూ అమీర్‌పేట్‌లో తిరిగినోడే'... వంటి డైలాగులు 'అమీర్ పేట్ టు అమెరికా' సినిమాపై ఆసక్తి పెంచుతున్నాయి. బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, మణిచందన, సమ్మెటగాంధీ, రజని, మేఘనా లోకేష్, సాషా సింగ్, వైవా హర్ష ముఖ్యపాత్రల్లో చల్లా భానుకిరణ్ దర్శకత్వంలో స్వప్న కొమండూరి సమర్పణలో పద్మజ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ– ''అమీర్ పేట్ టు అమెరికా ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపించాం. ఈ సినిమాకు రామ్మోహన్ అన్నీ తానై వ్యవహరించారు. యూత్‌ను అలరించే అన్ని అంశాలు ఉన్న ఈ చిత్రం హిట్ అవుతుంది'' అన్నారు. ''ఈనెల 23న పాటలు, 30న సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఈ చిత్రానికి కథ, కర్మ, క్రియ అయిన రామ్మోహన్ కొమండూరి. నిర్మాత పద్మజ, సంగీత దర్శకుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కాలేజీ రోజులే ఆనందానికి కేరాఫ్

కాలేజ్ రోజులు, కాలేజ్ క్యాంపస్‌లో సరదాగా గడిపే క్షణాలే ఆనందానికి కేరాఫ్ అడ్రస్. ఇంజనీరింగ్ కాలేజ్ నాలుగు రోజుల ఇండస్ట్రియల్ టూర్‌లో మూడు ప్రేమ జంటల మధ్య జరిగే కథతో వచ్చిన మలయాళ సూపర్ హిట్ సినిమా 'ఆనందం'. ఈ సినిమాను తెలుగులో అదే పేరుతో ఈ నెల 23న విడుదల చేస్తున్నారు సుఖీభవ మూవీస్ ఎత్తురి గురురాజ్. ఆయన మాట్లాడుతూ – ''డబ్బింగ్ వర్క్ దాదాపు పూర్తి అయింది. ఈ నెల 17న గ్రాండ్‌గా ఆడియో రిలీజ్ చేస్తాం. సచిన్ వారియర్ స్వరపరిచిన మ్యూజిక్‌కు వనమాలి చక్కటి సాహిత్యం అందించారు. 'హ్యాపీడేస్' తరహాలోనే ఈ సినిమా ఆకట్టుకుంటుంది. చాలా మంది నిర్మాతలు రీమేక్ చేస్తాం అన్నా కూడా కథ మీద నమ్మకంతో అనువదిస్తున్నాం'' అన్నారు. ఈ సినిమాకు సహనిర్మాతలు: వీరా వెంకటేశ్వరరావు, వీఆర్‌బీ రాజు, రవి వర్మ చిలువూరి, దర్శకత్వం: గణేశ్ రాజ్.


సిద్ధి మహాజన్‌కట్టి

నో పెయిన్... నో గెయిన్!

ఫస్ట్ వామప్..నెక్స్ట్ స్మాల్ రన్. ఆ నెక్స్ట్ స్మాల్ స్మాల్ ఎక్సర్‌సైజ్‌లు.. జనరల్‌గా వర్కౌట్స్ నుంచి లాంగ్ బ్రేక్ వచ్చిన తర్వాత ఇలానే ఫాలో అవుతారు రీ–స్టార్ట్ చేయడానికి. కానీ..హీరోయిన్ కృతీసనన్ మాత్రం చాలా డిఫరెంట్‌గా వర్కౌట్స్ స్టార్ట్ చేశారు. ఏకంగా 120 కేజీల బరువును లెగ్స్‌తో హ్యాండిల్ చేసే వర్కౌట్‌ను స్టార్ట్ చేశారామె. దీనికి సంబంధించిన ఫొటోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. '' వర్కౌట్స్ చేయడంలో లాంగ్ గ్యాప్ వచ్చింది. కానీ.. ఫిట్‌నెస్ ట్రైనర్ అస్టిన్ డైరెక్ట్‌గా 120 కేజీల వెయిట్ ఉన్న లెగ్ ప్రెస్ వర్కౌట్‌ను స్టార్ట్ చేయమన్నారు. చాలా కష్టపడుతున్నాను'' అని పేర్కొన్నారు కృతీసనన్. పక్కనున్న ఫొటో చూసి... నో పెయిన్.. నో గెయిన్ అంటున్నారు ఆమె అభిమానులు. ఇంకా లైఫ్ గురించి ఆమె మాట్లాడుతూ –''ఆర్డినరీ లైఫ్ అంటే చాలా మందికి ఇష్టం ఉండదు. ది బెస్ట్ లైఫ్‌ని కోరుకుంటాం. నిజానికి ఆర్డినరీగా ఉండే మన డెయిలీ లైఫ్‌లో జరిగే ఇన్సిడెంట్స్ మనల్ని ఎంతో హ్యాపీగా ఉంచుతాయి. చిన్నప్పుడు సూర్యోదయం, చిన్నపిల్లల నవ్వు, రేడియోలో పాత పాటలు వినడం, పాత స్నేహితులతో సరదాగా టైమ్ స్పెండ్ చేయడం... ఇలాంటి మూమెంట్స్ ఎంతో సంతోషాన్నిస్తాయి. ఇలా లైఫ్‌లో సంతోషాన్నిచ్చే ప్రతి మూమెంట్‌ను ఆస్వాదించి ఆనందంగా ఉండండి'' అన్నారు.




కృతీసనన్

సుడోకు

		8		9			6	3
	5		6	1		4		
3	9			8		5	7	
						7	9	
6	3		8		4		2	5
	7	5						
	4	1		3			5	2
		7		5	8		3	
5	6			4		8		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

9	2	5	7	8	1	4	3	6
4	7	1	9	3	6	8	2	5
8	3	6	2	4	5	9	7	1
3	4	9	8	1	7	5	6	2
1	6	2	5	9	4	3	8	7
7	5	8	3	6	2	1	9	4
6	9	4	1	7	8	2	5	3
5	8	7	4	2	3	6	1	9
2	1	3	6	5	9	7	4	8

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి :
చూసి చూడంగానె నచ్చేశావే
అడిగి అడగకుండ వచ్చేశావే
నా మనసులోకి అందంగ దూకి
దూరం దూరంగుంటు ఏం చేశావే
దారం కట్టి గుండె ఎగరేశావే
ఓ చూపు తోటీ హో ఓ నవ్వు తోటీ
తొలిసారిగా..... తొలిసారిగా
నా లోపలా..... నా లోపలా
ఏంఅయ్యిందో తెలిసేదెలా
నా చిలిపి అల్లర్లు నా చిలిపి సరదాలు
నీలోను చూసానులే
నీ వంకే చూస్తుంటె అద్దంలో నను నేనె చూస్తున్నట్టె ఉందిలే

చరణం :
ఈ చిత్రాలు ఒక్కోటి చూస్తూ ఉంటె
ఈ జన్మకి ఇది చాలు అనిపిస్తుందే
నువ్ నా కంట పడకుండా నా వెంట పడకుండ
ఇన్నేళ్లెక్కడ ఉన్నావే
నీ కల్లల్లో ఆనందం వస్తుందంటె
నేనెన్నో యుద్దాలు చేస్తానులే
నీ చిరునవ్వుకై నేను గెలుపొంది వస్తాను
హామి ఇస్తున్ననులే
ఒకటొ ఎక్కం కూడా మరిచియేలాగా
ఒకటే గుర్తొస్తావే నిను చూడకుండ ఉండగలనా ॥నా చిలిపి॥

చిత్రం : ఛలో ; సంగీతం : మహతి స్వర సాగర్
గానం: అనురాగ్ కులకర్ణి, సాగర్ ; రచన : భాస్కరభట్ల
https://youtu.be/XqxruZnyHKM

కట్‌చేయ్...దాచేయ్...

సెల్ఫ్ చెక్

ఇతరుల మాటను వినరా?



ఒరేయ్ పండూ టేబుల్‌మీద ఉన్న వాచ్ తీసుకురారా... ఇలా ఎన్నిసార్లు అడిగినా పండు దాన్ని తీసుకురాడు... ఇది చిన్న పిల్లలు చేసే పని... ఈ అలవాటును పెద్దవారయ్యాక కూడ వదలకుండా ఎవరిమాట వినకుండా ఉంటే? దాన్ని తలబిరుసు అంటారు. దీనివల్ల మంచి పేరు రాదు, చెప్పిన మాట వింటేనే ఎవరితోనైనా మంచి కమ్యూనికేషన్ ఏర్పడుతుంది. ఇతరుల మాటను మీరు వింటున్నారా? లేక పట్టీపట్టనట్లు ఉండి వారిని గాయపరుస్తున్నారా?

1. ఒక మాటను పదిసార్లు చెప్పించుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. ఇతరుల మాట ఎందుకు వినాలని ఎదురు ప్రశ్న వేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. ఎవరినీ లెక్క చేయకూడదు అనుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. ప్రతిదానినీ నిర్లక్ష్యంతో చూస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. ఎప్పుడూ పరధ్యానంలో ఉంటారు. ఒకటికి రెండుసార్లు చెబితేకాని అర్థం చేసుకోలేరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. మీ ప్రవర్తనవల్ల ఎదుటివారు బాధపడుతుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. మాట వినకుండా ఉండే తత్వంవల్ల చాలాసార్లు నష్టపోయి ఉంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. చాలా మందకొడిగా ఉంటారు. ఏ పనినైనా చాలా నిదానంగా చేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. ఎదుటివారు చెప్పేది వినిపిస్తున్నా , వినపడనట్లు నటిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. ఇతరుల మాటలను పెడచెవిన పెట్టటం మీకు సంతోషాన్ని ఇస్తుంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

'ఎ' లు ఏడు దాటితే మాటవినని తత్వం మీలో ఎక్కువస్థాయిలో ఉన్నట్లు. మీపై మంచి అభిప్రాయం ఏర్పడాలన్నా, గౌరవం కలగాలన్నా ఎదుటివారు చెప్పింది వినటం తప్పనిసరి. 'బి' లు 'ఎ'ల కన్నా ఎక్కువగా వస్తే ఇతరులు చెప్పింది వినటానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు.

న్యూ యాప్

ప్రేమికులకు ప్రొటెక్షన్



మళ్లీ ఒక పరువు హత్య! అగ్రకులానికి చెందిన అమ్మాయి దళితుడిని ప్రేమించి, కుటుంబాన్ని ఎదురించి పెళ్లి చేసుకుంది. తక్కువ కులం వ్యక్తిని పెళ్లి చేసుకొని కుటుంబ పరువు గంగలో కలిపిందని అగ్రహోదగ్రులయ్యారు కుటుంబసభ్యులు. అమ్మాయిని వెదికి, నయానా, భయానా ఇంటికి తీసుకొచ్చి, మూడో కంటికి తెలియకుండా అమ్మాయిని చంపేసి, అబ్బాయి మీద కిడ్నాప్ కేస్ పెట్టారు.

తమిళనాడులో జరిగిన ఈ సంఘటన గురించి తమిళ పేపర్లో వార్తగా వచ్చింది. ఇలాంటివి ఈ మధ్య బాగా వింటోంది చెన్నైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వసుమతి వాసంతి. కుల వివక్ష మీద పెరియార్ రామస్వామి యుద్ధం ప్రకటించిన నేల మీద పరువు హత్యలా? ఇవి అనాగరికమని, ఇలాంటి హత్యలకు పాల్పడిన వాళ్లకు తగిన శిక్ష ఉంటుందని 2006లో అపెక్స్ కోర్ట్ తీర్పు కూడా ఇచ్చింది. అయినా ఆగలేదే?! 2013 నుంచి 2017 వరకు నాలుగేళ్లలో 187 పరువు హత్యలు జరిగాయని ఓ రిపోర్ట్ చెప్తోంది. అన్యాయం! ప్రేమకు కులం ఏంటి? కులం పేరుతో వాళ్లను విడదీయడమే కాకుండా చంపడం ఏమిటి? వసుమతి మనసు కలత చెందింది. ఏదైనా చేయాలి... సహపంక్తి భోజనాల ద్వారా కాదు, కులాంతర వివాహాల ద్వారా కులం నశిస్తుంది అని చెప్పాడు అంబేద్కర్. ప్రేమ ఆ పని చేస్తోంది. కానీ సమాజం



అడ్డుకుంటోంది. తను అలాంటి ప్రేమికులకు రక్షణ కల్పించాలి. ఏం చేయాలి? ఆలోచించింది. ఈ కాలంలో దేన్నయినా మేడ్ ఈజీ చెస్తున్నవి యాప్సే. గడప దాటకుండానే ప్రపంచాన్ని ఇంట్లో పెడుతున్నాయి. ఈ ప్రేమ పక్షులకు అలాంటి సురక్షితమైన యాప్ గూడును అల్లేస్తే? యెస్.. తట్టింది ఆమెకు. ఆపరేషన్‌లో మునిగింది.

పెళ్లి చేస్తారు.. ఇల్లూ చూస్తారు!

వసుమతి డెవలప్ చేసిన యాప్ పేరు.. కాదల్ అరణ్. అంటే ప్రొటెక్టర్ ఆఫ్ లవ్. ఇదెలా పనిచేస్తుందంటే.. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వలంటీర్స్ ఉంటారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగానే యూజర్ తన కాంటాక్ట్ వివరాలన్నీ అందులో పొందుపర్చాలి. అలాగే ఆ జంట ఎలాంటి సహాయం కోరుకునుందో కూడా అందులో నమోదు చేయాలి. ఆ సమాచారాన్ని అనుసరించి వలంటీర్స్ ఆ జంటకు ఫోన్ చేస్తారు. వాళ్లున్న పరిస్థితిని బట్టి వారికి అవసరమైన న్యాయ సంబంధమైన, పోలీసుల సహకారం,షెల్టర్.. అంటే అద్దెకు ఇల్లు చూపెట్టడం వంటివి సహాయాన్ని అందిస్తారు. ఇవన్నీ కాక ఎమోషనల్ సపోర్ట్ ఇవ్వడంలోని ముందుంటారు. ‘‘తమిళనాడులోని దాదాపు అన్ని జిల్లాల్లో వలంటీర్లు ఉన్నారు. ఇలా కులాంతర ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలకు స్వచ్ఛందంగా సహాయం అందించాలనుకునే వాళ్లు మా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావచ్చు. వాళ్లకు ట్రైనింగ్ కూడా ఇస్తాం’’ అని చెబుతున్నారు వసుమతి వాసంతి.

> ప్రేమకు కులం ఏంటి? కులం పేరుతో ప్రేమికులను విడదీయడమే కాక చంపిపారేయడం ఏంటి? వసుమతి మనసు కలత చెందింది. ఆ కలతలోంచి వచ్చిన ఆలోచనే.. కాదల్ అరణ్ యాప్!

పొరుగు దేశపు ఎడారిలో ఉద్యమాల ఒయాసిస్...

థార్ అనేది ఒక ఎడారి ప్రాంతమన్న సంగతి అందరికీ తెలిసిందే. మన దేశంలోనే కాదు... థార్‌లోని కొంత భాగం పొరుగున్న పాకిస్తాన్‌లోనూ విస్తరించి ఉంది. అది భౌగోళికంగా, వాతావరణపరంగానే కాదు... అమ్మాయిల చదువులు, మహిళల హక్కుల వంటి సామాజిక అంశాల్లోనూ అక్షరాలా ఎడారే. ఎడారిలోని ఆ ప్రాంతంలో తల్లడిల్లుతున్న అనేక మందికి ఒయాసిస్‌గా మారారు ఓ మహిళ. అవకాశాలన్నీ పుష్కలంగా ఉన్న మాములు మహిళ కూడా కాదామె. ఆమె అన్ని విషయాల్లోనూ వివక్షను ఎదుర్కొనే దళిత మహిళ. కానీ... పెళ్లి తర్వాత కూడా పట్టుదలతో చదివి పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయ్యారు. అన్న పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని అనేక మందిని వెట్టిచాకిరి నుంచి విముక్తులను చేశారు. బాల్యవివాహాలు, పరువు హత్యలు, పనిచేసేచోట వేధింపులకు వ్యతిరేకంగా గళాన్ని వినిపించారు.ఇలాంటి సామాజిక జాడ్యాలు కొనసాగే ఎడారిలాంటి చోట అనేక మంది అభాగినులకు అండగా మారే ఆ ఒయాసిస్ పేరే కృష్ణకుమారి. ఇదీ ఆ ఒయాసిస్ కథ... చదవండి.



పాకిస్తాన్ సెనేట్‌కు ఎన్నికైన హిందూ దళిత మహిళ కృష్ణకుమారి

ఇండియా, పాకిస్తాన్... క్రికెట్ నుంచి పాలిటిక్స్ వయా కశ్మీర్! సమస్య ఏదైనా అది ఆసక్తికరమే! అన్నీ దేశభక్తిని చాటుకోవడానికి ఉపయోగపడే అంశాలే! ఆ గాలి ఇటు వీచకుండా చేసే ఉక్కపోతలో కాస్త గాలాడేలా చేసే కొన్ని అరుదైన పవనాల నుంచి అప్పుడప్పుడూ కాస్త చల్లని గాలులూ వీస్తాయి! అలాంటి చల్లటి వార్తే ఇది కూడా. ఇంతకూ ఆ న్యూస్ ఏమిటంటే... కృష్ణకుమారి కోహ్లీ అనే దళిత మహిళ పాకిస్తాన్ ఎగువ సభ (సెనెట్)కు ఎన్నిక కావడం. ఆమె వివరాలు తెలుసుకునేలా కుతూహలాన్ని రేకెత్తించే అంశమది. ఇస్లామిక్ రాజ్యమైన పాకిస్తాన్‌లో సెనేట్‌కు ఎన్నికైన తొలి దళిత హిందూ మహిళగా చరిత్ర సృష్టించారు కృష్ణకుమారి. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తరపున సింధ్ ప్రావిన్స్ నుంచి ఎగువ సభకు ఎన్నికయ్యారు ఆమె.

పూర్వాపరాలు...

పాకిస్తాన్ సింధ్ ప్రావిన్స్‌లోని నాగర్‌పార్కర్‌లో పుట్టారు కృష్ణకుమారి. పేద కుటుంబం. తండ్రి జుగ్నో కోహ్లీ సహా ఆ పరివారమంతా ఉమేర్‌కోట్ జిల్లాలోని కున్రీ ఊళ్లోని భూస్వామి దగ్గర వెట్టి చేసేవారు. ఎనిమిదేళ్లు వచ్చేవరకు చిన్నారి కృష్ణకుమారి కూడా వెట్టి చేసింది. అంతేకాదు దాదాపు తన తల్లి, తండ్రి, అన్నతోపాటు తనూ మూడేళ్లు ఆ భూస్వామి నిర్బంధంలో మగ్గింది. తిండి లేని రాత్రుళ్లు గడిపింది. నీళ్లతో కడుపు నింపుకుంది. పిల్లల అవస్థ చూసి తమలాగే వాళ్ల బతుకులూ వెట్టితోనే వెలిసిపోతాయేమోనని ఆవేదన చెందేవాడు కృష్ణకుమారి తండ్రి. పిల్లలను చదివించాలని ఆశపడేవాడు. మొత్తానికి కృష్ణకుమారికి ఊహ వచ్చేటప్పటికీ ఆ చెర నుంచి బయటపడింది ఆ కుటుంబం. పిల్లలు చదువుకోవడానికి ఆ ఇంట్లో కరెంటు కూడా ఉండేది కాదు. కిరసనాయిల్ దీపపు వెలుతురులోనే కృష్ణకుమారి, ఆమె అన్న వీర్‌జీ కోహ్లీ చదువుకునేవారు. అయితే ఆమె తొమ్మిదో తరగతిలో ఉండగానే మంచి సంబంధం రావడంతో ఆమెకు పెళ్లి చేశాడు జుగ్నో. చదివించాలని అంత ఆశపడిన ఆ తండ్రి పట్టుమని పదహారేళ్లు కూడా నిండని బిడ్డకు పెళ్లి చేయడానికి కారణం... నాగర్‌పార్కర్‌లో ఆడవాళ్లకు పెద్ద చదువులు చదివే హక్కు లేదు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో చదువు, సాధికారత స్త్రీ చేరుకోలేని గమ్యాలే. అయితే ఆమె భర్త లాల్ చంద్... చదువుపట్ల కృష్ణకుమారికి ఉన్న ఆసక్తిని చూసి పెళ్లయిన తర్వాత కూడా ఆమె చదువుకోవడానికి అనుమతించాడు. దాంతో డ్రాపవుట్‌గా మిగిలిపోవాల్సిన ఆమె సోషియాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్‌గా నిలబడ్డారు.

> **స్వాతంత్య్ర సమరం నుంచే..**
>
> కృష్ణకుమారి కుటుంబానికి స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న నేపథ్యం ఉంది. ఆమె పూర్వీకుల్లో ఒకరైన రూప్లో కోహ్లీ 1857లో జరిగిన సిపాయి తిరుగుబాటులో పాలుపంచుకున్నారు. సింధ్‌లోని నాగర్‌పార్కర్‌లోని తిరుగుబాటును అణచడానికి బ్రిటిషర్స్ దాడి చేసినప్పుడు రూప్లో బ్రిటిష్ సైన్యానికి ఎదురొడ్డి పోరాడారు. ఆ సాహసమే ఈ అన్నచెల్లెళ్లకు వచ్చినట్టుంది అంటారు కృష్ణకుమారి సన్నిహితులు.



రాజకీయాలు..

కృష్ణకుమారి అన్న వీర్‌జీ మొదటి నుంచీ చురుకైన వ్యక్తి. అన్యాయం మీద గొంతెత్తేవాడు. సింధ్ ప్రాంతంలోని అణగారిన ప్రజల హక్కుల కోసం పిడికిలి బిగించాడు. హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్‌గా పేరుపొందాడు. కృష్ణకుమారి రాజకీయాల్లోకి రావడానికి తన అన్న వీర్‌జీయే ప్రేరణ. ఆయన ధైర్యమే ఆమెకు స్ఫూర్తి. దాంతో కాలేజ్‌లో ఉన్నప్పటి నుంచే అన్నతోపాటు మానవహక్కుల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడారు. బాల్యవివాహాలు, పరువు హత్యలు, పనిచేసే చోట వేధింపులకు వ్యతిరేకంగా గళమెత్తారు. మహిళల హక్కుల కోసం ఉద్యమించారు. ఉద్యమిస్తూనే ఉన్నారు. ఆ పోరాట పటిమే ఆమెను ఈ రోజు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తరపున (థార్ నుంచి) ఎగువ సభలో నిలబెట్టింది. ‘‘నేను ఒక్క థార్ మహిళల ప్రతినిధిని మాత్రమే కాదు దేశంలోని మొత్తం మహిళల ప్రతినిధిని. నాగర్‌పార్కర్, థార్‌లలో స్త్రీలకు నేటికీ టాయ్‌లెట్ వంటి కనీస సౌకర్యాలు లేవు. బాల్యవివాహాలతో బాలికలు చదువుకు దూరమవుతున్నారు. ముక్కుపచ్చలారని వయసుకే తల్లులవుతున్నారు. అనారోగ్యంతో యవ్వనంలోనే వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్నారు. ఇలాంటి ఇంకెన్నో మహిళా సమస్యలెన్నిటినో సభలో ప్రభుత్వం దృష్టికి తెస్తాను. పరిష్కారం కోసం పోరాడుతాను. మహిళలు, బాలికల ఆరోగ్యం, చదువు ఈ విషయాల్లో దృష్టిపెట్టదల్చాను. వీటిల్లో కొంత మార్పు తేగలిగినా నా అభ్యర్థిత్వానికి న్యాయం చేసినట్టే. ఎన్ని ఆటంకాలెదురైనా ఆగను’’ అన్నారు కృష్ణకుమారి కోహ్లీ. మహిళల మీద దాడులు, బాల్యవివాహాలు, పరువు హత్యలు జరిగినప్పుడు నిరసనలు, ధర్నాలు, ర్యాలీల్లో ఆమె ముందుంటారు. వెట్టినుంచి విముక్తి పోరాటంలోనూ కృష్ణకుమారిది మొదటినుంచీ మొదటి అడుగే. ఆ పోరాట సమయాల్లో కృష్ణకుమారి అత్తింటి బంధువులు, పుట్టింటి బంధువులు అంతా ఆమెను దూషించేవారట. ‘ఒక స్త్రీ అయ్యుండి, తల మీద పమిట లేకుండా మగవాళ్లతో సమానంగా ఎలా వెళ్తుందో చూడండి. అసలు ఆమె ఆడమనిషేనా? కులంలోని ఆడవాళ్ల మర్యాదంతా మంటగలుపుతోంది’ అని తిట్టేవారట. కృష్ణకుమారి భర్త దగ్గరకు వచ్చి ‘నీ భార్యను అదుపులో పెట్టుకో’ అని మగవాళ్లు హెచ్చరించేవారట. ఇలాంటివి కనీసం రెండు రోజులకు ఒక్కసారైనా ఉండేవట. ‘అన్నీ విని నేను, లాల్‌చంద్ ఇద్దరం నవ్వుకునేవాళ్లం’’ అని చెప్తారు 39 ఏళ్ల కృష్ణకుమారి. అందునా స్వేచ్ఛాస్వాంత్రాలకు అంతగా ఆస్కారమూ, అవకాశమూ లేని ఆ దేశంలో సాగిస్తున్న కృష్ణకుమారి పోరాటం... ఎందరికో స్ఫూర్తిదాయకం.

- శరాది

పరి పరిశోధన

ఇడియట్ బాక్స్‌తో క్యాన్సర్ చిక్కు!

రోజూ గంటల కొద్దీ టీవీ చూస్తున్నారా? అయితే కొంచెం జాగ్రత్త వహించండి. ఎందుకంటే గంటకు లోపు టీవీ చూసే వారితో పోలిస్తే మీలాంటి వారికి పేగు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ అంటున్నారు ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ క్యాన్సర్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు. తగిన శారీరక వ్యాయామం లేనివారికి, క్యాన్సర్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని కనుక్కునేందుకు చేసిన పరిశోధనల్లో ఇదే అతిపెద్దదని వారు చెబుతున్నారు. దాదాపు యాభై లక్షల మంది పురుషులపై ఆరేళ్లపాటు ఈ పరిశోధనలు జరిగాయి. టీవీ ఎక్కువ సేపు చూడటమన్నది చిరుతిళ్లు, పొగతాగడం వంటి అలవాట్లకు కారణం కావచ్చునని గతంలో కొన్ని పరిశోధనలు నిర్ధారణ చేసిన నేపథ్యంలో వీటి తాలూకూ దుష్ప్రభావాలు పేగు క్యాన్సర్‌గా పరిణమించవచ్చునని తాజా పరిశోధన చెబుతోంది. ఈ కారణాల వల్లనే కంప్యూటర్ ముందు పనిచేసే వారికంటే టీవీ చూసే వారిలోనే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా ఈ సూత్రం మహిళలకు వర్తించకపోవడం గమనార్హం. ఏతావాతా.. కడుపులో చల్ల కదలకుండా కూర్చునే వారితో పోలిస్తే కొద్దోగొప్పో వ్యాయామం చేసే పురుషులకు ఈ ప్రమాదకరమైన వ్యాధి సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ప్రొఫెసర్ లిండా బాల్డ్ తెలిపారు.




అర డిగ్రీ పెరిగినా 50 లక్షల మంది మునక...

భూమి సగటు ఉష్ణోగ్రతలు కేవలం అర డిగ్రీ సెల్సియస్ పెరిగినా దాదాపు 50 లక్షల మంది ముంపు ప్రమాదానికి గురవుతారని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. శిలాజ ఇంధనాల విచ్చలవిడి వాడకం... అడవుల నరికివేత, కాలుష్యం తదితర అనేక కారణాల వల్ల భూమి సగటు ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ భూతాపోన్నతిని ఈ శతాబ్దపు చివరికి 2.0 డిగ్రీ సెల్సియస్‌కు చాలా తక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలని మూడేళ్ల క్రితం నాటి ప్యారిస్ ఒప్పందం ద్వారా ప్రపంచదేశాలూ అంగీకరించాయి కూడా. అయితే ప్రిన్స్‌టన్, రట్గర్స్, టఫ్టస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనం ప్రకారం భూతాపోన్నతి 0.5 డిగ్రీలు పెరిగినా ప్రమాదమేనని హెచ్చరిస్తోంది. సముద్ర మట్టాలు పెరిగిపోవడం వల్ల తీర ప్రాంతాల్లో ఉండే దాదాపు 50 లక్షల మంది వరద ముంపునకు గురవుతారనీ, వీరిలో కనీసం 60 వేల మంది చిన్న చిన్న దీవుల్లో ఉండేవారు ఉంటారని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. తీర ప్రాంతాల్లో సముద్రపు అలల తీవ్రతను లెక్కకట్టేందుకు కొన్ని పరికరాలను ఏర్పాటు చేసి జరిపిన అధ్యయనం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చినట్లు వారు అంటున్నారు. ఒక్క న్యూయార్క్ నగరంలోనే వందేళ్లకు ఒకసారి వచ్చేంత తీవ్రస్థాయి తుఫానులు ఏటా వస్తాయని భూతాపోన్నతి రెండు డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే ఇలాంటి తుఫానులు ఏడాదికి రెండు వరకూ తాకుతాయని వివరిస్తున్నారు. మొత్తమ్మీద చూస్తే 2100 నాటికి 1.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే సగటు సముద్ర మట్టం 48 సెంటీమీటర్ల వరకూ పెరుగుతుందని రెండు డిగ్రీ సెల్సియస్ పెరుగుదల ఉంటే 56 సెంటీమీటర్ల పెరుగుదల ఉండవచ్చునని వారు చెబుతున్నారు.



కార్బన్ నానోట్యూబులతో చౌకైన ఇంధనం...

అమెరికాలోని స్టార్టప్ కంపెనీ మ్యాటర్‌షిఫ్ట్ ఓ వినూత్నమైన ఇంధన తయారీకి మార్గం సుగమం చేసింది. కార్బన్ నానోట్యూబులో పెద్దస్థాయిలో ఫిల్టర్లను తొలిసారి తయారు చేయగలగడంతో గాల్లోంచి తీసేసిన కార్బన్ డయాక్సైడ్‌తోనే మళ్లీ పెట్రోలు, డీజిళ్లను తయారు చేసేందుకు వీలేర్పడింది. కార్బన్ నానోట్యూబులతో తయారైన ఫిల్టర్లు ఎథనాల్ తయారీతో పాటు ఉప్పునీటిలోని లవణాలను చౌకగా తొలగించేందుకు బాగా ఉపయోగపడతాయని రెండు దశాబ్దాలుగా తెలిసినప్పటికీ పెద్దస్థాయిలో తయారు చేయలేకపోవడం ప్రతిబంధకంగా మారింది. మ్యాటర్‌షిఫ్ట్ తొలిసారి వాణిజ్యస్థాయిలో భారీ ఎత్తున కార్బన్ నానోట్యూబుల ఫిల్టర్‌ను తయారు చేయగలగడంతో పరిస్థితి మారిపోనుందని అంచనా. ఈ అతిసూక్ష్మమైన ఫిల్టర్ల ద్వారా గాల్లోని కార్బన్‌డయాక్సైడ్‌ను ఉపయోగించుకుని పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలను తయారు చేయవచ్చునని.. ఈ ఇంధనాల తయారీకి ప్రస్తుతం అవుతున్నదానికంటే చాలా తక్కువ వ్యయంతోనే వాటిని తయారు చేయగలగడం ఇంకో విశేషమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.




పీడియాట్రిక్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

పాపకు తలలో పదేపదే ర్యాష్!

మా పాపకు పదకొండు నెలల వయస్సు. తల మీద విపరీతమైన ర్యాష్‌తో పాటు ఇన్ఫెక్షన్ వచ్చింది. డాక్టర్‌గారికి చూపించి చికిత్స చేయిస్తే తగ్గింది గానీ మళ్లీ పదే పదే తిరగబెడుతోంది. మా పాపకు ఉన్న సమస్య ఏమిటి?

– ఎమ్. శారద, సామర్లకోట



మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీ పాపకు మాడు (స్కాల్ప్) భాగంలో చర్మం మీద ర్యాష్ వచ్చినట్లుగా కనిపిస్తోంది. అలాగే కొద్దిగా సూపర్ యాడ్ ఇన్ఫెక్షన్ కూడా అయినట్లుగా అనిపిస్తోంది. ఈ కండిషన్‌ను వైద్య పరిభాషలో సెబోరిక్ డర్మటైటిస్ అంటారు. ఇది కాస్త దీర్ఘకాలిక సమస్యగానే చెప్పవచ్చు. ఈ సమస్య ఉన్న పిల్లలకు మాడుపైన పొరల్లా ఊడటం, కొన్నిసార్లు తలంతా అంటుకుపోయినట్లుగా ఉండటం, కొన్ని సందర్భాల్లో మాడుపై పొర ఊడుతున్నట్లుగా కనిపించడం జరుగుతుంది. దీనికి కారణం ఫలానా అని నిర్దిష్టంగా చెప్పలేకపోయినా... కొన్నిసార్లు ఎమ్. పర్ఫ్యూరా అనే క్రిమి కారణం కావచ్చని కొంతవరకు చెప్పవచ్చు. చిన్నపిల్లల్లో... అందునా ముఖ్యంగా నెల నుంచి ఏడాది వయసు ఉండే పిల్లల్లో ఈ సమస్య మరీ ఎక్కువ. కొన్నిసార్లు ఈ ర్యాష్ ముఖం మీదకు, మెడ వెనక భాగానికి, చెవుల వరకు వ్యాపిస్తుంది. ఇది వచ్చిన పిల్లల్లో పై లక్షణాలతో పాటు కొందరిలో నీళ్ల విరేచనాలు (డయేరియా) లేదా నిమోనియా వంటి ఇన్ఫెక్షన్స్ తరచూ వస్తుంటే దాన్ని ఇమ్యూనో డెఫిషియెన్సీ డిసీజ్‌కు సూచికగా చెప్పవచ్చు. అలాగే కొన్ని సందర్భాల్లో ఇతర కండిషన్స్... అంటే అటోపిక్ డర్మటైటిస్, సోరియాసిస్ వంటి స్కిన్ డిజార్డర్స్ కూడా ఇదేవిధంగా కనిపించవచ్చు.

చికిత్స : ఈ సమస్య ఉన్నవారికి యాంటీసెబోరిక్ (సెలీనియం, శాల్సిలిక్ యాసిడ్, టార్) షాంపూలతో క్రమం తప్పకుండా తలస్నానం చేయిస్తుండటం, తక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ ఉన్న కీమ్స్ తలకు పట్టించడం, ఇమ్యూనోమాడ్యులేటర్స్ వంటివి చేయాలి. దాంతో ఈ సమస్య నయమవుతుంది. అలాగే ఈ సమస్యతో ప్రభావితమైన భాగాన్ని తడిబట్టతో తరచూ అద్దుతూ ఉండటం కూడా చాలా ముఖ్యం.

బాబుకు తరచూ తలనొప్పి.. ఏం చేయాలి?

మా బాబు వయసు తొమ్మిదేళ్లు. తరచూ తలనొపితో బాధపడుతున్నాడు. ఇంతకుముందు చాలా అరుదుగా వచ్చేది. కాని ఇటీవల చాలా తీవ్రమైన నొప్పి వస్తోంది. డాక్టర్‌కు చూపిస్తే కొన్ని పరీక్షలు చేసి ఎలాంటి ప్రమాదం లేదని అన్నారు. మధ్యలో కొంతకాలం బాగానే ఉంటోంది. మళ్లీ మళ్లీ తలనొప్పి వస్తోంది. మా బాబు విషయంలో తగిన సలహా ఇవ్వండి.

– జి. సుబ్రహ్మణ్యమూర్తి, వరంగల్



మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే మీ బాబు దీర్ఘకాలిక తలనొప్పి (క్రానిక్ హెడేక్)తో బాధపడుతున్నట్లు చెప్పవచ్చు. ఇలా వచ్చే తలనొప్పులకు అనేక కారణాలు ఉంటాయి. అందులో ముఖ్యమైనది మైగ్రేన్. ఇది పెద్దల్లో అంత సాధారణమో పిల్లల్లో అంతగా సాధారణం కానప్పటికీ అరుదేమీ కాదు. మైగ్రేన్‌తో పాటు టెన్షన్ హెడేక్, మెదడు లోపలి సమస్యలు, సైనస్, జ్వరాలు రావడం, పళ్లకు సంబంధించిన సమస్యలు, కంటి లోపాలు, మానసికమైన సమస్యల వల్ల కూడా దీర్ఘకాలిక (క్రానిక్) తలనొప్పులు రావచ్చు. మీరు చేయించిన ప్రాథమిక పరీక్షల్లో రిపోర్టులు నార్మల్‌గా ఉన్నాయని చెబుతున్నారు కాబట్టి మీ బాబుది మైగ్రేన్ వల్ల వస్తున్న తలనొప్పి అని భావించవచ్చు. అయితే ఈ మైగ్రేన్‌లోనూ చాలారకాలు ఉన్నాయి. ఆహారంలో నైట్రేట్స్ ఎక్కువగా తీసుకోవడం, అలసట, నిద్రలేమి వంటి కారణాల వల్ల ఇది మరింత పెరుగుతుంది. కొద్దిమంది పిల్లల్లో వెలుతురు చూడటానికి ఇష్టపడకపోవడం, వాంతులు కావడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ఇది తీవ్రంగా ఉండే కొంతమందిలో దీని వల్ల శరీరంలోని కొన్ని అవయవాలు బలహీనంగా మారడం కూడా కనిపించవచ్చు.

చికిత్స : ● చాలా ప్రశాంతంగా ఉండే వెలుతురు లేని గదిలో విశ్రాంతి తీసుకోవడం ● నుదిటిపై చల్లటి నీటితో అద్దడం ● నొప్పి తగ్గించడానికి డాక్టర్ సలహా మేరకు మందులు (ఉదాహరణకు ఎన్ఎస్ఏఐడీ గ్రూప్ మందులు) వాడటం ● నీళ్లు ఎక్కువగా తాగించడం ● ఆందోళన, టెన్షన్, మానసిక ఒత్తిడిని నివారించడం.

పైన పేర్కొన్న జాగ్రత్తలతో మైగ్రేన్ కారణంగా తరచూ వచ్చే తలనొప్పి ఎటాక్స్‌ను చాలావరకు తగ్గించవచ్చు. అయితే ఇది చాలా తరచూ వస్తుంటే మాత్రం ప్రొఫిలాక్టిక్ చికిత్సగా మూడు నుంచి ఆరు నెలల పాటు డాక్టర్ సలహా మేరకు కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది. మీరు మరొకసారి మీ న్యూరోఫిజీషియన్ లేదా మీ ఫ్యామిలీ పీడియాట్రీషియన్‌ను సంప్రదించి తగు సలహా, చికిత్స తీసుకోవడం అవసరం.

మా బాబు ఎదుగుదల నార్మల్‌గానే ఉందా?

మా బాబుకు 15 నెలలు. పుట్టినప్పుడు బాగానే ఉన్నాడు. అయితే వాడు ఇంకా సపోర్ట్ తీసుకోకుండా నడవలేకపోవడం, ముద్దుమాటలాడకపోవడం చూస్తే వాడి ఎదుగుదలలో ఏవైనా లోపాలున్నాయేమోనని అప్పుడప్పుడూ అనిపిస్తోంది. దాంతో తీవ్ర వేదనకు గురవుతున్నాం. పిల్లల వికాసం ఏయే సమయాల్లో ఎలా ఉంటుందో విపులంగా వివరించండి.

– సువర్ణకుమారి, కాకినాడ

మీ బాబు ఎదుగుదల విషయంలో కాస్త నిదానంగా ఉన్నాడంటూ మీరు చెబుతున్న లక్షణాలను చూస్తే... మీరలా అనుకోవడానికి కారణలేమీ కనిపించడం లేదు. ప్రతి పిల్లవాడి ఎదుగుదల, వికాసం వేర్వేరుగా ఉంటాయి. పిల్లల డెవలప్‌మెంట్ చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఫలానా పిల్లలు ఫలానా సమయంలోనే ఫలానా నైపుణ్యాలను నేర్చుకుంటారని చెప్పడం కుదరదు. కొంతమంది చాలా త్వరగా నడుస్తారు, మాట్లాడతారు. మరికొందరు కాస్త ఆలస్యంగా. అయితే ఎవరు ఎప్పుడు ఆ నైపుణ్యాలు నేర్చుకుంటారన్నది చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు... నెలలు నిండకముందే పుట్టడం, గర్భవతిగా ఉన్నప్పుడు తల్లికి ఏవైనా సమస్యలు రావడం, పుట్టాక జాండీస్, ఇన్ఫెక్షన్స్ వంటివి రావడం, కొన్ని జన్యుపరమైన కారణాలు, పిల్లలను పెంచే ప్రక్రియలో తల్లిదండ్రులు ఓవర్ ప్రొటెక్టివ్‌గా ఉండటం, కవల పిల్లలు కావడం వంటి అనేక అంశాలు వాళ్ల ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



నడక: సాధారణంగా పిల్లలు 11 నుంచి 16 నెలల మధ్య నడవడం ప్రారంభిస్తారు. కొందరు ఆలస్యంగా నడవడం మొదలుపెట్టవచ్చు. 18 నెలల పిల్లలు నడవడంతో పాటు ఏదైనా వస్తువులు పట్టుకుని లాగడం, వస్తువులను దూరంగా నెట్టడం, బుక్ చేతికి ఇచ్చినప్పుడు పేజీలు తిప్పడం, క్రేయాన్స్ వంటివి ఇస్తే వాటితో నేలమీద, గోడల మీద రాయడం, నేల మీదే దృష్టిపెట్టి పరుగెత్తడం వంటివి సులభంగా చేస్తుంటారు. రెండేళ్లు వచ్చే సరికి తలుపులు తెరవడం, సొరుగులు లాగడం, చేతులు కడుక్కోవడం, మెట్లు ఎక్కడం లాంటివి చేస్తుంటారు. అయితే ఈ పనులు చేయడంలోనూ పిల్లవాడికీ, పిల్లవాడికీ మధ్య తేడాలుంటాయి.

మాటలు: ఇక మాటల విషయానికి వస్తే 15 నెలలు నిండిన చిన్నారులు ముద్దుమాటలతో పాటు, ఒకటి రెండు శబ్దాలు పలకడం చేస్తుంటారు. 18 నుంచి 24 నెలల వయసుకు వాళ్లు 15–20 పదాలు పలకడంతో పాటు తల్లిదండ్రుల సూచనలకు రెస్పాండ్ అవుతుంటారు.

18–20 నెలల వయసు వచ్చేటప్పటికి కొద్దిగా కూడా మాటలు రాకపోతే, చుట్టుపక్కల శబ్దాలకు ఏమాత్రం రెస్పాండ్ కాకపోతే... అప్పుడు అలాంటి పిల్లలకు డెవలప్‌మెంట్ డిలే ఉన్నట్లుగా పరిగణిస్తాం. అలాంటి పిల్లల్లో వినికిడి లోపాలు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఇక మీ బాబు విషయానికి వస్తే... అతడు కొన్ని శబ్దాలను పలకడం, కొన్ని వస్తువుల ఆసరాతోనైనా నిలబడటం వంటివి చేస్తున్నాడు. ఇతరత్రా సమస్యలేమీ లేవు. డెవలప్‌మెంట్ డిలేని సూచించే లక్షణాలేమీ కనిపించడం లేదు. అయితే ఇలా డెవలప్‌మెంట్ డిలే ఉన్నట్లు అనుమానించే పిల్లల విషయంలో క్రమం తప్పకుండా ఫాలో అప్‌లతో పాటు క్లోజ్ అబ్జర్వేషన్ చాలా ప్రధానం. ఒకవేళ నిజంగానే గ్రాస్ డెవలప్‌మెంట్ డిలే ఉంటే త్వరగా కనుక్కుని అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవడం (అర్లీ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్స్) ద్వారా వాళ్లను సరిచేయడానికి అవకాశం ఉంది. మీరు మీ పీడియాట్రీషియన్‌తో తరచూ ఫాలో అప్‌లో ఉండండి. మీ పీడియాట్రీషియన్ సూచనలను తప్పక పాటించండి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

సినిమా
విజయవాడ
సోమవారం
12-3-2018
సాక్షి ఫ్యామిలీ



● జస్టిన్ బీబర్, సెలెనా గోమెజ్





● లోరెంజో న్యూటన్, గెలెర్మో డెల్‌టోరో



● జెన్నీఫర్ లారెన్స్, నికోలస్ హౌల్ట్

వంద కథలున్నాయి...



● నటాలియా పోర్ట్‌మన్

''నాకు పదమూడేళ్లు ఉన్నప్పుడు ఒకతను రేప్ ఫాంటసీ లెటర్ రాశాడు.''

''ఒకసారి ఎవరో నా బాడీని కామెంట్ చేస్తూ అబ్యూజ్ చేశారు.''

''ఒక నిర్మాత సినిమా అవకాశం ఇస్తానంటూ నేరుగా నాతో పడుకోవాలన్నాడు.''

ఇవన్నీ నటి నటాలియా పోర్ట్‌మన్ చెప్పిన మాటలు. ఆమె అవార్డ్ విన్నింగ్ నటి. ఎప్పుడో కానీ దర్శకత్వ బాధ్యతల్లో ఒక మహిళ పేరు కనిపించని పేరున్న హాలీవుడ్‌లో దర్శకురాలిగానూ మెప్పించిన స్టార్. పైన చెప్పినటువంటి వంద కథలు తన జీవితంలో ఉన్నాయని చెప్పిందామె. ''మీటూ ఉద్యమం జరుగుతున్నప్పుడు.. ఇంతమంది తమకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి చెప్తుంటే నాకు ఇలాంటివి ఎప్పుడైనా జరిగాయా? అని ఆలోచించా. ఎదురవ్వలేదనిపించింది. నిజంగానే లేదా? నేనింతవరకూ లైంగిక వేధింపులకే గురికాలేదా? మళ్లీ ఆలోచించా. ఒక్కో కథ గుర్తొచ్చింది. ఒక్కో కథ. వంద కథలున్నాయి అలాంటివి. ఇలాగే అందరు అమ్మాయిలూ లెక్కలేనన్ని వేధింపులు ఎదుర్కొని ఉంటారు. అవన్నీ మరచిపోయారని కాదు. అలాంటివి ఎదురైనా నిలబడి మళ్లీ లైఫ్‌ని ఫేస్ చేస్తున్నారు. తవ్వితే ఎన్ని కథలు ఉంటాయో! మనం పోరాడుతూనే ఉండాలి. అలా ఎప్పటికీ నిలబడేంతవరకూ..'' అంటూ మీటూ ఉద్యమం గురించి మాట్లాడుతూ తన గురించి చెప్పుకొచ్చింది నటాలియా.

'మీటూ' ఓ గొప్ప ఉద్యమం అని చెప్పింది నటాలియా. మార్పు ఇక్కడైనా మొదలవ్వాలని కోరుకుందామె. అందరూ వచ్చి ఇలాంటి కథలు చెబుతూ ఉండడం కూడా మార్పు కోసం వేసే అడుగే! అలాంటి అడుగులో భాగమైన నటాలియా, పదేళ్ల తర్వాత, తన జుట్టును మొదటిసారి చిన్నగా, పిక్సీ హెయిర్‌కట్‌తో అందంగా మార్చేసుకుంది. ఈ పిక్సీ హెయిర్‌కట్‌తో, ఇలా స్టైల్‌గా నడిచొస్తూ చెప్పిందామె.. ''ఆడవాళ్లు ధైర్యంగా నిలబడాలి''.

లవ్.. బ్రేకప్.. ప్యాచప్...

హాలీవుడ్ స్పైస్

'ప్రేమలో ఉండకుండా ఉండలేరెవ్వరూ..' అని ఏ కవో ఎక్కడో చెప్పే ఉంటాడు. అలాగే ఉంటాయి ప్రేమకథలు. కొన్ని అప్పడప్పడే చూసుకుంటున్న ప్రేమలు. కొన్ని చేతులందుకున్న ప్రేమలు. కొన్ని చెయ్యి జారిన ప్రేమలు. కొన్ని జారవిడిచిన చెయ్యిని మళ్లీ అంది పట్టుకున్న ప్రేమలు. అవి ఏ కథలైనా ప్రేమకు అటో.. ఇటో.. ఉంటూనే ఉండడమే మ్యాజిక్. హాలీవుడ్‌లో ఇప్పడు ఇలా అటూ, ఇటూ, ఆ మధ్యలో కొట్టుకుంటున్న కొన్ని ప్రేమకథలను చూద్దాం...



దాచేదేముంది.. ప్రేమే

ఎమ్మా వాట్సన్ కథ ఇలా ఉంటే, మరో స్టార్ హీరోయిన్ టేలర్ స్విఫ్ట్ మాత్రం 'దాచడానికి ఏముంది? ప్రేమేగా!' అంటూ బాయ్ ఫ్రెండ్ జాయ్ అల్విన్‌తో చెట్టాపట్టాలేసుకొని తిరిగేస్తోంది. టేలర్ షూటింగ్‌తో బిజీగా ఉన్నప్పుడు, ఒకవేళ జాయ్ ఖాళీగా ఉంటే ఆమెతో పాటు షూటింగ్స్‌కు వెళ్లిపోతున్నాడు. ఇద్దరూ ఒకరి టైమింగ్స్, షెడ్యూల్స్ ప్రకారం ఇంకొకరు అడ్జస్ట్ అయిపోతూ, ప్రేమలో పడిన కొత్తల్లో, దూరం ఉండలేని ఒక ఫీలింగ్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నారు. హాలీవుడ్‌లో ఇప్పుడున్న హాట్ కపుల్స్‌లో వీళ్లూ టాప్ ప్లేసెస్‌లోనే ఉంటున్నారు.

వాళ్లు విడిపోయారు

మార్చి 4న ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఆస్కార్ అవార్డు ఫంక్షన్‌లో ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ది షేప్ ఆఫ్ వాటర్' బెస్ట్ పిక్చర్ అవార్డు అందుకుంది. అదే ఫంక్షన్‌లో ఆయన బెస్ట్ డైరెక్టర్‌గా కూడా అవార్డు అందుకున్నాడు. ఆయనే గెలెర్మో డెల్‌టోరో. ఆరోజుకు సరిగ్గా ఏడాది క్రితం తన జీవితంలో జరిగిన ఓ కీలక విషయాన్ని మాత్రం ఆయన ఆరోజు తర్వాతి రోజు వరకూ దాచాడు. అదే.. భార్య లొరెంజో న్యూటన్‌తో వేరు పడడం. ముప్పై ఏళ్ల తమ బంధానికి గతేడాది ఫిబ్రవరిలో బ్రేకప్ చెప్పుకున్నారు గెలెర్మో, న్యూటన్. అయితే ఆ విషయాన్ని ఆస్కార్ అందుకున్న రోజు వరకూ ప్రపంచానికి చెప్పలేదు గెలెర్మో. ఆయన వయస్సు ఇప్పుడు 53 సంవత్సరాలు.

వీళ్లు మళ్లీ కలిసిపోయారు

ఈ దశాబ్దంలో హాలీవుడ్‌లో హయ్యెస్ట్ పెయిడ్ యాక్టర్స్‌లో ఒకరైన జెన్నిఫర్ లారెన్స్ ప్రేమకథలు ఎప్పటికప్పుడు కొత్త మలుపులు తీసుకుంటాయి. ''నా లైఫ్‌లో బెస్ట్ రొమాన్స్ ఎప్పుడూ చూడలేదు. నాకది ఇష్టం లేదేమో కూడా!'' అంటుందామె. 2014కు ముందువరకూ నికోలస్ హౌల్ట్‌తో పీకల్లోతు ప్రేమలో ఉన్న లారెన్స్, కొన్ని అనుకోని పరిస్థితుల్లో అతనికి బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా ఈ జంట మళ్లీ కలిసిపోయింది. ఇప్పుడు కొత్తగా పాత రొమాన్స్‌ను తలుచుకుంటూ మళ్లీ ప్రేమలో పడిపోతోంది. ఈ ప్రేమ జంట మళ్లీ పూర్తిగా కలిసిపోతే మాత్రం, ఇద్దరూ ప్రేమను వెతుక్కుంటూ ఒకే దగ్గర ఆగారని చెప్పుకోవచ్చు.

లవ్వా? అదేం లేదే

''నేనంటూ ప్రేమలో ఉంటే అది నా పర్సనల్ విషయం. బయటకు అస్సలు చెప్పను. నాకు నచ్చదు.'' అంది ఎమ్మా వాట్సన్ ఒక ఇంటర్వ్యూలో. ఈ హ్యారీపాటర్ స్టార్‌కు ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో ఫాలోయింగ్ ఉందో చెప్పక్కర్లేదు. సో, ప్రేమలో ఉంటే ఎలాగూ చెప్పనని ముందే చెప్పింది కాబట్టి, ఎమ్మా ప్రేమ కథ ఏదైనా ఉంటే అది అఫీషియలా కాదా ఎవ్వరూ చెప్పలేరు. తాజాగా ఎమ్మా వాట్సన్ ఆస్కార్ పార్టీలో కోర్డ్ ఓవర్‌స్ట్రీట్‌తో కనిపించింది. మరో రెండు పార్టీల్లోనూ ఈ జంటే కలర్‌ఫుల్‌గా కనిపించింది. ఈ ఫొటోలు, వీళ్లిద్దరు కలిసి ఉండడం చూసి కోర్డ్‌తో ఆమె ప్రేమలో ఉందనుకున్నారంతా. కాకపోతే, కోర్డ్ తనకు 'జస్ట్ ఫ్రెండ్' అని చెబుతోందట ఎమ్మా. వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారని, ఇంకా అఫీషియల్‌గా ప్రేమలో అయితే పడలేదని హాలీవుడ్ సమాచారం. మరి ఇష్టపడుతున్నారంటే, త్వరలోనే ప్రేమలోనూ పడొచ్చితే.. చూడాలి!





● టేలర్ స్విఫ్ట్, జాయ్ అల్విన్



● ఎమ్మా వాట్సన్, కోర్డ్ ఓవర్ స్ట్రీట్

అటో.. ఇటో.. ఎటో..

అన్ని ప్రేమకథలదీ ఒక ఎత్తు. జస్టిన్ బీబర్, సెలెనా గోమేజ్‌ల ప్రేమకథ ఇంకో ఎత్తు. వీళ్లిద్దరూ ఎప్పుడు కలిసుంటారో, ఎప్పుడు విడిపోతారో, మళ్లీ ఎప్పుడు కలుస్తారో ఎవ్వరికీ అర్థం కాదు. ఎనిమిదేళ్లుగా ఈ ప్రేమకథ ఇలాగే నడుస్తోంది. గత జనవరిలో మళ్లీ కలిసి ఒక్కటైన ఈ జంట, తాజాగా మరోసారి 'టేక్ ఎ బ్రేక్' అనుకున్నారట. ఇప్పుడు జస్టిన్‌కు కాస్తంత దూరంగానే ఉంటోందట సెలెనా. అయితే ఇది బ్రేకప్ కాదు. టేక్ ఎ బ్రేక్ అంతే. అంటే మళ్లీ త్వరలోనే ఒక్కటైపోతారని అనుకోవాలి. ఇంకొన్నాళ్లకైనా ఈ ఆన్ అండ్ ఆఫ్ ప్రేమకథ ఒక దగ్గర ఆన్ అయి అలా వెలుగుతూనే ఉండాలని కోరుకుందాం.



● జెన్నిఫర్ లారెన్స్

యాక్టింగ్ దేవుడు



● రాబర్ట్ డెనీరో

రాబర్ట్ డెనీరోను యాక్టింగ్‌కు దేవుడిగా చెప్పుకుంటారు ఆయనను అభిమానించే వాళ్లు. ఐదు దశాబ్దాల కాలంలో లెక్కలేనంత మంది అభిమానులను సంపాదించుకొని, తాను తప్ప ఇంకెవరూ చెయ్యలేరన్న పాత్రలు చేసి మెప్పించిన డెనీరోకు ఇండియాలోనూ ఫ్యాన్స్ తక్కువేమీ లేరు. ముఖ్యంగా ఇండియన్ సినిమా సెలబ్రిటీలు తమకు బాగా ఇష్టమైన నటుల పేర్లు చెప్పమంటే వినిపించే పేర్లలో రాబర్ట్ డెనీరో పేరు ఎక్కువగా ఉంటుంది. ఇండియన్ సినిమాలో నటుడిగా తనకంటూ ఒక బ్రాండ్ సృష్టించుకున్న అనుపమ్ ఖేర్ కూడా డెనీరోకు వీరాభిమాని. వీరిద్దరూ కలిసి గతంలో 'సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్' అనే హాలీవుడ్ సినిమాలో నటించారు. అప్పట్నుంచే ఇద్దరి మధ్యా మంచి ఫ్రెండ్‌షిప్ కూడా కుదిరింది. తాజాగా అనుపమ్ ఖేర్ పుట్టినరోజు (మార్చి 7) సందర్భంగా డెనీరో తన భార్యతో కలిసి, అనుపమ్‌కు ఒక డిన్నర్ పార్టీ ఇచ్చాడు. హ్యాపీ బర్త్‌డే అంటూ డెనీరో పాట కూడా పాడాడు. ''నా జీవితంలో ఇది మర్చిపోలేని రోజు. నాకు యాక్టింగ్ దేవుడు ఇచ్చిన బర్త్‌డే పార్టీ గొప్ప సంతోషాన్నిచ్చింది.'' అంటూ అనుపమ్ ఖేర్ తన ఆనందాన్ని పంచుకున్నాడు.

నోలన్.. ఆస్కార్ ఎప్పుడు దక్కేన్?



● క్రిస్టాఫర్ నోలన్

మార్చి 4న ప్రకటించిన ఆస్కార్ అవార్డుల్లో బెస్ట్ డైరెక్టర్ క్యాటగిరీలో విన్నర్‌గా క్రిస్టొఫర్ నోలన్ అనే పేరు వినిపిస్తుందని కోట్లాది మంది ఆయన అభిమానులు ఎదురుచూశారు. 21వ శతాబ్దపు సూపర్ సక్సెస్‌ఫుల్ దర్శకుల్లో టాప్ పొజిషన్‌లో ఒకరుగా ఉంటూ వస్తోన్న క్రిస్టోఫర్ నోలన్, తన ఇరవై ఏళ్ల కెరీర్లో మొదటిసారి ఆస్కార్‌కు బెస్ట్ డైరెక్టర్‌గా ఈ ఏడాదే నామినేట్ అయ్యాడు. 'డంకర్క్' పేరుతో తన పంథాకు భిన్నంగా, ఒక వార్ డ్రామాను తెరకెక్కించిన నోలన్, ఈ సినిమాతో అయినా ఆస్కార్ తప్పకుండా అందుకుంటాడన్న ఆశలు పెట్టుకున్నారు అభిమానులు. బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్ రెండు విభాగాల్లో ఏదో ఒక విభాగానికి ఆయన అవార్డు అందుకుంటాడని భావించిన ఫ్యాన్స్‌కు ఈ ఏడాదీ నిరాశే ఎదురైంది. మరి నోలన్ అవార్డు ఎప్పుడు అందుకుంటాడు? ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల డాలర్లు కురిపిస్తోన్న సినిమాలను అందిస్తోన్న నోలన్, ఆస్కార్‌కు అర్హత సాధించేది ఎప్పుడు? నిజానికి నోలన్ గత చిత్రాలతో పోల్చి చూస్తే 'డంకర్క్' ఆయనను దర్శకుడిగా అన్నివిధాలా కొత్తగా పరిచయం చేసిన సినిమా. మేకింగ్‌లోనూ మ్యాజిక్ చూపించాడు. అయితే ఆస్కార్స్ మాత్రం గెలెర్మో డెల్‌టోరోకు మొగ్గు చూపింది. 'డంకర్క్' అన్నివిధాలా సరైన సినిమా అనుకున్నప్పుడే అవార్డు మిస్ అయింది. ఇక మళ్లీ నోలన్ సినిమా ఆస్కార్ వద్ద ఎప్పుడు నిలబడుతుందో.. నోలన్ అభిమానుల ఆస్కార్ కల ఎప్పుడు నెరవేరుతుందో!!

న్యూడ్‌గా కనిపించడం నా ఛాయిస్!

''**చు**ట్టూ సినిమా టీమ్ ఉంది. డైరెక్టర్ ఫ్రాన్సిస్ నా దగ్గరకొచ్చి, నేనప్పుడు చేస్తోన్న సీన్‌లో నేను మిస్ చేసిన చిన్న కరెక్షన్ చెబుతున్నాడు. అప్పుడు నా ఒంటి మీద బట్టలున్నట్టుగానే ఆయన నన్ను చూశాడు. నేనూ నా ఒంటి మీద బట్టలున్నట్టే భావించా. చుట్టూ ఉన్నవాళ్లంతా ప్రొఫెషనల్స్. నాకేం ఇబ్బంది అనిపించలేదు.'' జెన్నిఫర్ చెప్పిన మాటలివి. 'రెడ్ స్పారో' సినిమాలో సందర్భానుసారం ఒక సన్నివేశంలో జెన్నిఫర్ న్యూడ్‌గా కనిపించింది. ''సినిమా కథ ప్రకారం, ఆ పాత్ర అప్పుడు న్యూడ్‌గా కనిపించడం అవసరం అనుకున్నా. నో చెప్పలేదు. సినిమాల్లో న్యూడ్‌గా కనిపించాలనుకోవడం నా ఛాయిస్. ఇక్కడ ఆ అవసరం ఉందని, చుట్టూ ఉన్నవాళ్లూ కథ గురించే ఆలోచిస్తారనే ఆ సీన్ చేశా..'' అని చెప్పుకొచ్చిందామె. గత శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ స్పై థ్రిల్లర్ ప్రేక్షకులను బాగానే ఆకట్టుకొని బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ తెచ్చుకుంది.

కామెడీ థ్రిల్లర్



● జేడీ చక్రవర్తి, 'అమ్మ' రాజశేఖర్

నక్షత్ర మీడియా పతాకంపై ఖాసిం సమర్పణలో జేడీ చక్రవర్తి హీరోగా 'అమ్మ' రాజశేఖర్ దర్శకత్వంలో 'నక్షత్ర' రాజశేఖర్ నిర్మించిన యాక్షన్ కామెడీ థ్రిల్లర్ 'ఉగ్రం'. అక్షత కథానాయిక. షూటింగ్ పార్ట్ కంప్లీట్ చేసుకున్న సందర్భంగా నిర్మాత నక్షత్ర రాజశేఖర్ మాట్లాడుతూ – ''గులాబీ, సత్య వంటి హిట్ చిత్రాల తర్వాత 'అమ్మ' రాజశేఖర్ చెప్పిన కథకు జేడీ చక్రవర్తి ఎగ్జైట్ అయ్యి నటించారు. యాక్షన్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి స్కోప్ ఉన్న చిత్రం ఇది. ఉగాదికి ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ సినిమాకి కెమెరా: అంజి, సంగీతం: జాన్ పోట్ల, సహనిర్మాత: బండి శివ.

సింగిల్ షెడ్యూల్‌లో...



● వర్ణిక, అయూష్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆయూష్, వర్ణిక హీరో హీరోయిన్లుగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో వ్యాంకిష్ మీడియా పతాకంపై షేక్ గౌస్ నిర్మిస్తున్న చిత్రం గుంటూరులో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్‌నివ్వగా, నిర్మాత షేక్ గౌస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. గుంటూరు ఎస్.పి వై.టి. నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ –''నాన్‌స్టాప్‌గా ఒకే షెడ్యూల్‌లో సినిమా కంప్లీట్ చేయనున్నాం. కలకత్తా, వైజాగ్, బ్యాంకాక్‌లో షూటింగ్ జరపనున్నాం. ఏప్రిల్ చివరి వారంలో లేదా మే ఫస్ట్ వీక్‌లో సినిమా రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: అమ్మపండు, కెమెరా: దుర్గా ప్రసాద్.

నా ప్రేమ నువ్వేనా



● ఓంకార్, చోటా కె.నాయుడు, రాశీ సైనా, వాస్‌దేవ్

వాస్‌దేవ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నాలో ప్రేమ నువ్వేనా'. జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా లోగోని సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు ఆవిష్కరించి, బెస్ట్ విషెష్ చెప్పారు. వాసుదేవ్ మాట్లాడుతూ –''న్యూ ఏజ్ అండ్ డిఫరెంట్ లవ్‌స్టోరీతో తెరకెక్కిన సినిమా ఇది. త్వరలోనే పాటలను విడుదల చేసి, సమ్మర్‌లో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. రాశీ సైనా, సంజయ్ శివలింగమ్, రాజు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అర్జున్.

నెల్లూరి పెద్దారెడ్డి నవ్వులు



● మౌర్యానీ, సతీష్ రెడ్డి

సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ ముఖ్య తారలుగా సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై వీజే రెడ్డి దర్శకత్వంలో సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మించిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమాని ఈ నెల 16న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ–'' నలుగురికి మేలు చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయం కల్పిస్తాడు. ఈ క్రమంలో అతను ఎలాంటి ఊహించని పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందనే అంశాలు ఆసక్తిగా ఉంటాయి. సెంటిమెంట్ చిత్రమైనా వినోదానికి కొదవ లేదు '' అన్నారు. ''నెల్లూరి పెద్దారెడ్డి పాత్ర పేరు ప్రేక్షకులు వినే ఉంటారు. ఈ పాత్ర నాకు ఇచ్చినందుకు దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు. 28 రోజుల్లోనే షూటింగ్ కంప్లీట్ చేశాం'' అన్నారు సతీష్ రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: బాలసుబ్రహ్మణి, సంగీతం: గురురాజ్.